

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ణి
చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 99

శుక్రవారం 30-6-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 30-6-2023



ఫ్యాషన్

చినుకుల్లో స్టయిల్‌గా...

ఈ సీజన్‌లో బయటకు వస్తే
ఎప్పుడు చినుకు పడుతుందో తెలియదు.
ఆ చినుకుల్లో ఏ డ్రెస్ ఉంటే బాగుంటుందో...
ఎలా ఉండాలో తెలియక ఇబ్బందులు
అందుకే ఈ సీజన్‌లో మీ వార్డ్‌రోబ్,
బ్యూటీ రొటీన్‌లలో కూడా
మార్పులు చేసుకోక తప్పదు.
డల్‌గా ఉండే వానాకాలం వాతావరణాన్ని
బ్రైట్‌గా మార్చే ట్రెండ్స్ గురించి తెలుసుకుని
ఆచరణలో పెడితే ఈ సీజన్‌ని కూడా
చక్కగా ఎంజాయ్ చేయచ్చు.

ఎండకాలం మాదిరిగా ఇప్పుడు డ్రెస్సింగ్ కుదరదు. అలాగని, వెచ్చగా ఉంచే దుస్తులు కూడా. ఎందుకంటే, వాతావరణంలో మార్పుల వల్ల వేడి– తేమ అధికమై చెమటకు దారి తీయవచ్చు. డల్‌గా ఉండే వాతావరణాన్ని బ్రైట్‌గా మార్చేయడంలోనే కాదు, వానల్లో తడవకుండానూ స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకునేలా దుస్తుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ అవసరం అవుతుంది.



గొడుగు ఎంపిక

వర్షంలో గొడుగు తప్పని అవసరం. అయితే, అది ఎప్పుడూ బ్లాక్ కలర్‌లో రొటీన్‌గా ఉంటే బోర్‌గా అనిపిస్తుంది. మంచి బ్రైట్ కలర్స్ ఉన్నవి, స్టైలిష్‌గా ఉన్న గొడుగులను ఎంచుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా మిగతా అన్నింటికన్నా పోల్కా డాట్స్, లైన్స్ ఎప్పుడూ స్పెషల్ లుక్‌తో ఆకట్టుకుంటాయి.



వాటర్ ప్రూఫ్ షూస్

వర్షపు రోజులలో బురద గుంటలు సాధారణం. రోడ్లపై పారే నీటి నుంచి, వర్షపు ధారల నుంచి పాదాలను కాపాడుకోవాలంటే వాతావరణానికి అనువైనవి ఉండాలి. అందుకు వాటర్ ప్రూఫ్ బూట్లను ఎంచుకోవాలి. బ్లాక్ బూట్లు అయితే ఏ డ్రెస్సులకైనా బాగా నప్పుతాయి.





రెయిన్ పోంచో

ఇవి సాధారణంగా మొత్తం ఒంటిని కప్పేసే విధంగా ఉంటాయి అని అనుకుంటారు కానీ, ఇప్పుడు మార్కెట్‌లో విభిన్న మోడల్స్‌లో రెయిన్ పోంచోస్ వచ్చాయి. ఇవి చాలా సౌకర్యవంతంగా, స్టైలిష్‌గా ఉంటాయి. అలాగే వేసుకున్న దుస్తులను వానకు తడవకుండా కాపాడుకోవచ్చు. గొడుగు కూడా వాడలేనంత వర్షం కురుస్తున్నప్పుడు ఇవి చాలా బాగా పనిచేస్తాయి. అంతేకాదు, వర్షాకాలానికి తల తడిస్తే, జుట్టు చిట్లిపోతుంది. జుట్టుకు రక్షణగా కూడా రెయిన్ పోంచో హుడ్ ను కప్పుకోవచ్చు. స్టైలిష్‌గానూ కనిపిస్తారు. మీ రెయిన్ పోంచో వాటర్‌ప్రూఫ్ ఫ్యాబ్రిక్ కింద పొడిగా ఉండగలుగుతారు.



రెయినీ హ్యాట్

వర్షపు రోజుల్లో టోపీ ని ధరించడం ద్వారా మీ స్టైల్‌ని అప్‌గ్రేడ్ చేయవచ్చు. మీ పోంచో, కోటుకు హుడీ లేకపోతే ఒక ట్రెండీ హ్యాట్‌ను వాడచ్చు. అయితే, టోపీ ఉన్నప్పటికీ వెంట గొడుగు మాత్రం వాడాల్సిందే.



ట్రెంచ్ కోట్

వర్షం రోజుల్లో డ్రెస్సింగ్ గురించి ఆలోచించినప్పుడు ఖాకీ రంగు డబుల్ బ్రెస్ట్ ట్రెంచ్ కోట్ గుర్తుకు వస్తుంది. అయితే, వీటిలో ఇప్పుడు విభిన్నరకాల కలర్స్... ఫ్యాబ్రిక్‌లో మార్పులు చేసినవి మార్కెట్లోకి వచ్చాయి. నేటి కాలానికి తగినట్టుగా ఆకట్టుకుంటున్నాయి.



మిలిటరీ స్టైల్ కోట్లు

జీన్స్, టీ షర్ట్ పైకి ఓ మిలిటరీ స్టైల్ కోటు ధరిస్తే చాలు మీ రూపం మరింత ఆధునికంగా మారిపోతుంది. మగవారికి అనువుగా రూపొందిన ఈ డ్రెస్ మగువలకు మరింత ప్రత్యేకమైన డ్రెస్సింగ్‌గా ఈ సీజన్ మార్చే సింది.

కొత్త కెరీర్‌కు కుంకుమ బొట్టు

**కుంకుమ పువ్వు ఎలా వస్తుంది?
కుంకుమతో తయారు చేస్తారా?
లేక... మొక్కకు పూస్తుందా?
ఇది నిజంగా పువ్వేనా?
చూస్తే పువ్వులా కనిపించదే మరి!
అయినా... ఈ మొక్కలు ఎక్కడ ఉంటాయి?
ఎవరు పెంచుతారు? ఎలా పెంచుతారు?
ఈ సందేహాలకు చక్కటి వివరణ ఇస్తోంది...
ఎర్ర బంగారాన్ని పండిస్తున్న శ్రీనిధి.**



● శ్రీనిధి

కశ్మీర్ కుంకుమ పువ్వుకు మన తెలుగు నేల కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వీపుకు బుట్ట కట్టుకుని టీ తోటలో కలియతిరుగుతూ మునివేళ్లతో లేత చివుళ్లను కోసి బుట్టలో వేసుకునే అస్సామీ అమ్మాయిలను చూస్తుంటాం. భూతల స్వర్గం లాంటి కశ్మీర్ నేల మీద లేతనీలిరంగు పూలను కోసి బుట్టలో వేస్తున్న మహిళలనూ చూస్తాం. కానీ అది కుంకుమ పువ్వు అని నమ్మాలంటే ఏదో సందేహం వెంటాడుతూనే ఉంటుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అన్నమయ్య జిల్లా, మదనపల్లె, పొన్నేటిపాలేనికి చెందిన ఓ తెలుగమ్మాయి శ్రీనిధి ఆ సందేహాలను నివృత్తి చేస్తోంది. కుంకుమ పువ్వు సాగు చేస్తూ మనకు పెద్దగా పరిచయం లేని రంగాన్ని ఎంచుకుని ట్రెండ్ సెట్టర్ అవుతోంది. కెరీర్ అంటే... ఇంటర్ తర్వాత బీటెక్ చేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో కంప్యూటర్ ముందు చేసే ఉద్యోగాలే అనుకుంటున్న సమాజానికి కొత్త దారి చూపిస్తోంది శ్రీనిధి. 'వ్యవసాయ రంగం విస్తారమైనది. ఒకింత సృజనాత్మకతతో ముందుకెళ్తే మనమే మరికొందరికి మార్గదర్శనం చేసినవారమవుతాం' అంటూ... కుంకుమ పువ్వు సాగులో తన అనుభవాలను ఆమె సాక్షితో పంచుకుంది.

''నేను బెంగళూరులో ఏజీ బీఎస్సీ, వారణాసిలోని బీహెచ్‌యూలో ఎమ్మెస్సీ సాయిల్ సైన్స్ చేశాను. 'వ్యవసాయ రంగం ఎంతో విస్తారమైనది, అందులో నీకు తెలియని ఎంతో జ్ఞానం ఉంది' అని నాన్న చెప్పిన మాటలే నన్ను నడిపించాయి. ఆ ఇంటరెస్ట్‌తో సాగు కోర్సునే చదివాను. కుంకుమ పువ్వు సాగును ఎంచుకోవడానికి మా పర్పుల్ స్ప్రింగ్స్ కంపెనీ కో పార్టనర్ శ్రీనాథ్ కారణం. తను అగ్రికల్చర్‌లో పీహెచ్‌డీ స్కాలర్. కుంకుమ పువ్వు సాగును సిలబస్‌లో ఒక భాగంగా చదివాను, కానీ ఆచరణలో విజయం సాధించడానికి మరింతగా అధ్యయనం చేశాను, ఇంకా చేస్తున్నాను.



● నీలి రెక్కల మధ్య తలలూపుతున్న ఎర్రటి కేసరాలే కుంకుమ పూలు

సాగు శోధన

ఈ ఆలోచన 2021లో వచ్చింది. మరుసటి ఏడాది ఫిబ్రవరికి రంగంలోకి దిగాం. అది నేరుగా సాగు కాదు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్. రెండు వందల యాభై చదరపు అడుగుల గదిలో అరలను ఏర్పాటు చేసి దాదాపు 550 అడుగుల విస్తీర్ణంలో కుంకుమ పువ్వు గింజలు నాటాం. మట్టి లేకుండా ఏరోపోనిక్ విధానంలో సాగు చేస్తున్నాం. గదిలో ర్యాక్‌లు, చిల్లర్‌లు, కశ్మీర్‌కి వెళ్లి సీడ్ కొనుగోలు, రవాణా ఇతర ఖర్చులన్నీ కలిపి పది లక్షలు ఖర్చయింది. ఇది ఏడాదికి ఒక పంట వస్తుంది. తొలి ఏడాది దిగుబడి రెండు వందల గ్రాములు వచ్చింది. ఇప్పుడు రెండో పంట సాగు చేస్తున్నాం.

ఈ సాగు సెలవు ఇవ్వదు

కుంకుమ పువ్వు సాగు అంటే నిరంతరం పంట క్షేత్రాన్ని కనిపెట్టుకుని ఉండాల్సిందే. వెకేషన్‌కు వెళ్లాలంటే ఆగస్టు నుంచి మే నెల వరకు అసలే కుదరదు. మే నుంచి ఆగస్టు మధ్యలో కొంత వెసులుబాటు ఉంటుంది, కానీ పూర్తిగా హాలిడే కాదు. మరొకరికి బాధ్యత అప్పగించి వెళ్లి, పర్యవేక్షించుకుంటూ ఉండాలి. ఇండోర్‌లో చేసే కుంకుమ పువ్వు సాగుకు ఎక్కువ మంది సహాయకుల అవసరం ఉండదు. ఎందుకంటే శీతల గదిలోకి ఎక్కువ మంది వెళ్లరాదు. చాలా పరిశుభ్రత పాటించాలి. తలకు క్యాప్, చేతులకు గ్లవ్స్ తొడుక్కుని పూలు కోయాలి. ఆ పూలను నీడలో ఆరబెట్టి, ఆరిన తర్వాత పూలలోని రేకలను ఫోర్సెప్స్‌తో వేరు చేయాలి. ఆ రేకలు(కేసరాలు) కుంకుమపువ్వు. గ్రాము కుంకుమ పువ్వులో వేల రేకలుంటాయి.

రేక తీయడం ఓ చాలెంజ్

చెట్టు నుంచి పూలు కోయడం, పువ్వు నుంచి రేకలను విరగకుండా వేరు చేయడంలో నైపుణ్యం చాలా అవసరం. ఈ సాగులో అసలైన సవాలు ఇదే. ఈ సాగు మనకు కొత్త కాబట్టి మన దగ్గర ఎవరికీ పరిచయం ఉండదు. సహాయకులకు నేనే శిక్షణ ఇచ్చాను. పూలు విచ్చుకోవడం మొదలు పెట్టిన తర్వాత 15–25 రోజుల్లో అన్ని పూలూ విచ్చుకుంటాయి, పంట పూర్తవుతుంది. విరిసిన పువ్వుని ఇరవై నాలుగ్గంటల్లోపల చెట్టు నుంచి కోసేయాలి. పూల కాలం పూర్తయిన తరవాత చెట్టు నవంబర్ నుంచి మే నెల మధ్యలో గింజలను పెంచుకుంటుంది. దీనిని సీడ్ మల్టిప్లికేషన్ అంటాం. ప్రతిసారీ కశ్మీర్‌కెళ్లి విత్తనాలు తెచ్చుకోవాల్సిన అవసరం ఉండదు. మనకు కావల్సిన సీడ్స్ మనమే తయారు చేసుకోవచ్చన్నమాట. మేము పరిశోధన దశలోనే ఉన్నాం. పంట పంటకూ విత్తనాల సంఖ్య పెంచుకుంటూ సాగు విస్తీర్ణం పెంచుకోవాలి. కచ్చితంగా చెప్పలేను, కానీ పెట్టుబడి, ఇతర ఖర్చులన్నీ పోయి ఆదాయంలోకి రావాలంటే మరో మూడేళ్లు పట్టవచ్చు.

హార్డ్ వర్కే కాదు స్మార్ట్‌గానూ చేయాలి

చల్లదనాన్ని పది డిగ్రీల నుంచి 22 డిగ్రీల మధ్యలో పంట దశను బట్టి మారుస్తుండాలి. కరెంటు పోకూడదు, హెవీ కెపాసిటీలో ఒక చిల్లర్ తీసుకోవడం కంటే మీడియం కెపాసిటీ చిల్లర్‌లు రెండింటిని అమర్చుకుంటే ఒకదానికి రిపేర్ వచ్చినా పెద్దగా ఇబ్బంది ఉండదు. ఏ రంగమైనా సరే... మనం అంకితభావంతో పని చేస్తే మంచి ఫలితాలనే ఇస్తుంది. హార్డ్‌వర్క్‌తోపాటు స్మార్ట్ వర్క్ కూడా అవసరమే. నా పంటను ఆన్‌లైన్‌లోనే అమ్మాను. ఇప్పుడు కుంకుమ పువ్వు సాగులో మెళకువలు నేర్చుకుంటున్నాను. ఆ తర్వాత సాగు విస్తీర్ణం పెంచుకుంటూ మార్కెట్‌ను విస్తరిస్తాను'' అన్నారు శ్రీనిధి.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎర్ర బంగారం!

కుంకుమ పువ్వు అవసరం చాలా ఉంది. అవసరానికి తగినంత లభ్యత లేదు. దాంతో మార్కెట్‌ని నకిలీలు రాజ్యమేలుతున్నాయి. ఇది చాలా ఖరీదైన సుగంధద్రవ్యం. అందుకే ఎర్ర బంగారం అంటారు. మన దగ్గర పంట ఉండాలే కానీ కేజీల్లో కొనేవాళ్లు కూడా ఉన్నారు. సౌందర్యసాధనాల తయారీ పరిశ్రమలు, ఔషధాల పరిశ్రమలు, ఆహార, పానీయాల తయారీదారులు టోకుగా కొంటారు. మన దగ్గర వంటల్లో కుంకుమ పువ్వు వాడకం బాగా తక్కువ. గర్భిణులు మాత్రం పాలల్లో కలుపుకుంటూ ఉంటారు. అయితే... కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగితే బిడ్డ తెల్లగా పుడతారనే విశ్వాసాన్ని మేము నిర్ధారించలేం. శాస్త్రీయంగా ఆధారం ఏదీ లేదు. కానీ ఆహారంలో కుంకుమ పువ్వు తీసుకున్న వారి చర్మం ఆరోగ్యంగా, క్లియర్‌గా, కాంతివంతంగా మారుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ వంటి కొన్ని ఔషధ గుణాలు గాయాలను మాన్పడం వంటి ప్రయోజనాలతో ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి కాబట్టి గర్భిణులే కాదు మామూలు వాళ్లు కూడా తీసుకోవచ్చు.

– పప్పు శ్రీనిధి, కుంకుమ పువ్వు రైతు



వంటిల్లు

కాడలేనా..? ఆకులూ అమోఘమే!

ప్రస్తుతం కూరగాయలన్నీ అందనంత ధరల్లో కొండెక్కి కూర్చున్నాయి. అందుబాటు ధరలో ఉన్న మునగ కాడలను తినము. అయితే మునగలో పుష్కలంగా పోషకాలుంటాయి. అందుకే కాడలు కాకుండా మునగాకును ఇలా కూడా తినవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు...



మొరింగా దోశ

కావలసినవి : మునగ ఆకులు – రెండు కప్పులు; ఇడ్లీ పిండి – రెండు కప్పులు; నూనె – మూడు టీస్పూన్లు; జీలకర్ర – అరటీస్పూను ; మిరియాలు – అరటీస్పూను ; వెల్లుల్లి రెబ్బలు – నాలుగు; ఇంగువ – చిటికెడు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● బాణలిలో రెండు టీస్పూన్లు నూనె వేసి వేడెక్కనివ్వాలి. ● కాగిన నూనెలో జీలకర్ర, మిరియాలు, వెల్లుల్లి, ఇంగువ వేసి మంచి వాసన వచ్చేవరకు వేయించాలి. ● ఇవన్నీ వేగాక కడిగి పెట్టుకున్న మునగ ఆకులు వేయాలి. ఆకుల్లోని నీరంతా ఇగిరిపోయాక దించేయాలి. ● మునగ ఆకుల మిశ్రమం చల్లారాక ఉప్పు, కొద్దిగా నీళ్లు పోసి పేస్టులా రుబ్బుకోవాలి. ● ఇప్పుడు ఇడ్లీ పిండిలో ఈ పేస్టుని వేసి, రుచికి సరిపడా ఉప్పు వేసి దోశ పిండిలా కలుపుకోవాలి. ● దోశపెనం వేడెక్కిన తరువాత పిండిని దోశలా పోసుకుని, టీస్పూను నూనె వేసి రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే మొరింగాదోశ రెడీ. సాంబార్, కొబ్బరి చట్నీలు దీనికి మంచి కాంబినేషన్.



ఎనర్జీ బాల్స్

కావలసినవి : రాగిపిండి – అరకప్పు ; మునగ ఆకు పొడి – ముప్పావు కప్పు ; ఎండిన అంజీర పండ్లు – ఆరు ; కర్జూరం – పన్నెండు ; కిస్‌మిస్ – పావు కప్పు ; జీడిపప్పు – పావు కప్పు ; బాదం – పావు కప్పు ; పిస్తా – పావు కప్పు ; ఎండు కొబ్బరి తురుము – పావు కప్పు; బెల్లం పొడి – పావు కప్పు; యాలకుల పొడి – టీస్పూను; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు; ఎండు కొబ్బరి పొడి – రెండు టేబుల్ స్పూన్లు (గార్నిష్‌కు సరిపడా).

తయారీ: ● అంజీర పండ్లు, కర్జూరం విత్తనాలు తీసేసి వేడినీటిలో పదిహేను నిమిషాలు నానబెట్టుకోవాలి. ● బాణలిలో టేబుల్ స్పూను నెయ్యి వేసి రాగి పిండి వేసి వేయించాలి. రాగిపిండి మంచి వాసన వస్తున్నప్పుడు మునగాకు పొడి వేసి ఐదు నిమిషాలు వేయించి తీసేయాలి. ● ఇదే బాణలిలో డ్రైఫ్రూట్స్ అన్నింటిని దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. చివరగా ఎండు కొబ్బరిని కూడా వేయించుకోవాలి. ● వేయించిన డ్రైఫ్రూట్స్‌ను మిక్సీజార్‌లో వేసి పొడిచేసుకోవాలి. ● నానబెట్టిన కర్జూరం, అంజీరను పేస్టులా గ్రైండ్ చేయాలి. ● బాణలిలో మరో టేబుల్ స్పూను నెయ్యివేసి అంజీర పేస్టుని వేసి సన్నని మంట మీద నెయ్యి పైకి తేలేంత వరకు వేయించాలి. ● వేగాక డ్రైఫ్రూట్స్ పొడి, రాగి, మునగాకు, యాలక్కాయ, బెల్లం పొడులు వేసి కలపాలి. ● బెల్లం పూర్తిగా కరిగిన తరువాత పిండి మిశ్రమాన్ని లడ్డులా చుట్టుకుని కొబ్బరి పొడిలో అద్దుకుంటే ఎనర్జీ బాల్స్ రెడీ. గాలిచొరబడని డబ్బాలో నిల్వచేస్తే పదిహేను రోజులపాటు తాజాగా ఉంటాయి.





ఫ్లవర్ ఫ్రై

కావలసినవి : మునగ పువ్వులు – రెండు కప్పులు; నూనె – రెండు టేబుల్ స్పూన్లు; జీలకర్ర – అరటీస్పూను; ఉల్లిపాయ తరుగు – అర కప్పు; పచ్చిమిర్చి – రెండు; గుడ్లు – మూడు; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా ; నిమ్మరసం – టీస్పూను.

తయారీ: ● మునగ పువ్వులను నీటిలో ఐదు నిమిషాలు నానబెట్టాలి. తరువాత శుభ్రంగా కడిగి, నీటిని పిండి పక్కన పెట్టుకోవాలి. ● బాణలిలో నూనె వేసి కాగనివ్వాలి. కాగిన నూనెలో జీలకర్ర, ఉల్లి తరుగు, సన్నగా తరుక్కున్న పచ్చిమిర్చిని వేసి వేయించాలి. ● ఇవన్నీ వేగాక మునగ పువ్వులు, కరివేపాకు వేసి కలపాలి ● ఐదు నిమిషాలు మూతపెట్టి మగ్గనివ్వాలి. ● పువ్వులు మగ్గాక గుడ్లసొన వేసి కలపాలి. ● చక్కగా వేగాక, రుచికి సరిపడా ఉప్పు వేసి నూనె పైకి తేలేంత వరకు వేయించాలి. ● చివరగా కొత్తిమీర తరుగు చల్లి దించేయాలి. నిమ్మరసం చల్లుకుని అన్నం, చపాతీల్లోకి సర్వ్ చేసుకోవాలి.

మసాలా మజ్జిగ

కావలసినవి : పెరుగు – ఒకటిన్నర కప్పులు, జీలకర్ర పొడి – అరటీస్పూను; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; బ్లాక్ రాక్‌సాల్ట్ – అరటీస్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; కరివేపాకు తరుగు – అరటీస్పూను; మునగాకు పొడి – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; దాల్చిన చెక్క పొడి – పావు టీస్పూను; చల్లని నీళ్లు – రెండు గ్లాసులు.

తయారీ: ● మిక్సీజార్‌లో కరివేపాకు, కొత్తిమీర, పుదీనా, మునగాకుపొడి, జీలకర్ర పొడి, రాక్‌సాల్ట్ వేసి గ్రైండ్ చేయాలి. ● ఇవన్నీ నలిగిన తరువాత పెరుగు వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. ● ఈ మిశ్రమంలో నీళ్లు పోసి కలుపుకుని, దాల్చినచెక్క పొడితో గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి.

ఉపాధి



గుజరాత్‌లోని కచ్‌లో ఒక మారుమూల గ్రామవాసి పాబిబెన్ రబారి. మేకలు, గొర్రెల పెంపకమే ప్రధాన వృత్తిగా ఉన్న పాబిబెన్ ఇప్పుడు 300 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. జరీ ఎంబ్రాయిడరీ, బ్యాగుల తయారీతో ప్రపంచ వ్యాప్తంగా పేరు సంపాదించింది. హస్తకళాకారిణిగా ఆమె కృషి, సాధించిన విజయం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

ఆమె పేరే ఓ బ్రాండ్

పాబిబెన్ బాల్యం తీవ్ర కష్టాలతో గడిచింది. ఐదేళ్ల వయసులో తండ్రిని కోల్పోవడం, తల్లి కొన్ని ఇళ్లలో పాచిపని చేస్తూ తనను, తన చెల్లెలిని పెంచిన విధానాన్ని, మేకలను, గొర్రెలను మేపుకుంటూ బతికిన రోజులను గుర్తు చేసుకుంటుంది ఆమె. ఉన్న కొద్దిపాటి సమయంలో తల్లి సంప్రదాయ ఎంబ్రాయిడరీ పని చేస్తుండేది. అక్కడి వారి కమ్యూనిటీ వివాహ వేడుకల సమయాల్లో తప్పనిసరిగా ధరించే సంప్రదాయ ఎంబ్రాయిడరీ బ్లౌజులు, దుప్పట్లను తయారు చేసేది. ఒక్కో సంప్రదాయ ఎంబ్రాయిడరీ తయారీకి ఏడాదికి పైగా సమయం పట్టేది. ఈ సంప్రదాయం కారణంగా వారి కమ్యూనిటీలో వివాహాలు ఆలస్యం అయ్యేవి. దీంతో కొన్నాళ్లకు ఈ ఎంబ్రాయిడరీని ఆ కమ్యూనిటీ పక్కనపెట్టేసింది. ఈ సమయంలోనే పాబిబెన్ ఈ సంప్రదాయ ఎంబ్రాయిడరీలో ప్రావీణ్యం సాధించింది. ఒక కళారూపం కనుమరుగు కాకుండా కాపాడాలని నిశ్చయించుకుంది. తమ కమ్యూనిటీలో సంప్రదాయ ఎంబ్రాయిడరీని ప్రతిబింబించే కొత్త రూపాన్ని కనిపెట్టింది. ఇది వేగంగా, తక్కువ శ్రమతో కూడుకున్న కళ కావడంతో అందరినీ తన వైపుకు తిప్పుకుంది.

* * *

పాబిబెన్ మొదట నలుగురైదుగురు మహిళలతో కలిసి వివాహ సమయంలో ధరించే ఎంబ్రాయిడరీ బ్లౌజ్‌లను తయారు చేసేది. చదువు లేకపోయినా తమకు వచ్చిన కళను కాపాడాలని, సాటి మహిళలకు ఉపాధి కల్పించాలనుకొని కొన్ని స్వచ్ఛంద సంస్థలను కలిసింది. కళలకు సంబంధించిన ఆ సంస్థల నుండి కొన్ని ప్రాజెక్ట్ వర్క్‌లను తీసుకుంది. 'కానీ, నన్ను ఒక ఆలోచన ఎప్పుడూ వేధిస్తూనే ఉండేది. ఈ కళ మా సొంతం. కానీ, మాకు సరైన గుర్తింపు వచ్చేది కాదు. మేం తయారు చేసిన వాటిని వేర్వేరు బ్రాండ్‌ల కింద అమ్మేవారు. దీనినుంచి బయటపడేందుకు, మా హస్తకళకు మేమే ప్రాచుర్యం తెచ్చుకోవాలని ఉండేది. దీంతో పెద్దస్థాయి అధికారులను కలిశాను. వారి సూచనల మేరకు మా కళకు ఒక ఇంటిని ఏర్పాటు చేశాం. చేతివృత్తుల వారికి మార్కెట్ ప్లేస్‌గా ఆ స్థలాన్ని ప్రారంభించాం. మొదట ఇది చిన్న వ్యాపారంగానే ప్రారంభమైంది కానీ, పనితో పాటు గుర్తింపు కూడా రావాలనుకున్నాను. అది ఈ ఏడేళ్ల సమయంలో సాధించగలిగాం' అని చెబుతుంది పాబిబెన్.

పాబిబెన్ మొదటి ఉత్పత్తి స్లింగ్ బ్యాగ్. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'పాబీ బ్యాగ్' అని ఆమె పేరుతోనే ఆ బ్యాగ్‌ను పిలిచేటంత ఘనత సాధించింది ఈ హస్తకళాకారిణి. పాబిబెన్ బ్రాండ్‌తో ఈ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన 'పాబిబెన్.కామ్' అక్కడి గ్రామీణ మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలను తెచ్చిపెడుతోంది.



● తమ గ్రూప్ మహిళలతో...



● పాబిబెన్ బ్యాగ్..

శుక్రవారం 30-6-2023



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 99



నాలుగో విజయం

ఆసియా కబడ్డీ చాంపియన్‌షిప్ లీగ్ మ్యాచ్‌లో ఇరాన్‌పై భారత్ గెలుపు -13లో



రూ.20 వేల కోట్ల పెట్టుబడులు

పదేళ్లలో విస్తరించేందుకు అదానీ టోటల్ గ్యాస్ భారీ ప్రణాళిక - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ?

జూలై 3న కేంద్ర కేబినెట్ సమావేశమవ్వనుంది. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ వార్తల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

వివరాలు 6లో ▸



బెంగళూరులో రెండో భేటీ

బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా చేతులు కలిపిన ప్రతిపక్ష పార్టీలు బెంగళూరులో సమావేశమవుతాయని ఎన్సీపీ చీఫ్ పవార్ తెలిపారు.

వివరాలు 6లో ▸



బాలల సంరక్షణలో భారత్ భేష్

సాయుధ ఘర్షణల ప్రభావం పడకుండా చిన్నారుల సంరక్షణ కోసం భారత్ తీసుకున్న చర్యలను ఐక్యరాజ్యసమితి స్వాగతించింది.

వివరాలు 6లో ▸



బైడెన్‌కు తీవ్ర నిద్ర సమస్య

బైడెన్ స్లీప్ అప్నియాతో బాధపడుతున్నారని.. నిద్ర కోసం సీపాప్ అనే యంత్రాన్ని వాడుతున్నారని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

క్లాస్ ఆఫ్ 2023



ఆస్కార్ సభ్యులుగా భారత్ నుంచి 15 మందికి చోటు లభించింది. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి సంబంధించిన ఆరుగురు ఈ జాబితాలో ఉన్నారు. 51 దేశాలకు చెందిన 398 మందితో జాబితా తయారు చేసినట్లు అకాడమీ పేర్కొంది.

వివరాలు 10లో ▸

8వ తరగతి సిలబస్ తగ్గింపు



ఎనిమిదో తరగతి సిలబస్‌ను ఎన్సీఈఆర్టీ బోర్డు తగ్గించింది. ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌లలోని కొన్ని చాప్టర్లను పాక్షికంగా కుదించింది. మరికొన్నింటిని పూర్తిగా తొలగించింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

వివరాలు 3లో ▸

భగ్గుమన్న ఫ్రాన్స్



పోలీసు కాల్పుల్లో 17 ఏళ్ల యువకుడు మృతి ఘటనతో ఫ్రాన్స్ భగ్గుమంది. పారిస్ శివారులోని నాంటెర్రెలోని ట్రాఫిక్ స్టాప్ వద్ద మంగళవారం నహెల్ అనే యువకుడిని పోలీసులు కాల్చి చంపారు. ఈ ఘటనతో రెండు రోజులుగా హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి.

వివరాలు 6లో ▸

మణిపూర్‌లో రాహుల్ అడ్డగింత



మణిపూర్‌లో అల్లర్ల బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన కాంగ్రెస్ నేత రాహుల్ కాన్వాయ్‌ను పోలీసులు కొన్ని గంటల పాటు అడ్డుకున్నారు. ఆ తర్వాత ఆయన హెలికాప్టర్‌లో చురాచాంద్‌పూర్‌కు వెళ్లి.. బాధితులను పరామర్శించారు.

వివరాలు 6లో ▸

దొరికిన దొంగలు


భుజాలు తడుముకుంటున్న పచ్చ ఓట్ల బ్యాచ్

ఇప్పుడు బయట పడుతున్న దొంగ ఓట్లన్నీ 2019 జనవరికి ముందు చేర్చినవే

ఫ్యాక్ట్ చెక్


- ఇదే విషయాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి స్పష్టం చేసినా ఆగని తప్పుడు ప్రచారం
- ఇప్పుడే దొంగ ఓట్లు చేర్చినట్లు ఈనాడు, దాని తోక పత్రిక దుష్ప్రచారం
- నాడు ఐటీ గ్రిడ్ పేరుతో డేటా తస్కరించి భారీగా దొంగ ఓట్లను చేర్పించిన టీడీపీ
- ఇప్పుడు ఆధార్ సీడింగ్‌తో బాగోతం వెలుగులోకి..
- ఇలా 15 లక్షల ఓట్లలో ఇప్పటికే 10.20 లక్షలు తొలగింపు
- టీడీపీ కష్టాల్లో పడుతుందని ఎక్కడాలేని అక్కసు
- ఆ నిందను ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై వేసే ఎత్తుగడ
- ఫిర్యాదులంటూ టీడీపీ కూనిరాగాలు.. ఎల్లో మీడియా తందానా

2లో



ELECTORAL ROLL 2019 S01 Andhra Pradesh

2019కి ముందు చంద్రబాబు హయాంలో విజయవాడలో అసలు ఇంటి నంబర్ లేకుండా కడియాల వారి వీధి పేరుతో నమోదైన 575 ఓట్లు



ELECTORAL ROLL 2023 S01 Andhra Pradesh

2023 ఓటర్ల జాబితాలో అదే అడ్రస్‌పై 459కు తగ్గిన ఓట్లు

టీడీపీ దొంగ ఓట్ల వేషాలు ఇప్పుడు బయట పడుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓట్ల సవరణ కార్యక్రమంలో భాగంగా నిశిత పరిశీలనకు తోడు, ఆధార్ సీడింగ్ చేస్తుండటంతో 2019లో టీడీపీ భారీగా చేర్పించిన దొంగ ఓట్ల బాగోతం బట్టబయలవుతోంది. ఈ విషయం ప్రజల్లోకి వెళితే పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని రాజగురివింద విలవిల్లాడిపోతున్నారు. ఈ తప్పులకు వక్రభాష్యాలు చెబుతూ విష ప్రచారానికి తెరలేపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే ఇది జరిగినట్లు ఈనాడులో దుష్ప్రచారం చేస్తున్నారు.

ఆ ఓట్లన్నీ ఒకే వీధి పేరుపై 2019లోనే నమోదయ్యాయనే విషయం నిజంగా మీకు తెలియదా రామోజీ? ఇప్పుడు ఆ నకిలీ ఓట్లను తొలగిస్తుంటే.. మీరు, మీ తోక పత్రిక విషపు రాతలతో రంకెలు వేయడం ఎవరి కోసం? మీ బాబు బాగోతం బట్టబయలైందని ఆక్రోశమా? ఈ బురద ప్రభుత్వంపై చల్లి టీడీపీని రక్షించాలనే తాపత్రయమా? 'దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లు' దొంగ ఓట్లపై ఫిర్యాదు చేయడం ద్వారా టీడీపీ కూనిరాగాలు తీస్తుంటే.. ఎల్లో మీడియా తందానా అంటూ తబలా వాయిస్తుండటం అందరికీ కనిపిస్తోంది.

చంద్రబాబు చంపేసిన చిత్తూరు డెయిరీకి

పునరుజ్జీవం

నాడు హెరిటేజ్ కోసం నిర్వీర్యం

ఆర్థిక నష్టాలకు గురిచేసి 2002లో మూత

- 21 ఏళ్ల తర్వాత పునరుద్ధరణకు రంగం సిద్ధం.. జూలై 4న సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన
- రూ.182 కోట్ల అప్పులు తీర్చి.. అడుగులు ముందుకు
- రూ.385 కోట్ల పెట్టుబడి పెట్టనున్న అమూల్ సంస్థ
- తొలుత రూ.150 కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఐస్ క్రీం ప్లాంట్ ఏర్పాటు
- దశల వారీగా పాల కర్మాగారం, బటర్, పాలపొడి, చీజ్, పన్నీర్ యూనిట్లు
- యోగర్ట్, స్వీట్స్ తయారీ, యూహెచ్‌టీ విభాగాల ఏర్పాటు
- 5 వేల మందికి ఉపాధి.. 25 లక్షల మంది పాడి రైతులకు లబ్ధి
- అమూల్ వల్ల రెండేళ్లల్లో రైతులకు ప్రైవేట్ డెయిరీలు అదనంగా చెల్లించింది రూ. 3,754 కోట్లు



చిత్తూరు డెయిరీ

సాక్షి, అమరావతి: దేశంలోనే రెండో అతిపెద్ద పాల కర్మాగారంగా పేరొందిన చిత్తూరు విజయా డెయిరీని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జూలై 4వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా భూమి పూజ చేసేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. శంకుస్థాపన తర్వాత 10 నెలల్లో ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. చిత్తూరు డెయిరీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. స్వాతంత్య్రానికి పూర్వం 1945లో చిల్లింగ్ ప్లాంట్‌గా ఏర్పడగా, 1969లో పూర్తి స్థాయి డెయిరీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత రోజుకు 2 లక్షల లీటర్ల

మిగతా 2వ పేజీలో ▶

గ్రామీణ యువతకు శిక్షణ, ఉపాధిలో ఏపీ స్పీడ్

నైపుణ్య శిక్షణలో మూడో స్థానం.. ఉద్యోగాల్లో రెండో స్థానం

- దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద శిక్షణ
- ఒడిశాకు శిక్షణ, ప్లేస్‌మెంట్‌లోనూ మొదటి స్థానం.. దేశవ్యాప్తంగా 14.51 లక్షల మందికి శిక్షణ
- ఇందులో8.70 లక్షల మందికి ప్లేస్‌మెంట్..
- కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడి



సాక్షి, అమరావతి: గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తొలి ఐదు రాష్ట్రాల్లో స్థానం సంపాదించుకుంది. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణలో మూడో స్థానం, వారు ఉపాధి పొందడం (ప్లేస్‌మెంట్స్)లో రెండో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద దేశంలోని 27 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇప్పటి వరకు 14.51 లక్షల మంది గ్రామీణ యువత శిక్షణ పొందగా ఇందులో 8.70 లక్షల మంది ఉపాధి పొందినట్లు తెలిపింది. గ్రామీణ యువతకు వృత్తిపరమైన లేదా వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ఈ పథకం కింద నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడంలో ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. శిక్షణ పొందిన అభ్యర్థులు ఉద్యోగాలు సాధించడంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. 15 నుంచి 35 ఏళ్ల లోపు పేద కుటుంబాలకు చెందిన గ్రామీణ యువతకు ఈ పథకం కింద

మిగతా 2వ పేజీలో ▶

ఐటీ రీఫండ్ స్కాం!

కమీషన్ ఆశ చూపి కొందరు ఉద్యోగులకు వర్తించని సెక్షన్ల కింద రిటర్న్‌లు ఫైల్

రూ. 40 కోట్ల కుంభకోణం.. 8 కన్సల్టెన్సీల నిర్వాకం

సాక్షి, హైదరాబాద్: ఆదాయపన్ను శాఖ నుంచి పన్ను రీఫండ్‌లో భారీ కుంభకోణం జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఐటీ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 40 కోట్ల మేర రీఫండ్ పేరిట స్కాం జరిగినట్లు తెలుస్తోంది. ఐటీ ఇన్వెస్టిగేషన్ వింగ్, హైదరాబాద్ బృందాలు రెండు రోజుల క్రితం హైదరాబాద్, విజయవాడల్లోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన దర్యాప్తులో ఈ విషయం

మిగతా 2వ పేజీలో ▶



ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లకు ఇక నెక్స్ట్



రెండు స్టెప్స్‌గా నేషనల్ ఎగ్జిట్ టెస్ట్

పీజీకి ఇదే అర్హత

వైద్య విద్యలో నాణ్యతను పెంచడానికి నేషనల్ మెడికల్ కమిషన్ సంస్కరణలు చేపడుతోంది. ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులకు నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ నిర్వహించనుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులతోనే దీనిని ప్రారంభించనుంది. ఎంబీబీఎస్ పాస్‌కు, మెడికల్ ప్రాక్టీస్‌కు లైసెన్స్, రిజిస్ట్రేషన్‌కు, పీజీ మెడికల్ ప్రవేశాలకూ ఈ అర్హతే ప్రమాణికం.

- వివరాలు 3లో

ఫ్యాక్ట్ చెక్

విద్యుత్ బిల్లుల మొత్తం నెల ముందే రైతుల ఖాతాల్లో జమ



- స్మార్ట్ మీటర్లతో రైతులపై విద్యుత్ భారం పైసా పడదు
- ఎవరూ చేతి నుంచి ముందుగా చెల్లించాల్సిన పనిలేదు.. ఒక నెల అడ్వాన్సుగానే రైతుల ఖాతాల్లో జమ
- రైతు ఖాతా నుంచి డిస్కంలకు బిల్లులు
- మొత్తం ఖర్చంతా ప్రభుత్వానిదే
- యథాతథంగా సబ్సిడీలు.. వాటిలో కోతలుండవు
- పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యం.. కేంద్రం షరతు మంచిదే కదా
- విద్యుత్ వినియోగంపై స్పష్టమైన లెక్కలు తేల్చేందుకే స్మార్ట్ మీటర్లు
- స్మార్ట్ మీటర్లతో ఎప్పటికప్పుడు లోడ్ తెలుసుకొనే అవకాశం
- మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే పరిస్థితి ఉండదు
- నాణ్యమైన విద్యుత్ అందకపోతే అడిగే ఛాన్స్.. విద్యుత్ సంస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుంది
- వాస్తవాలను వెల్లడించిన ఇంధన శాఖ.. అసత్య కథనాలతో సర్కారుపై బురద చల్లడమే ఈనాడు, పచ్చ పత్రికల పని

14లో

ఇదండీ వరస



వాడిని పవన్‌కళ్యాణ్ మీటింగ్ వైపు వెళ్లనివ్వొద్దని చెప్పాగా!!

డేటా సెంటర్ల కేంద్రం.. విశాఖ!

త్వరలోనే అదానీతో పాటు నిక్సీ సేవలు..

- ఇంటర్నెట్ సేవలు మరింత సులభం, వేగవంతం
- ఇతర సెంటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండదిక
- సింగపూర్ నుంచి విశాఖకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్.. సొంతంగా వేసుకోనున్న అదానీ సంస్థ



కె.జి.రాఘవేంద్రారెడ్డి- సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

మన దైనందిన జీవితంలో ఇంటర్నెట్ వినియోగం రోజురోజుకీ పెరుగుతోంది. తాజా లెక్కల ప్రకారం ప్రతీ రోజూ ప్రపంచవ్యాప్తంగా సుమారు 3 మిలియన్ టెరాబైట్స్ డేటాను సృష్టిస్తున్నాం. దీనిని భద్రపరచడానికి ఉపయోగపడే ప్రత్యేకమైన కేంద్రాలే డేటా సెంటర్లు. ఇంటర్నెట్ ద్వారా సమాచార సేవలు నిరంతరాయంగా అందాలంటే డేటా సెంటర్లే కీలకం. అటువంటి డేటా సెంటర్లకు ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (నిక్సీ) ప్రకటించింది. ఇక ఏకంగా రూ. 21,844 కోట్ల పెట్టుబడితో అదానీ డేటా సెంటర్ ఏర్పాటుతో రాష్ట్ర ఇంటర్నెట్ అవసరాలకు విశాఖ కేంద్రంగా మారనుంది. తద్వారా ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ కేంద్రాల కోసం

మిగతా 14వ పేజీలో ▶

ఇకపై స్థానికంగానే.!

ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీలు స్థానికంగా లేని కారణంగా పలు సంస్థలకు 40 శాతం అదనపు భారం పడుతోంది. నగర పరిధిలో ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ, బ్యాంకులు, రైల్వే బుకింగ్ కేంద్రం, వివిధ పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు.. బల్క్‌గా డేటాను వినియోగిస్తున్నాయి. అలాగే విశాఖలో.. ఎ-కేటగిరీ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు 20, బీ, సీ కేటగిరీ ఐఎస్‌పీలు 60 నుంచి 80 వరకూ ఉన్నాయి. ఈ సంస్థలన్నీ పెద్ద మొత్తంలో డేటా కొనుగోలు చేస్తున్నాయి. 150 వరకూ ఐటీ కంపెనీలు, 13 వేల ఎంఎస్‌ఎం యూనిట్లకూ డేటా అవసరం ఉంటోంది. డేటా సెంటర్ల ఏర్పాటుతో వీటికి ఇకపై అంతరాయం లేకుండా ఇంటర్నెట్, తక్కువ ఖర్చుతో కూడిన నాణ్యమైన సేవలు అందనున్నాయి.

ఐసీఏ పాలక మండలి సభ్యునిగా భీమా సుబ్రహ్మణ్యం



అంతర్జాతీయ సహకార ఉద్యమ సమన్వయ సంస్థ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయన్స్(ఐసీఏ) పాలకమండలి సభ్యుడిగా బాపట్లకు చెందిన భీమా సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. బెల్జియంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు.

- వివరాలు 3లో

ముఖ్యమంత్రి భరోసా

- కష్టాలు చెప్పుకుని ఆదుకోవాలన్న బాధితులకు అండ
- వైద్యం కోసం 10 మందికి తక్షణ ఆర్థిక సాయం
- ఉపాధి కోసం ముగ్గురికి చేయూత
- 24 గంటల వ్యవధిలోనే సాయం

పార్వతీపురం/కురుపాం: వివిధ సమస్యలతో బాధ పడుతున్న వారిని కురుపాం పర్యటనలో బుధవారం సీఎం జగన్ మనసున్న మారాజుగా ఆదుకున్నారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం నల్లబిల్లికి చెందిన రెండేళ్ల చిన్నారి గుదే జియశ్రీకి బోన్‌మెరో ట్రాన్స్‌ప్లాంటేషన్ కారణంగా పెరుగుదల లోపించింది. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించాలని వైద్యులు సూచించారు. ఆర్థిక పరిస్థితి అనుకూలించక పోవడంతో చిన్నారి తల్లి గుదే గౌరి సీఎంకు సమస్యను విన్నవించింది. వెంటనే స్పందించిన సీఎం.. వైద్యం కోసం రూ.10 లక్షలు సాయం అందిస్తామని, తక్షణ సాయంగా రూ.లక్ష అందజేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను ఆదేశించారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న పార్వతీపురంలోని రామానందనగర్‌కు చెందిన ఎనిమిదేళ్ల బేతా హాసిని వైద్యం కోసం ఇప్పటికే చాలా ఖర్చు చేశామని, ఆదుకోవాలని బాలిక తండ్రి శ్రీనివాసరావు సీఎం జగన్‌కు విన్నవించారు. తక్షణ సహాయంగా రూ.3 లక్షలు అందించాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు. మరో 11 మంది కూడా సీఎంకు వారి సమస్యలు చెప్పుకున్నారు. వారందరి సమస్యలు ఓపికగా విన్న జగన్.. తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం హామీ మేరకు బాధితులందరికీ 24 గంటలు గడవక ముందే కలెక్టర్, ప్రజాప్రతి-నిధులు చెక్కులు అందజేశారు. సీఎం ఉదారత పట్ల బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



తన కుమారుడు దేవాన్ష్‌కు అఫ్లేషియా సమస్య ఉందని, ఆదుకోవాలని సీఎం జగన్‌కు విన్నవిస్తున్న మక్కువ మండలం గోపాలపురానికి చెందిన జి.సాయిరామ్. చెక్కు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నామని, సాయం చేయాలని సీఎం జగన్‌ను కోరుతున్న బొబ్బిలి మండలం కోరాడ వీధికి చెందిన పీబీఎస్ శ్రీనివాస్, సాయం అందిస్తున్న కలెక్టర్



తనకు దవడ వద్ద ట్యూమర్ ఉందని, చికిత్స కోసం సాయం చేయాలని సీఎం జగన్‌ను కోరుతున్న బలిజిపేట మండలం మరువాడ గ్రామానికి చెందిన పిల్లి లక్ష్మణరావు, చెక్కు అందిస్తున్న కలెక్టర్



రోడ్డు ప్రమాదంలో వికలాంగుడిగా మారిన తనకు సాయం చేయాలని సీఎంను కోరుతున్న రణస్థలం మండలం సూరంపేటకు చెందిన ఎన్. సురేష్. సాయం అందిస్తున్న కలెక్టర్



క్యాన్సర్‌తో బాధపడుతున్న తన కుమార్తె హాసిని చికిత్సకు చేయూతనివ్వాలని సీఎంను కోరుతున్న పార్వతీపురానికి చెందిన శ్రీనివాసరావు, సాయం అందిస్తున్న కలెక్టర్



గురుగుబిల్లి మండలం, లఖనాపురానికి చెందిన గిరివర్ధన్ గుండె సమస్యతో బాధపడుతున్నాడని, సాయం అందించాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తున్న బాలుడి తల్లి. చెక్కు అందిస్తున్న కలెక్టర్



మీజిల్స్‌తో బాధపడుతున్న తన కుమారుడుని ఆదుకోవాలని సీఎంను కోరుతున్న జి.సిగడాం మండలం జాడ గ్రామానికి చెందిన శంకరరావు, చెక్కు అందిస్తున్న కలెక్టర్



తన కుమార్తె మక్కువ జస్విత కంజనిటల్ డిఫార్మిటీతో బాధపడుతోందని, సాయం చేయాలని సీఎం జగన్‌ను వేడుకుంటున్న సాలూరుకు చెందిన శ్రీలక్ష్మి, చెక్కు అందిస్తున్న కలెక్టర్



వైకల్యంతో ఉన్న తన కుమారుడు వెంకటేశ్వరరావుకు ఉపాధి కోసం సాయం చేయాలని సీఎం జగన్‌ను కోరుతున్న బలిజిపేట మండలం పెదపెంకికి చెందిన తల్లి లక్ష్మి, సాయం అందిస్తున్న కలెక్టర్

దొరికిన దొంగలు

- ఇప్పుడు బయట పడుతున్న దొంగ ఓట్లన్నీ 2019 జనవరికి ముందు చేర్పించినవే..
- నాడు ఐటీ గ్రిడ్ పేరుతో డేటా తస్కరించి భారీగా దొంగ ఓట్లను చేర్పించిన టీడీపీ
- ఇప్పుడు ఆధార్ సీడింగ్‌తో బాగోతం వెలుగులోకి..
- ఇలా 15 లక్షల ఓట్లలో ఇప్పటికే 10.20 లక్షలు తొలగింపు



ముందే చెప్పిన సాక్షి : టీడీపీ హయాంలో దొంగ ఓట్లపై 17.3.2019న 'సాక్షి' ప్రచురించిన కథనం

సాక్షి, అమరావతి: గత ఎన్నికల్లో గెలవడం కోసం తెలుగుదేశం పార్టీ అనేక అడ్డదారులు తొక్కింది. ఏకంగా ప్రజల విలువైన వ్యక్తిగత సమాచారాన్ని హైదరాబాద్‌కు చెందిన ఐటీ గ్రిడ్ అనే ప్రైవేటు సంస్థ ద్వారా తస్కరించింది. రాష్ట్రంలోని ప్రజల ఆధార్ డేటాను ఈ-ప్రగతికి అనుసంధానం చేసి, అక్కడి నుంచి ఆ సమాచారాన్ని దొంగిలించి తెలుగుదేశం పార్టీకి సంబంధించిన సేవా మిత్ర యాప్‌కు చేరవేసింది. ఈ యాప్ ద్వారా సర్వేలు నిర్వహించి ఓటు వేయరనుకున్న వారిని గుర్తించి, ఫారం-7 ద్వారా వారి ఓట్లను తొలగించింది. వారి స్థానంలో పెద్ద ఎత్తున దొంగ ఓటర్లను చేర్పించింది. ఇప్పుడు ఈ విషయాన్ని గుర్తించి, దొంగ ఓట్లను తొలగిస్తుంటే.. అదే పెద్ద తప్పిదమైనట్లు ఈనాడు, దాని తోకపత్రిక అడ్డగోలు కథనాలతో ప్రజలను పక్కదారి పట్టించేలా కథనాలు వండివారుస్తున్నాయి. ఈ పత్రికలు అచ్చేసిన దొంగ ఓట్ల కథనాలు, ఆయా ఇంటి నంబర్లను 2019 ఓటర్ల జాబితా, 2023 ఓటర్ల జాబితాలో పరిశీలించి చూస్తే బాబు బాగోతం స్పష్టంగా తెలిసిపోతోంది. ఇదే చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో ఇలా 36 వేలకు పైగా పక్క రాష్ట్రాలకు చెందిన దొంగ ఓటర్లను చేర్పించి గట్టెక్కారు.



ఇక ఆటలు సాగవని అక్కసు

ఒక వ్యక్తి రెండు మూడు చోట్ల ఓట్లు కలిగి ఉంటే వాటిని గుర్తించి, వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తోంది. ఇలా రాష్ట్రంలో 15 లక్షల మంది ఓటర్లు ఉంటే, పరిశీలించి 10.20 లక్షలు తొలగించినట్లు ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. కొంతకాలంగా ఓటర్ల జాబితాలో జరిగిన తప్పులను ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ 2024లో సరిదిద్దనున్నట్లు హామీ ఇచ్చారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేసి ఓటర్ల సవరణ చేస్తారని, ఈ సమయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బీఎల్‌వోలతో కలిసి సర్వేలో పాల్గొనాలని కోరారు. దీంతో ఇంతకాలం దొంగ ఓట్లతో గెలుస్తూ వచ్చిన తెలుగుదేశం పార్టీ.. ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకొని దుష్ప్రచారం సాగిస్తోంది. ఇందులో భాగంగానే 'దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లు' దొంగ ఓట్లంటూ ఫిర్యాదులు కూడా చేస్తుండటం గమనార్హం.

మరి దీనిపై కూడా ఓ కథనాన్ని వండివార్చగలరా?

రామోజీ.. అప్పుడు కనిపించలేదా?

విజయవాడలో ఒకే ఇంటి నంబర్‌పై 506 ఓట్లు అంటూ జూన్ 15న ఈనాడు ఓ కథనం అచ్చేసింది. ఇది దురుద్దేశంతో కూడిందన్న విషయం 2019, 2023 ఓటర్ల జాబితాను పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తోంది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పోలింగ్ స్టేషన్-80 సూర్యారావుపేటలో అసలు ఇంటి నంబరు లేకుండా కేవలం కడియాల వారి వీధి పేరుతో పెద్ద ఎత్తున ఓట్లు నమోదై ఉన్నాయి. ఈనాడు రాసిన కథనంలో చెబుతున్నట్లుగా ఈ ఓట్లను పరిశీలిస్తే అవి 2019కి ముందు నమోదు చేసినవే. కొత్తగా ఒక్క ఓటు కూడా నమోదు కాకపోగా ఈ సంఖ్య ఇంకా తగ్గింది. కనీసం ఈ పూర్వాపరాలను పరిశీలించకుండా.. కేవలం ప్రభుత్వంపై బురద చల్లాలనే ఆలోచనలతో ఈనాడు దుష్ప్రచారం చేసిందని స్పష్టమవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ఇప్పుడు ఎన్నికల సంఘం సరిదిద్దుతుంటే వాటికి వక్రీకరణలు, అబద్ధాలు జోడించి, ఎల్లో మీడియాతో ప్రచారం చేయించి ప్రజలను తప్పుదోవ పట్టించేలా టీడీపీ వ్యూహం పన్నింది. ఈ కథనంపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి స్పందిస్తూ 2018 నుంచి ఈ ఓట్లు ఒకే వీధి పేరుతో ఉన్నాయని స్పష్టం చేయడమే కాకుండా గణాంకాలతో సహా వివరించారు. 2018లో 674 మంది ఓటర్లు ఉంటే 2019లో 675 మంది ఇప్పుడు 516 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఇప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నకిలీ ఓట్లు ఉంటే తొలగిస్తామని స్పష్టం చేశారు. అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఒకే ఇంటి నంబర్‌పై 800 ఓట్లు ఉన్నాయంటూ ఈనాడు తోకపత్రిక మరో కథనాన్ని వండి వార్చింది. చంద్రబాబు హయాంలోనే చేర్పించారన్న విషయాన్ని దాచిపెట్టి ఈ ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై నింద వేసింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ 38కి సంబంధించి 2019, 2023 ఓటర్ల జాబితా పరిశీలిస్తే ఈ ఓట్లన్నీ 2019 జనవరి నుంచే కొనసాగుతున్న విషయం స్పష్టం అవుతోంది. అంటే ఈ ఓట్లన్నీ చంద్రబాబు నాయుడే చేర్పించారని ఇట్టే స్పష్టమవుతోంది.

చెత్త 'శుద్ధి' లేదు..



- దేశవ్యాప్తంగా 32 శాతం చెత్తతో సమస్యలు
- ఈశాన్య భారతంతో సహా 11 రాష్ట్రాల్లో స్వచ్ఛతపై నిర్లక్ష్యం
- 2024 నాటికి 71 శాతం చెత్త గుట్టల శుద్ధి అసాధ్యం
- సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) వెల్లడి
- ఏపీలో చెత్త శుద్ధిలో మెరుగైన ప్రమాణాలు

సాక్షి, అమరావతి: దేశంలో చెత్త గుట్టలు పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ తలసరి వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. ఫలితంగా పర్యావరణానికి పెను సవాల్ ఎదురవుతోంది. ప్రభుత్వాలు చెత్త సేకరణ, నిర్వహణపై ఎంత కృషి చేస్తున్నా దేశంలో ఇప్పటికీ పట్టణాల్లో 32 శాతం వ్యర్థాలను బహిరంగంగా తగలబెట్టడం లేదా కాలువల్లో వేయడమో చేస్తున్నారు. దేశంలో తలసరి ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి రెట్టింపు అయినట్టు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) తాజా నివేదికలో వెల్లడించింది. 32 శాతం మునిసిపల్ ఘన వ్యర్థాలకు లెక్కలు లేవని.. 2024 నాటికి లెగసీ వేస్ట్ (చెత్త గుట్టలు)లో 71 శాతం పూర్తిగా శుద్ధి చేయాలన్న లక్ష్యం కూడా నెరవేరే పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంది. అత్యధికంగా లెక్కలు లేని వ్యర్థాలు తూర్పు, ఈశాన్య భారత్‌లో ఉన్నట్టు పేర్కొంది. ఈశాన్య ప్రాంతానికి చెందిన 6 రాష్ట్రాలు సహా 11 రాష్ట్రాలు చెత్త గుట్టలను (లెగసీ వేస్ట్) శుద్ధి ప్రక్రియ అసలు ప్రారంభించనే లేదని పేర్కొంది. దేశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఆంధ్రప్రదేశ్ లెగసీ వేస్ట్ నిర్వహణలో ఎన్నో రెట్లు ముందుండటం గమనార్హం.

ఏపీలో 21.81 లక్షల టన్నుల వ్యర్థాల శుద్ధి

ఎన్జీటీ ఆదేశాలు, ఘన వ్యర్థాల నిర్వహణ 2016 నిబంధనలకు అనుగుణంగా రాష్ట్రంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు. రాష్ట్రంలోని 123 యూఎల్‌బీలలో దశాబ్దాల తరబడి పేరుకుపోయిన చెత్త (లెగసీ వేస్ట్) సుమారు 85.91 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా. ఇందులో దాదాపు 21.81 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను పూర్తిస్థాయిలో శుద్ధి చేశారు. రెండు యూఎల్‌బీలలో నూరు శాతం డంపింగ్ యార్డులను ప్రక్షాళన చేసి, లెగసీ వేస్ట్ లేకుండా చర్యలు తీసుకున్నారు. అంతేగాక, ప్రస్తుతం వెలువడుతున్న ఘన వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించకుండా సంపద సృష్టి కేంద్రాలు, వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లకు తరలిస్తున్నారు. డంపింగ్ యార్డుల్లోనే ప్రాసెసింగ్ ప్రక్రియ చేపట్టి చెత్తలోని రాళ్లు, ప్లాస్టిక్, లోహాలు వంటి వాటిని వేరుచేసి మిగిలిన దానిని ఎరువుగా మార్చి మొక్కలకు వినియోగిస్తున్నారు.

రోజుకు 1.60 లక్షల టన్నుల వ్యర్థాలు

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి లెక్కల ప్రకారం.. 2020-21లో దేశంలో రోజుకు 1,60,039 టన్నుల వ్యర్థాలు వెలువడ్డాయి. అందులో 1.52 లక్షల టన్నుల వ్యర్థాలను సేకరించగా.. 79,956.3 టన్నుల (50 శాతం) వ్యర్థాలను శుద్ధి చేసి, 29,427.2 (18.4 శాతం) టన్నుల చెత్తతో ల్యాండ్ ఫిల్లింగ్ చేశారు. మిగిలిన 31.7 శాతం (సుమారు 32 శాతం) వ్యర్థాలకు లెక్కలు లేవు. 2019-20లో లెక్కలు లేని ఘన వ్యర్థాలు 25.8 శాతం ఉంటే.. అది 2020-21 నాటికి 32 శాతానికి చేరింది. అంటే ఏడాది కాలంలోనే దాదాపు 6 శాతం పెరిగింది. లెక్కలోకి రాని ఈ 32 శాతం వ్యర్థాలు ఎక్కడికి వెళుతున్నాయో తెలియదు. అంటే మన నగరాల్లోనే ఆ చెత్తను అక్రమంగా తగలబెట్టడమో.. లేక కాలువల్లో వేయడం జరుగుతున్నట్టు సీఎస్ఈ నివేదిక పేర్కొంది. 2019-20లో దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి 34.69 లక్షల టన్నులు (మొత్తం ఘన వ్యర్థాల్లో 6.30 శాతం) ఉండగా.. గత ఐదేళ్లుగా తలసరి ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి దాదాపు రెట్టింపు అయినట్టు సీఎస్ఈ పేర్కొంది.

సీఎంకు విశ్వబ్రాహ్మణుల కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక జీవో ద్వారా నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చినందుకు సీఎం జగన్‌కు విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని వారు కలిశారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని సజ్జలకు బహూకరించారు. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులంతా సీఎం జగన్‌కు అండగా నిలబడి.. వచ్చే ఎన్నికల్లో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ అధ్యక్షుడు ఆరికట్ల గోవర్ధన శాస్త్రి, ప్రధాన కార్యదర్శి కందుకూరి సత్య చారి పాల్గొన్నారు.

నేటినుంచి నాటా మెగా కన్వెన్షన్

- జూలై 2 వరకు వేడుకలు

సాక్షి, అమరావతి: తెలుగుతనాల తోట.. సాటిలేని సాంస్కృతిక సంబరాల పీట నార్త్ అమెరికన్ తెలుగు అసోషియేషన్ (నాటా) మెగా కన్వెన్షన్ శుక్రవారం (నేడు) ప్రారంభం కానుందని నాటా అధ్యక్షుడు డాక్టర్ కొరసపాటి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఆయన గురువారం సాక్షితో మాట్లాడారు. నాటా మహాసభలకు అమెరికాలోని టెక్సాస్‌లోగల డాలస్ కన్వెన్షన్ సెంటర్ ముస్తాబైందన్నారు. ఈ వేడుకలు జూలై 2వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయని, ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. దాదాపు 20 వేలమంది ప్రవాసాంధ్రులు పాల్గొంటారన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు అత్యున్నతస్థాయి ప్రముఖులు ఇప్పటికే టెక్సాస్ చేరుకున్నారని చెప్పారు. అందరికీ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రేమ్ హెల్త్‌కేర్ వ్యవస్థాపకుడు, నాటా వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి తదితర ప్రముఖులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారని ఆయన చెప్పారు.

చంద్రబాబు చంపేసిన
చిత్తూరు డెయిరీకి పునరుజ్జీవం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాసెసింగ్ సామర్థ్యంతో 1988లో చిత్తూరు జిల్లా కోఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్‌గా ఏర్పడింది. జిల్లాలోని మొత్తం డెయిరీ కార్యకలాపాలను దాని పరిధిలోకి తీసుకొచ్చారు. డెయిరీకి అనుబంధంగా పిచ్చాటూర్, శ్రీకాళహస్తి, మదనపల్లి, వి.కోట, పీలేరులో మిల్క్ చిల్లింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. 1988-93 మధ్య చిత్తూరు డెయిరీ సగటున రోజుకు 2.5 - 3 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే స్థాయికి చేరుకుంది. తిరుమల శ్రీవారి ఆలయానికి పాల ఉత్పత్తుల సరఫరాలో జరిగే జాప్యాన్ని నివారించేందుకు చిత్తూరు డెయిరీకి అనుబంధంగా నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ద్వారా తిరుపతిలో 1992-93లో లక్షన్నర లీటర్ల ప్రాసెసింగ్ సామర్థ్యంతో బాలాజీ డెయిరీని ఏర్పాటు చేశారు.

హెరిటేజ్ కోసం నిర్వీర్యం

సరిగ్గా అదే సమయంలో హెరిటేజ్ డెయిరీ పురుడు పోసుకుంది. చంద్రబాబునాయుడు తన డెయిరీ హెరిటేజ్ కోసం లాభాల్లో దూసుకుపోతున్న చిత్తూరు డెయిరీని ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేయడం మొదలు పెట్టారు. ఆర్థిక నష్టాలకు గురిచేసి, చివరికి రైతులకు కూడా చెల్లింపులు చేయలేని స్థితికి తీసుకొచ్చారు. చెప్పాపెట్టకుండా 2002 ఆగస్టు 31న ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే మూత వేశారు. రైతులకే కాకుండా ఉద్యోగులకు రూ.వందల కోట్లు బకాయి పెట్టారు. 2003 నవంబర్ 27న లిక్విడేషన్ ప్రకటించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2008లో మదనపల్లి చిల్లింగ్ యూనిట్‌ను పాక్షికంగా పునఃప్రారంభించగా, ఆ తర్వాత వచ్చిన పాలకుల నిర్వాకంతో మళ్లీ మూత పడింది. ప్రస్తుతం చిత్తూరు డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి యూనియన్ లిక్విడేటర్‌గా వ్యవహరిస్తున్నారు. మరోవైపు రోజుకు 1.5 లక్షల లీటర్ల ప్రాసెసింగ్ సామర్థ్యంతో లాభాల్లో నడుస్తున్న బాలాజీ డెయిరీకి చెల్లించాల్సిన బకాయిలు ఎగ్గొట్టడంతో ఎన్‌డీడీబీకి అప్పగించాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారు. దీని నిర్వహణా బాధ్యతలను ఎన్‌డీడీబీ శ్రీజ డెయిరీకి అప్పగించగా, ప్రస్తుతం 3 లక్షల లీటర్ల సామర్థ్యానికి విస్తరించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు..

ఎన్నికలకు ముందు తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుంబిగించారు. రాష్ట్రంలో సహకార డెయిరీలకు పూర్వవైభవం తీసుకు రావాలన్న సంకల్పంతో ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్ (అమూల్)తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. జగనన్న పాల వెల్లువ పథకం కింద ఇప్పటికే 3.07 లక్షల మందితో 3,551 మహిళా పాడి రైతు సంఘాలను ఏర్పాటు చేశారు. రెండేళ్లలో 8.78 కోట్ల లీటర్ల పాల సేకరణ ద్వారా రూ.393 కోట్లు చెల్లించారు. అమూల్ రాకతో గత రెండేళ్లలో పెంచిన పాల సేకరణ ధర వల్ల ప్రైవేట్ డెయిరీలకు పాలు పోసే రైతులకు రూ.3,754 కోట్ల మేర అదనపు లబ్ధి చేకూరింది. వీరి కోసం గ్రామ స్థాయిలో ఆర్బీకేలకు అనుబంధంగా 4,796 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు నిర్మిస్తున్నారు. మరో వైపు మూత పడిన డెయిరీల పునరుద్ధరణలో భాగంగా ఇప్పటికే మదనపల్లి డెయిరీని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రీ ప్యాకింగ్, ప్రాసెసింగ్, అల్ట్రా హై ట్రీట్‌మెంట్ (యూహెచ్‌టీ) ప్రీ ప్యాకింగ్, యూహెచ్‌టీ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా మదనపల్లి యూనిట్‌ను పునరుద్ధరించారు. 2021 నుంచి దీన్ని అమూల్ విజయవంతంగా నిర్వహిస్తోంది.


శిథిలావస్థలో ఉన్న చిత్తూరు విజయ డెయిరీ భవనాలు

జగనన్న పాల వెల్లువ కింద అమూల్ పెంచిన పాలసేకరణ ధరలు (లీటర్‌కు)

	ఆవు పాలు	గేదె పాలు
2020 డిసెంబర్	34.20	71.47
01-09-2021	35.78	74.78
01-05-2022	37.90	79.20
01-11-2022	39.48	82.50
16-12-2022	40.73	84.51
11-02-2023	42.56	85.80
21-05-2023	43.69	89.76

అమూల్ రాకతో ప్రైవేట్ డెయిరీలు పెంచిన పాల సేకరణ ధరలు (లీటర్‌కు)

	ఆవు పాలు	గేదె పాలు
అమూల్ రాక ముందు (2019)లో	26.00	59.00
అమూల్ వచ్చాక (డిసెంబర్ 2020)	30.55	65.40
01-05-2022	33.80	74.46
11-02-2023	34.84	79.56
21-05-2023	36.14	81.60


శంకుస్థాపనకు ఏర్పాట్లు



2002లో మూత పడిన చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ కోసం అమూల్‌తో ఇప్పటికే ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. జూలై 4వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేయబోతున్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– అహ్మద్ బాబు, ఎండీ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్

ఎదురు చూస్తున్నాం



చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ కోసం కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురు చూస్తున్నాం. లాభాల్లో నడిచిన ఈ డెయిరీని కావాలనే నాశనం చేశారు. ఈ డెయిరీ మూత పడటంతో ప్రైవేటు డెయిరీలకు పాలు పోయాల్సి వచ్చేది. నాకు ఐదు ఆవులున్నాయి. రోజుకు 18-20 లీటర్ల పాలు పోస్తుంటా. గతంలో లీటర్‌కు రూ.20కి మించి వచ్చేది కాదు. అమూల్ రాకతో ప్రస్తుతం రూ.43 వస్తోంది. నిజంగా చాలా ఆనందంగా ఉన్నాం. డెయిరీ పునరుద్ధరణతో ఈ ప్రాంత పాడి రైతులందరికీ మేలు జరుగుతుంది.

– ఎం.చిట్టిబాబు, జి.గొల్లపల్లి, తవనంపల్లి మండలం, చిత్తూరు జిల్లా

అమూల్ రూ.385 కోట్ల పెట్టుబడులు

చిత్తూరు డెయిరీని పునరుద్ధరించడం ద్వారా పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలవడంతో పాటు హెరిటేజ్ ఫుడ్స్‌కు బలమైన పోటీదారుగా నిలపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే లక్ష్యంతో డెయిరీకి ఉన్న రూ.182 కోట్ల అప్పులను తీర్చింది. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ ప్రాజెక్టు కోసం అమూల్ సంస్థ ద్వారా రూ.385 కోట్ల పెట్టుబడులు పెట్టిస్తోంది. తొలుత రూ.150 కోట్ల అంచనా వ్యయంతో దేశంలోనే అతిపెద్ద ఐస్ క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దశల వారీగా పాల కర్మాగారం, వెన్న, పాలపొడి, చీజ్, పన్నీరు, యోగర్ట్, స్వీట్లు తయారీ విభాగాలతో పాటు యూహెచ్‌టీ ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. డెయిరీ పూర్తి స్థాయిలో పునరుద్ధరణ ద్వారా ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తంగా 25 లక్షల మంది పాడి రైతులకు లబ్ధి చేకూరనుంది.

రూ. 40 కోట్ల ఐటీ రీఫండ్ స్కాం!

▶ మొదటి పేజీ తరువాయి



వెలుగులోకి వచ్చింది. ఐటీ రీఫండ్ స్కాంలో ప్రైవేటు ఉద్యోగులతోపాటు రైల్వేశాఖకు చెందిన ఉద్యోగులు, పోలీస్‌శాఖలోని ఉద్యోగులు సైతం ఉన్నట్లు ఐటీ అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఎల్బీ నగర్, వనస్థలిపురం, నిజాంపేట ప్రాంతాల్లో చేపట్టిన దర్యాప్తులో 8 కన్సల్టెన్సీలకు ఈ స్కాంతో సంబంధం ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. ఆయా కన్సల్టెన్సీలు ఉద్యోగులకు కమీషన్ ఆశ చూపి వారికి వర్తించని ఐటీ సెక్షన్ల కింద ఐటీ రిటర్న్‌లు ఫైలు చేయడంతోపాటు కొన్ని తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. ఈ ఉదంతంపై క్రిమినల్ కేసులు నమోదు చేసే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. 2017లోనూ 200 మంది వరకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తప్పుడు ధ్రువపత్రాలు చూపి ఐటీ రీఫండ్ పొందిన వ్యవహారంపైనా హైదరాబాద్ సీసీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు ఐటీ అధికారులు గుర్తుచేశారు.


గ్రామీణ యువతకు శిక్షణ, ఉపాధిలో ఏపీ స్పీడ్

▶ మొదటి పేజీ తరువాయి

నైపుణ్య శిక్షణ ఇస్తారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీలకు 50%, మైనారిటీలకు 15%, మహిళలకు 33% మందికి శిక్షణలో ప్రాధాన్యత ఇస్తారు. అలాగే దివ్యాంగులు, కుటుంబ నిర్వహణలో ఉన్న మహిళలకు కూడా ప్రాధాన్యత ఇస్తారు. దేశంలో 37 రంగాల్లో 877 ప్రాజెక్టు అమలు ఏజెన్సీలు 2,369 కేంద్రాల్లో ఈ శిక్షణ ఇస్తున్నాయి.

తొలి ఐదు స్థానాలు పొందిన రాష్ట్రాల్లో శిక్షణ పొందిన అభ్యర్థులు

రాష్ట్రం	శిక్షణ పొందిన అభ్యర్థుల సంఖ్య
ఒడిశా	2,10,557
ఉత్తరప్రదేశ్	1,84,652
ఆంధ్రప్రదేశ్	1,04,462
మధ్యప్రదేశ్	74,929
బిహార్	73,060



టాప్ ఐదు రాష్ట్రాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు

ఒడిశా	1,68,582
ఆంధ్రప్రదేశ్	87,757
తమిళనాడు	58,263
ఉత్తరప్రదేశ్	46,997
తెలంగాణ	46,983



ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లకు ఇక నెక్స్ట్

రెండు స్టెప్స్‌గా నేషనల్ ఎగ్జిట్ టెస్ట్.. ఎంసీక్యూ విధానంలో స్టెప్-1

- క్లినికల్ ప్రాక్టికల్స్ విధానంలో స్టెప్-2
- పీజీకీ ఇదే అర్హత
- వచ్చే నెల 28న స్టెప్-1 మాక్ టెస్ట్
- కొనసాగుతున్న మాక్ టెస్ట్ దరఖాస్తుల ప్రక్రియ



సాక్షి, అమరావతి: దేశంలో వైద్య విద్యలో నాణ్యతను పెంచడానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సంస్కరణలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎంబీబీఎస్ తుది సంవత్సరం విద్యార్థులకు నేషనల్ ఎగ్జిట్ టెస్ట్(నెక్స్ట్) నిర్వహించనుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులతోనే నెక్స్ట్ ప్రారంభించనున్నారు. దీనిని స్టెప్-1, స్టెప్-2గా రెండు పరీక్షలుగా నిర్వహిస్తారు. ఎంబీబీఎస్ పాస్‌కు, మెడికల్ ప్రాక్టీస్‌కు లైసెన్స్, రిజిస్ట్రేషన్‌కు ఈ పరీక్ష ఉత్తీర్ణత తప్పనిసరి. దీంతో పాటు పీజీ మెడికల్ సీటులో ప్రవేశాలకూ ఈ అర్హతే ఆధారం కానుంది. విదేశాల్లో చదివిన వారికి కూడా ఈ పరీక్ష ద్వారానే గుర్తింపు ఇస్తారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో నెక్స్ట్‌పై అవగాహన కల్పించడం కోసం వచ్చే నెల 28న స్టెప్-1 మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ

మాక్ టెస్ట్‌కు దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభించారు. వచ్చే నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలు దరఖాస్తుకు చివరి గడువు. ఢిల్లీ ఎయిమ్స్ ఆధ్వర్యంలో మాక్ టెస్టు నిర్వహిస్తారు. https://www.aiimsexams.ac.in/ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉంచారు. జనరల్/ఓబీసీ విద్యార్థులు రూ. 2 వేలు, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. వెయ్యి దరఖాస్తు రుసుము చెల్లించాలి. వికలాంగులకు దరఖాస్తు రుసుము మినహాయించారు. మూడు స్టేజ్‌లలో మాక్ దరఖాస్తు ప్రక్రియ ఉంటుంది.

మూడు రోజులు స్టెప్-1

స్టెప్-1 పరీక్షను మూడు రోజులు నిర్వహించాలని ఎన్ఎంసీ ప్రతిపాదించింది. పూర్తిగా మల్టిపుల్ చాయిస్(ఎంసీక్యూ) విధానంలో స్టెప్-1లో ఆరు పేపర్లు ఉంటాయి. రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తారు. స్టెప్-1 అనంతరం ఆరోగ్య విశ్వవిద్యాలయాలు నిర్వహించే ప్రాక్టికల్స్‌లో ఉత్తీర్ణులవ్వాలి. వీరికి హౌస్ సర్జన్ చేయడానికి అర్హత ఉంటుంది. హౌస్ సర్జన్ అనంతరం స్టెప్-2 పరీక్ష ఉంటుంది. స్టెప్-1లోని ఆరు సబ్జెక్ట్‌లతో పాటు ఆర్థోపెడిక్స్, ఫిజికల్ మెడిసిన్ రీహాబిలిటేషన్ (పీఎంఆర్)లో ఎవల్యూషన్ మెథడ్‌లో క్లినికల్ ప్రాక్టికల్స్ ఉంటాయి.

ఏటా నెక్స్ట్, ఇతర ఎంబీబీఎస్ విద్యపై నీట్ ప్రతిపాదించిన షెడ్యూల్

కార్యక్రమం	నిర్వహణ	ఫలితాలు వెల్లడి/ముగింపు
నెక్స్ట్ స్టెప్-1	మే/నవంబర్	జూన్ మొదటి వారం/ డిసెంబర్
3ఎంబీబీఎస్/ ఫైనల్ ఎంబీబీఎస్ పార్ట్-2		
ప్రాక్టికల్స్/ క్లినికల్ యూనివర్సిటీ పరీక్షలు	జూన్ మొదటి వారం/ డిసెంబర్	జూన్ మూడో వారం/ డిసెంబర్
ఇంటర్న్‌షిప్	జనవరి ఫస్ట్/జూలై	డిసెంబర్ 31/జూన్ 30
నెక్స్ట్ స్టెప్-2 రెగ్యులర్	జూన్ మూడో వారం/ డిసెంబర్	జూన్ నాలుగోవారం/ డిసెంబర్
నెక్స్ట్ స్టెప్-2 సప్లిమెంటరీ	సెప్టెంబర్ మొదటి వారం/ మార్చి	సెప్టెంబర్ మూడో వారం/ మార్చి
పీజీ అడ్మిషన్లు	మే-జూన్ (కౌన్సెలింగ్)	జూన్ 30

క్లుప్తంగా...

ఐసీఏ పాలక మండలి సభ్యునిగా భీమా సుబ్రహ్మణ్యం

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ సహకార ఉద్యమ సమన్వయ సంస్థ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయన్స్ (ఐసీఏ) పాలకమండలి సభ్యునిగా బాపట్లకు చెందిన భీమా సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో గురువారం జరిగిన ఐసీఏ సర్వసభ్య సమావేశంలో సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1990 నుంచి రాష్ట్ర సహకార బ్యాంకుల జాతీ య సమాఖ్య (నాఫ్‌స్కాబ్) ఎండీగా, ప్రధాన కార్యనిర్వహాణాధికారిగాసేవలందిస్తున్న ఈ యన ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ బ్యాంకింగ్ అసోసియేషన్ (ఐసీబీఏ) అధ్యక్షునిగా, ఐసీఏ బోర్డు శాశ్వత పరిశీలకునిగా వ్యవహరిస్తున్నారు.

కేరళ డీజీపీగా వైఎస్సార్ జిల్లావాసి


దర్వేష్ సాహెబ్

పోరుమామిళ్ల: వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన షేక్ దర్వేష్ సాహెబ్ కేరళ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. బక్రీద్ రోజున దర్వేష్ సాహెబ్ కేరళ డీజీపీగా బాధ్యతలు స్వీకరించడంపై ఇక్కడ ఆయన బాల్యస్నేహితులు సంతోషం వ్యక్తంచేశారు. దర్వేష్ సాహెబ్ తండ్రి చింతకాయల షేక్ మాబుసాహెబ్ అటవీశాఖలో గార్డుగా పని చేశారు. ఆ సమయంలో వీరి కుటుంబం పోరుమామిళ్లలోని బెస్తవీధిలో నివాసం ఉంది. మాబుసాహెబ్ మరణించడంతో సుమారు 30 ఏళ్ల కిందట వారి కుటుంబం కడప వెళ్లి స్థిరపడింది. సివిల్స్ రాసి 1990 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కేరళ కేడర్‌కు వెళ్లి ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదిగి డీజీపీగా పదోన్నతి పొందారు.

నేడు 'జోసా' సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ఇంజనీరింగ్ విభాగంలో సీట్ల కేటాయింపును శుక్రవారం చేపట్టనుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు 'జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ' (జోసా) తెలిపింది. తొలి విడత సీట్ల కేటాయింపును ఉదయం 10 గంటలకు ప్రకటిస్తున్నామని, అభ్యర్థులు josaa.nic.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ నెంబర్ల ద్వారా సీటు ఎక్కడ వచ్చిందో తెలుసుకోవచ్చని 'జోసా' పేర్కొంది. సీట్లు పొందిన అభ్యర్థులు జూలై 4లోగా ఆన్‌లైన్ రిపోర్టింగ్ చేయాలని, అభ్యంతరాలుంటే జూలై 5లోగా పంపాలని సూచించింది.

8వ తరగతి సిలబస్ తగ్గింపు

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఎన్సీఈఆర్టీ నిర్ణయం

సాక్షి, అమరావతి: ఎనిమిదో తరగతి విద్యార్థులకు బోధించే సిలబస్‌ను ఎన్సీఈఆర్టీ బోర్డు తగ్గించింది. ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌లలోని కొన్ని చాప్టర్లను పాక్షికంగా కుదించింది. మరికొన్నింటిని పూర్తిగా తొలగించింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఎన్సీఈఆర్టీ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతి విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం బోధన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తగ్గించిన సిలబస్ వివరాలను గురువారం ఉపాధ్యాయులకు పంపించారు. ఇంగ్లిష్ హనీడ్యూలోని 3, 7 చాప్టర్లలో పోయమ్స్‌తో పాటు 9, 10 చాప్టర్లను పూర్తిగా తొలగించారు. మ్యాథ్స్‌లో ఒకటి నుంచి 16 చాప్టర్లలో.. ఒక్కో చాప్టర్‌లో కొన్ని భాగాలను తొలగించారు. సైన్స్(పీఎస్-బీఎస్)లో కొన్ని చాప్టర్లను పూర్తిగా తొలగించారు. సోషల్-రిసోర్స్ అండ్ డెవలప్‌మెంట్‌లో మూడో చాప్టర్, 5వచాప్టర్‌లోని కొన్ని అంశాలను తొలగించారు. సోషల్ అండ్ పొలిటికల్ లైఫ్-3లో 1, 3, 4, 5, 7, 8 చాప్టర్లను పాక్షికంగా, 6వ చాప్టర్‌ను పూర్తిగా తీసివేశారు. సోషల్-అవర్ పాస్ట్-3లో 2 నుంచి 10 వరకు చాప్టర్లను తొలగించారు.

వేదాల్లో అంతులేని విజ్ఞానం ఉంది: సీఎస్ జవహర్ రెడ్డి


పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి/ గాంధీనగర్(విజయవాడ): మన వేదాల్లో సైన్స్, అనంత విజ్ఞానం దాగి ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ సజ్జన్ సింగ్ యాదవ్ రచించిన 'భారతదేశపు వ్యాక్సిన్ చరిత్ర' పుస్తకావిష్కరణ సభ గురువారం విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. వేదాలంటే మంత్రాలు మాత్రమే కాదని, అంతుపట్టని అనేక వ్యాధులకు నివారణ చికిత్స విధానాలు సైతం వాటిల్లో ఉన్నాయన్నారు. కోవిడ్-19 మొదటి దశ, రెండో దశలో ప్రపంచం ఎంతో నష్టాన్ని చూసిందని, రెండో దశలో వ్యాక్సిన్ రావడంతో ఊపిరి పీల్చుకోగలిగామన్నారు. పుస్తక రచయిత డాక్టర్ సజ్జన్ సింగ్ యాదవ్ పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, అలకనంద పబ్లిషర్స్ అధినేత డి.అశోక్ కుమార్,ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడారు.

ఏకలవ్యుని చరిత్ర భావితరాలకు అందించాలి

ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



సాక్షి, అమరావతి/పాయకాపురం(విజయవాడరూరల్): కృషి, పట్టుదల, ఏకాగ్రతకు ప్రతిరూపమైన ఏకలవ్యుని చరిత్రను భావితరాలకు అందించేందుకు మనమంతా కృషి చేయాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. ఏకలవ్యుని జయంతి సందర్భంగా గురువారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని మార్కెట్ వద్ద ఆయన విగ్రహానికి శంకర్ నాయక్ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంభా రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో జాతీయ గిరిజన ఫెడరేషన్ అధ్యక్షుడు మానుపాటి నవీన్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగ అవకాశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఇన్‌లామ్ మోబీతో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం

సాక్షి, అమరావతి: మధ్యప్రాచ్యం, యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, అమెరికా వంటి దేశాల్లో ఉన్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను గుర్తించి దానికి తగ్గట్టుగా రాష్ట్రంలోని యువతకు శిక్షణ ఇచ్చేలా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటోంది. ఇప్పటికే ఓమ్‌క్యాప్, ఏపీఎన్ఆర్టీ సొసైటీ, టీఏకేటీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలతో కలిసి పనిచేసేలా ఒప్పందం చేసుకుంది. తాజాగా ఇంటర్నేషనల్ అగ్రిగేషన్ ప్లాట్‌ఫాం ఫర్ మొబిలిటీ (ఇన్‌లామ్ మోబీ)తోనూ ఒప్పందం చేసుకుంది. వివిధ దేశాల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై ఇన్‌లామ్ మోబీతో కలిసి పనిచేయనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో వినోద్‌కుమార్ తెలిపారు. విదేశాల్లో ఉపాధి అవకాశాలను తెలుసుకోవడానికి పలు దేశాల రాయబారులతో త్వరలోనే న్యూఢిల్లీలో ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆగమేఘాలపై కిడ్నీ తరలింపు

కాకినాడ నుంచి విశాఖకు రెండు గంటల్లో చేరిక


గ్రీన్ చానల్‌లో వెళుతున్న అంబులెన్స్

కాకినాడ క్రైం: కాకినాడ అపోలో ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన 50 ఏళ్ల మహిళ కుటుంబం ఆదర్శంగా నిలిచింది. ఆమె మూత్రపిండాలను కుటుంబ సభ్యులు దానం చేసి మరో ఇద్దరి ప్రాణాలు నిలిపారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ అపోలో ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ బాధితురాలి నుంచి గురువారం రెండు కిడ్నీలు సేకరించారు. ఓ కిడ్నీని అదే ఆస్పత్రిలో రోగికి అమర్చగా, మరో కిడ్నీని విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడికి అమర్చే నిమిత్తం తీసుకెళ్లారు. కాకినాడ అపోలో యాజమాన్యం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను ఆశ్రయించగా.. ఆయన గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య కిడ్నీని అంబులెన్స్‌లో విశాఖ తరలించారు. కనీసం నాలుగు గంటల సమయం పట్టే ప్రయాణం కేవలం రెండు గంటల్లోనే పూర్తయి కిడ్నీ భద్రంగా చేరింది.

రివాల్వర్‌తో అర్ధరాత్రి హల్‌చల్

- వివాహితను వేధిస్తున్న ఓ వ్యక్తి రచ్చ
- స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



కొమరోలు: తనతో చనువుగా ఉండాలని ఓ వివాహితను వేధిస్తున్న వ్యక్తి... ఏకంగా ఆమె గ్రామానికి అర్ధరాత్రి వెళ్లి మద్యం మత్తులో రివాల్వర్‌తో హల్‌చల్ చేశాడు. దీంతో గ్రామస్తులు అతడ్ని పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని మూలపల్లె గ్రామానికి చెందిన ఓ వివాహిత తన భర్తకు ఐదేళ్ల దూరంగా ఉంది. ఆ సమయంలో కొమరోలులో నివాసం ఉంటూ మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పాలుగుళ్ల మోహన్‌రెడ్డికి ఆమెతో స్నేహం ఏర్పడింది. అయితే, పెద్దల సమక్షంలో ఒప్పందం మేరకు రెండు నెలల కిందట ఆ వివాహిత తన భర్తతో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి మోహన్‌రెడ్డి మద్యం తాగి తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో ఆమెను బెదిరిస్తూ కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి మోహన్‌రెడ్డిని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించారు.

మీరు మీ ప్రార్థనలలో అల్లాహ్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలనుకుంటే, మీ ప్రార్థనల వెలుపల ఆయనపై ఎక్కువ ధ్యానగా ఉండండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 30 జూన్ 2023

ఉన్నతశ్రేణి విద్య మిథ్యేనా?!

ఒకప్పుడు ప్రపంచానికి నలందా, తక్షశిలవంటి అత్యుత్తమ శ్రేణి విద్యాకేంద్రాలను అందించి, విశ్వమంతటా విజ్ఞాన కాంతులు వెదజల్లిన భారత్ చాన్నాళ్లుగా విద్యారంగంలో వెలవెలబోతోందన్న అసంతృప్తి ఉంది. ప్రతిష్ఠాత్మక క్యూఎస్ ప్రపంచ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ తాజా జాబితాలో మొదటి 150లో మన దేశానికి చోటుదక్కింది. అంతర్జాతీయంగా చూస్తే ఇదేమంత గొప్ప ర్యాంకు కాకపోవచ్చు. వినడానికి కాస్త ఇబ్బందిగా కూడా ఉండొచ్చు. ఎందుకంటే ప్రపంచ శ్రేణి విద్యాసంస్థలనదగ్గ 1,500 విశ్వవిద్యాలయాల జాబితాను ఆ సంస్థ ప్రకటిస్తే మొదటి పదిలో, కనీసం మొదటి యాభైలో, పోనీ... మొదటి వందలో మన విద్యాసంస్థలేవీ లేవు. బొంబాయి ఐఐటీ ఈ జాబితాలో 149వ స్థానాన్ని పొందగలిగింది. ఆ సంస్థకు ఈ స్థాయి గౌరవం దక్కటం ఎనిమిదేళ్ల తర్వాత ఇదే ప్రథమం. బెంగళూరు ఐఐఎస్‌సీ తొలి 200 ర్యాంకుల్లో స్థానం దక్కించుకోలేకపోగా, మద్రాస్ ఐఐటీ నిరుడున్న 174వ స్థానాన్ని చేజార్చుకుని 197కి పోయింది. దాన్ని బట్టి మన ఉన్నత విద్యాకేంద్రాల తీరుతెన్నులెలా ఉన్నాయో సులభంగానే గ్రహించవచ్చు. ఏటా రివాజుగా క్యూఎస్ ర్యాంకులు ప్రకటించటం, అందులో మన యూనివర్సిటీలు ఎక్కడో అట్టడుగున ఉండటం అనేకులను బాధిస్తోంది.

ప్రపంచం మొత్తంలో 30,000 వరకూ విశ్వవిద్యాలయాలున్నాయి. క్యూఎస్ సంస్థ ఏటా అందులో అత్యుత్తమంగా భావించిన 5 శాతాన్ని... అంటే 1,500 యూనివర్సిటీలను ఎంపిక చేసుకుని వాటి వాటి అర్హతల ఆధారంగా ర్యాంకులు ఇస్తుంది. జీవితంలో ఎదగాలన్న తపన, తాపత్రయం ఉన్నవారు...తమ జ్ఞాన తృష్ణ తీర్చుకోవటానికి అనువైన విద్యాకేంద్రం కోసం అన్వేషిస్తున్నవారు మెరుగైన విశ్వవిద్యాలయం కోసం వెదుకులాడతారు. ప్రపంచం ఇంతగా ఎదిగినా, బహుళ రంగాల్లో అభివృద్ధి సాధించినా అత్యుత్తమ శ్రేణి సంస్థను ఎంపిక చేసుకోవటం ఏ విద్యార్థికైనా అంత సులభం కాదు. ఎందుకంటే ప్రతి విశ్వవిద్యాలయమూ తమ దగ్గరున్న అధ్యాపక బృందం గురించి, తమ బోధనాంశాల తీరుతెన్నుల గురించి, పరిశోధనలకు అందే ప్రాధాన్యత గురించి స్వోత్కర్షలకు పోతుంది. కానీ తటస్థ సంస్థలు నిర్దిష్టమైన గీటురాళ్లు రూపొందించుకుని వాటి మంచిచెడ్డలను చెప్పగలిగితే విద్యార్జన కోసం తాపత్రయపడే యువతకు ఎంపిక సులభమవుతుంది. అంతేకాదు...ఈ తులనాత్మక విశ్లేషణ పరిశోధన కోసం తపించే విద్యార్థులకూ, విధాన నిర్ణేతలకూ కూడా సాయపడుతుంది. విధానపరమైన నిర్ణయాల కోసం చేసే అధ్యయనంలో ఏ విశ్వవిద్యాలయం తోడ్పాటు తీసుకోవచ్చునో, నిధుల విడుదలలో ఏ సంస్థకు ప్రాధాన్యం ఇవ్వాలో విధాన నిర్ణేతలు నిర్ణయించుకుంటారు. ప్రైవేటు రంగ పరిశ్రమలకు కూడా ఈ ర్యాంకింగ్‌లే ఆధారం. క్యూఎస్ సంస్థ ఆ పని చేస్తోంది. ఈనెల మొదటివారంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉండే ఎన్ఐఆర్ఎఫ్ అత్యుత్తమ శ్రేణి విద్యాసంస్థల జాబితాను విడుదల చేసింది. అందులో విశ్వవిద్యాలయాల్లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రథమ స్థానం పొందగా, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ రెండో స్థానంలో, అక్కడి జమియా మిలియా ఇస్లామియా మూడో స్థానంలో నిలిచాయి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పదో ర్యాంకులో ఉంది. అలాగే ఐఐటీల్లో మద్రాస్ ఐఐటీ ప్రథమ స్థానంలో, బొంబాయి ఐఐటీ ద్వితీయ స్థానంలో ఉన్నాయి.

అయితే అంతర్జాతీయ ర్యాంకింగ్‌ల విషయంలో విమర్శలు కూడా ఉన్నాయి. విశ్వవిద్యాలయాల్లో సాగే పరిశోధనలు, ఆ సంస్థల పేరుప్రఖ్యాతులు, అక్కడుండే విద్యార్థి–అధ్యాపక నిష్పత్తి, అంతర్జాతీయ వైవిధ్యత తదితరాలను క్యూఎస్ వంటి సంస్థలు గీటురాళ్లుగా తీసుకుంటున్నాయి. సహజంగానే ఈ అంశాలన్నిటా సంపన్న దేశాల్లోని విశ్వవిద్యాలయాలే ముందంజలో ఉంటాయి. వాటికి అటు ప్రభుత్వాలనుంచీ, ఇటు ప్రైవేటు సంస్థలనుంచీ నిధులు దండిగా వస్తాయి. వెనకబడిన దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో అత్యుత్తమ శ్రేణి అధ్యాపకులున్నా, అక్కడ మెరికల్లాంటి విద్యార్థులు రూపొందుతున్నా క్యూఎస్ సంస్థకు పట్టవు. అందువల్లే ఇలాంటి జాబితాల విశ్వసనీయతపైనా, వాటి కచ్చితత్వంపైనా విద్యారంగ నిపుణులు పెదవి విరుస్తుంటారు. ఈ విమర్శలను పరిగణనలోకి తీసుకుని కాబోలు... విద్యాసంస్థల నిర్వహణ, పరిశోధనలకుండే అంతర్జాతీయ నెట్‌వర్క్, అక్కడి విద్యార్థులకు లభించే ఉద్యోగావకాశాలు అనే అంశాలను ఈసారి చేర్చింది. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. మన దేశంలో ఉన్నత విద్యారంగాన్ని గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. పూర్తికాలం పనిచేసే అత్యుత్తమ అధ్యాపకులను ఎంపిక చేయటానికి, అవసరమైన నిధులు కేటాయించి విశ్వవిద్యాలయాలను తీర్చిదిద్దటానికి పాలకులు ముందుకు రావటం లేదు. ఖాళీ అవుతున్న స్థానాల్లో కాంట్రాక్టు లెక్చరర్లను నియమించి చేతులు దులుపుకుంటున్నారు. మన విశ్వవిద్యాలయాలకు ప్రపంచశ్రేణి గుర్తింపు తీసుకురావాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించడానికి మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ ఆధ్వర్యంలో 13 మందితో నిపుణుల కమిటీని ఏర్పాటుచేశారు. ఆ తర్వాత ప్రభుత్వ రంగంలో పది, ప్రైవేటు రంగంలో పది ఉన్నత విద్యాసంస్థలను ఆ కమిటీ ఎంపిక చేసింది. వాటికి తలో వందకోట్లు నిధులిస్తున్నామని కూడా ప్రకటించారు. అయితే క్యూఎస్ ఎంపిక చేసిన జాబితాలో ఒక్క బొంబాయి ఐఐటీ మాత్రమే ఆ మాత్రమైనా స్థానం సంపాదించుకోగలిగింది. ర్యాంకింగ్‌ల సంగతలావుంచి మన ఉన్నత విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరమైతే ఉంది. ఆ దిశగా చర్యలకు ఉపక్రమిస్తే భావి తరాలు ఉన్నత స్థాయికి ఎదుగుతాయి. మన దేశానికి మళ్లీ గత వైభవం సాధ్యమవుతుంది.

చైనాను నమ్మలేం... అప్రమత్తతే రక్ష!

విశ్లేషణ



అవినాష్ కోల్హే

2020 జూన్ 15, 16 తేదీలలో జరిగిన గాల్వాన్ ఘర్షణ 21వ శతాబ్దంలో భారత్–చైనా సంబంధాలలో మూలమలుపు లాంటిది. ఈ ఘటనతో భారత్ చేదు పాఠం నేర్చుకుంది. ఈ సున్నితమైన సరిహద్దు పోస్టులలో పెట్రోలింగ్‌కు ఎక్కువ మంది సిబ్బందిని నియమించింది. ఇప్పుడు సరిహద్దులో ఐదు పాయింట్ల వద్ద ఇరు సైనికుల ఉనికి లేదు. ఈ ప్రదేశాలలో సైనికరహిత బఫర్ జోన్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఈ బఫర్ జోన్‌లు సరికొత్త వివాదానికి తెర తీశాయి. ఇలా బఫర్ జోన్‌లకు అంగీకరించడమంటే భారత్ తన భూభాగాన్ని కోల్పోవడమే తప్ప మరొకటి కాదని భారత వ్యూహాత్మక సంస్థ పేర్కొనడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో రెండు దేశాలూ సరిహద్దుల సమీపంలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చుకోవటం ఆందోళనకరం.

భారతదేశం, అమెరికా, చైనా అంతర్జాతీయ యవనికపై మూడు ముఖ్యమైన పాత్రధారులు. వీటి ఆసక్తులు పరస్పరం లోతుగా పొందుపర్చుకుని ఉన్నాయి. ఈ వాస్తవం క్రమానుగత వ్యవధిలో ఇతరులతో పోలిస్తే వారి ఎంపికలను తూకం వేసి చూసుకునేలా వారిని బలవంతం చేస్తోంది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా ఎదుగుదలకు చెక్ పెట్టేందుకు అమెరికా ఆసక్తితో ఉంది. కాగా, భారతదేశం చైనాతో 4000 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును, దాంతోపాటు 61 ఏళ్ల సరిహద్దు వివాదాన్ని పంచుకుంటోంది. ఇక చైనా విషయానికి వస్తే 2049 నాటికి నంబర్ వన్ అగ్రరాజ్యం కావాలని కోరుకుంటోంది. అది జననేత మావో సేటుంగ్ నేతృత్వంలో చైనాలో కమ్యూనిస్టు విప్లవం విజయం పొందిన శతాబ్ది సంవత్సరం మరి.

ఆసియాలో చైనాకు ప్రత్యక్ష పొరుగు దేశమైన భారతదేశం, చైనా ప్రాదేశిక ఆకాంక్షల గురించి ఎల్లప్పుడూ ఆందోళన చెందుతూ ఉంది. ఇన్ని దశల చర్చలు జరిగినా నేటికీ భారత్–చైనా సరిహద్దు వివాదం పరిష్కారమయ్యే సూచనలు కనిపించడం లేదు. మూడేళ్ల క్రితం గాల్వాన్ ప్రాంతంలో చైనాతో భారత్‌కు తీవ్ర వైరం ఏర్పడింది. ఇటీవల 2023 జూన్‌లో గాల్వాన్ ప్రతిష్టంభన మూడవ వార్షికోత్సవం సందర్భంగా, చాలామంది పండితులు, మాజీ దౌత్యవేత్తలు... దురాశాపూరిత చైనా పట్ల ఎప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భారత ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

1950ల నాటి నుండి భారత్ – చైనా సరిహద్దు వివాదం ప్రజర్విల్లుతోంది. 'హిందీ–చినీ భాయ్ భాయ్' అని భారత ప్రజలు నినదిస్తున్న వేళ, భారత భూభాగాల్లోకి చైనా సైనికులు కవాతు చేస్తున్నప్పుడు మనదేశం అకస్మాత్తుగా మేల్కొంది. భారత సైన్యం చవిచూసిన ఘోర పరాభవం ఇది. అప్పటి నుండి సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడానికి లెక్కలేనన్ని ప్రయత్నాలు, చర్చలు జరిగాయి. కానీ ఫలించలేదు.

ఇక 2020 జూన్ దగ్గరకు వద్దాం. వాస్తవ నియంత్రణ రేఖ వద్ద ఉన్న గాల్వాన్ లోయలో చైనా సైన్యం చేతిలో 20 మంది భారతీయ సైనికులు మరణించారు. చైనా సేనలను తమ ట్రాక్‌లో నిలిపివేసినప్పటికీ, వారు యథాతథ స్థితితో సంతోషంగా లేరనీ, తమకు అనుకూలమైన మార్పు కోసం ఆసక్తిగా ఉన్నారనీ చైనా వైపు నుండి సందేశం స్పష్టంగా కనబడుతోంది. 2020లో అవకాశాన్ని కోల్పోయినప్పటికీ, వారు తమ ప్రణాళికను కచ్చితంగా వదులుకున్నారని దీని అర్థం కాదు. సరిహద్దు సమస్యను చైనా ఎప్పటికప్పుడు లేవనెత్తుతోంది. 2022 డిసెంబర్ లో, చైనా తవాంగ్‌లో ఒక ఫార్వర్డ్ పోస్టును ప్రారంభించింది. కానీ ఈ ప్రయత్నాన్ని కూడా భారతీయ సైనికులు అడ్డుకున్నారు.



2020 జూన్ 15, 16 తేదీలలో జరిగిన గాల్వాన్ ఘర్షణ 21వ శతాబ్దంలో భారత్–చైనా సంబంధాలను మూలమలుపు తిప్పిన ఘటన. నిజానికి ఇరు దేశాల సైనికులు పరస్పరం ఘర్షణ పడడం ఇదే తొలిసారి. 1975 అక్టోబరులో చివరగా వాస్తవిక ఘర్షణ జరిగింది. ఆయుధాల వినియోగ నిషేధ ఒప్పందం ఒకటి భారత్, చైనాల మధ్య ఉంది. గాల్వాన్‌లో చైనా సైనికులు మేకులున్న కర్రలను ఉపయోగించారు. భారతీయులు ఫైబర్‌గ్లాస్ లాఠీలతో ప్రతిస్పందించారు. కొన్ని సందర్భాల్లో రాళ్లను కూడా ఉపయోగించారు. భారతీయుల కంటే చైనీయులు ఎక్కువ మంది సైనికులను కోల్పోయారని కొన్ని స్వతంత్ర నివేదికలు నొక్కి చెప్పాయి. ఈ ఘటనతో భారత్ చేదు పాఠం నేర్చుకుంది. ఈ సున్నితమైన పోస్టులలో పెట్రోలింగ్‌కు ఎక్కువ మంది సిబ్బందిని నియమించింది కూడా! ఇప్పుడు ఐదు పాయింట్ల వద్ద ఇరు సైనికుల ఉనికి లేదు. ఈ ప్రదేశాలలో సైనికరహిత బఫర్ జోన్‌లు ఏర్పాటయ్యాయి. కానీ ఈ బఫర్ జోన్‌లు కొత్త వివాదాస్పద అంశంగా మారాయి. వీటి ఏర్పాటుకు ఒప్పుకోవడం అంటే భారత్ తన భూభాగాన్ని కోల్పోవడమే తప్ప మరొకటి కాదని భారత వ్యూహాత్మక సంస్థ పేర్కొనడం ఇక్కడ గమనార్హం.

ఇది చాలదన్నట్లు సైనికులనూ, సైనిక సామగ్రినీ సులభంగా తరలించడానికి చైనా తన వైపు రెండు వంతెనలను కలిగి ఉన్న ప్రాంతంలో మౌలిక సదుపాయాలను నిర్మించడంలో బిజీగా ఉంది. భారతదేశం కూడా రోడ్లు, వంతెనలు, సొరంగాలు, హెలిప్యాడ్‌లు వంటివి ఉన్న తన భూభాగం వైపున మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోంది. ఏదేమైనప్పటికీ, ఇది ఈ ప్రాంతంలో శాంతికి శుభ సూచన కాదు.

ఇంత ఘర్షణపూరిత వాతావరణం ఉన్నప్పటికీ, చైనా–భారత్‌ల మధ్య వాణిజ్యం వృద్ధి చెందుతోంది. భారతదేశం హిమాలయ పొరుగు దేశం నుండి ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. భారత – చైనా బంధం విషయంలో ఎల్లప్పుడూ నిరంతర పరిశీలన అవసరమని భారత నాయకులు గమనించాలి. చైనా తన వ్యూహాత్మక ప్రయోజనాలకు, దీర్ఘకాలిక ఆకాంక్షలకు సరిపోయే దానికంటే తక్కువగా దేనితోనూ సమాధానపడదని గుర్తుంచుకోవాలి.

21వ శతాబ్దంలో, అమెరికా కూడా చైనా ఎదుగుదల, దాని ఆకాంక్షల గురించి ఆందోళన చెందుతోంది. పైగా చైనాను సవాలు చేయడానికి భారతదేశాన్ని తన విలువైన భాగస్వామిగా చూస్తోంది. అందుకే ఇటీవలే అమెరికా పర్యటనకు వెళ్లిన మోదీకి అమెరికా ఎర్ర తివాచీ పరిచింది. జపాన్ లాగా, ఇప్పుడు భారతదేశం... అమెరికా వ్యూహాత్మక చింతనలో ముఖ్యమైన స్థానాన్ని పొందింది. ఒబామా వైట్‌హౌస్‌లో ఉన్న రోజుల నుండి, యూఎస్–ఇండియా సంబంధాల సంగతి '21వ శతాబ్దాన్ని నిర్వచించే సంబంధాల'లో ఒకటిగా అమెరికా మాట్లాడుతోంది. 2023 జూన్ మొదటి వారంలో, అమెరికా రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్ ఢిల్లీలో ఉన్నారు. ఆయన 2016 నుండి అమెరికా 'ప్రధాన రక్షణ భాగస్వామి'గా ఉంటున్న భారతదేశం గురించి మాట్లాడారు. 'క్వాడ్' సభ్యులందరిలో, చైనాతో భారీ భూ–సరిహద్దు కలిగి ఉన్న ఏకైక దేశం భారతదేశం మాత్రమే అని అమెరికా ప్రభుత్వ యంత్రాంగానికి బాగా తెలుసు. 2023 జూన్ మొదటి వారంలో దాని 20వ ఎడిషన్‌ను ముగించిన వార్షిక 'షాంగ్రి–లా డైలాగ్ '... ఆసియాలో మారుతున్న ఈ ధోరణులను గుర్తించింది. అయితే భారతదేశం ఈ ప్రాంతంలో యూఎస్ క్లయింట్ స్టేట్‌గా ఉండలేదు. లేదా దిగ్గజ చైనాపై ఒక స్థాయికి మించి భారత్ ఆగ్రహం ప్రదర్శించలేదు. దూకుడుకు, అతివాగుడుకు చోటు లేని ఉన్నత స్థాయి దౌత్య నైపుణ్యం దీనికి అవసరం.

చైనాతో సంబంధాలు భారతదేశంలో అంతర్–పార్టీ స్పర్ధ కోణాన్ని జోడించాయి. 1962 అక్టోబరులో చైనా భారతదేశంపై దాడి చేసినప్పుడు, బీజేపీని అసహ్యించుకునే పండిట్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ అధికారంలో ఉండేది. కాబట్టి నెహ్రూను ఢీకొట్టే ఒక్క అవకాశాన్ని కూడా కాషాయ పార్టీ వదులుకోదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటూండగా, బీజేపీ అధికారంలో ఉంది. ఈ 2023 జూన్ 20వ తేదీ సోమవారం, వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి చైనాతో సరిహద్దు పరిస్థితిపై కాంగ్రెస్ శ్వేతపత్రాన్ని డిమాండ్ చేయడంలో ఆశ్చర్యం లేదు. 2020 జూన్ 19 నాటి అఖిలపక్ష సమావేశంలో 'ఎవరూ మన సరిహద్దులోకి ప్రవేశించలేదు లేదా ఏ సరిహద్దు ప్రాంతం కూడా ఇతరుల అధీనంలో లేదు' అని మోదీ చేసిన వ్యాఖ్య లను తరచుగా ప్రస్తావించడం ద్వారా ప్రధానిని మరింత ఇబ్బంది పెట్టాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. అవన్నీ పక్కన పెడితే, చైనాను నిరంతరం పరిశీలిస్తూండటం మనకు ఎంతో అవసరం. భారత్ అప్రమత్తంగా మెలుగుతూ ఉండాలి.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్, ముంబయ్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వెళ్లడు.. వెళ్లనివ్వడు!!



మణిపూర్‌లో అల్లర్లు జరిగిన చురాచాంద్‌పూర్‌ను సందర్శించకుండా రాహుల్‌ను అడ్డుకోవడం మోదీ నిరంకుశత్వానికి నిదర్శనం. శాంతిని నెలకొల్పడం రాహుల్ ఉద్దేశం. రాష్ట్రాన్ని సందర్శించే తీరిక మోదీకి లేకపోవడం దురదృష్టకరం. – వి. నారాయణసామి, పుదుచ్చేరి మాజీ సీఎం

ఫోన్‌పే పోస్టర్‌లు



మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్‌ను లక్ష్యంగా చేసుకుని తమ లోగోను వాడడంపై ఫోన్‌పే సంస్థ కాంగ్రెస్ పార్టీ పట్ల అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే.. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కమల్‌నాథ్‌పై వచ్చిన ఇదే తరహా పోస్టర్‌కు తాజా పోస్టర్ ప్రతిస్పందన అని ఫోన్‌పే దృష్టికి నిజంగా రాలేదా?! – అమిత్ బిష్ణోయ్, టెక్నోషెల్

వద్దు.. కదిలించొద్దు



ప్రతిపక్షాలు ముస్లింలను రెచ్చగొడుతున్నాయని మోదీ ఆరోపిస్తున్నారు! ఉమ్మడి పౌరస్మృతిని అమలులోకి తెచ్చేందుకు ఆయన మళ్లీ ప్రయత్నాలు మొదలు పెట్టడం మాత్రం రెచ్చగొట్టడం కాదా? తిరిగి ఎందుకు ఆయన ఈ తేనె తుట్టెను కదిలిస్తున్నారు? 2024 ఎన్నికల కోసమేనా?! – కపిల్ సిబల్, ఎంపీ

అంతులేని కథ



నీటి అడుగున గోవా స్మార్ట్ సిటీ పణజి! నిరంతరంగా రోడ్లు తవ్వడం, వెర్రెత్తినట్లుగా భవన నిర్మాణం... దేశంలోనే అత్యంత సమ్మోహన నగరాలలో ఒకటైన పణజిని నాశనం చేస్తున్నాయి. ఆ మాటకొస్తే.. వర్షాకాలంలో ఇది దేశమంతటా కనిపించే దృశ్యమే. – రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

కీలకమైన పాత్ర



మా గణాంకాలు పైకి సంఖ్యల్లా కనిపించవచ్చు, కానీ అవి విధాన నిర్ణయాల రూపకల్పనకు తోడ్పడతాయి. జాతీయ గణాంకాల దినోత్సవం సందర్భంగా.. మెరుగైన భవిష్యత్తును అందించడంలో గణాంకాలు పోషిస్తున్న పాత్రను గుర్తు చేసుకుందాం. – ప్రీతేశ్ పటేల్, ఎ.పి.ఎం.సి. ఛైర్మన్

ఇన్‌బాక్స్

అతడు నిరంతర కృషీవలుడు!

వలేటి గోపీచంద్ వ్యక్తిగా, ఉద్యోగిగా ఈ సమాజానికి ఎంతో సేవ చేశారు. తాను చదువుకున్న బాపట్ల వ్యవసాయ కళాశాల పట్ల అవ్యాజమైన అభిమానం ఉన్న గోపీచంద్ దాని చరిత్రపై పరిశోధన చేసి విలువైన సమాచారం వెలికి తీశారు.

1945లో కళాశాల ప్రారంభం నుంచి ఇటీవలి కాలం వరకు అన్ని బ్యాచ్‌ల గురించి వివరాలతో కాఫీ టేబుల్ బుక్ 'ఒక నేల, అనేక ఆకాశాలు' అత్యంత ఆకర్షణీయంగా వెలువరించారు. చరిత్రను తవ్వి కళాశాలను జులై 16న ఉమ్మడి మద్రాస్ గవర్నర్ సలహాదారు ఎస్‌వీ రామ్మూర్తి ప్రారంభించారనీ, అప్పటి వ్యవసాయ సంచాలకులు బీవీ నాథ్, గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షులు పీవీ కృష్ణయ్య చౌదరి సహకారం అందించారనీ ఈనాటి తరానికి ఈ పుస్తకం తెలియచేసింది. బాపట్లలోనే ఎందుకు పెట్టారు అని కారణం వెతికి ఆ రోజుల్లో 'బాపట్ల సిటిజెన్స్ కమిటీ' కృషిని వెలుగులోకి తెచ్చారు. 'బాపట్ల కళాశాల ఓ పేరు కాదు. నామవాచకం అంతకంటే కాదు. ఈ రోజు అది సర్వనామం. ఆ నేల... చదువుల పంటల చరిత్ర నుదుటి మీద సంతకం. ఆ నేల వెలిగించిన పంటలు కారుచీకటిలో కాంతిదీపాలు'. ముందుమాటలో ఆయన పలుకులు కళాశాల మీద అయన అంతరాంతరాల్లో పెల్లుబికే ప్రేమకు చిహ్నాలు. అక్షర సత్యాలు. ఆ నేల పాఠాలు దిద్దుకున్న మొదటితరం 1945 బ్యాచ్ నుండి ప్రతివారినీ సంప్రదించి, కీర్తిశేషులయిన వారి వివరాలను కుటుంబ సభ్యుల ద్వారా సేకరించి ఉత్తమ స్థాయి పరిశోధకుడిలాగా ఈ పుస్తకాన్ని తేవటం గొప్పవిషయం. అపరిమితమయిన అభినివేశం ఉంటే తప్ప సాధ్యం అయ్యేది కాదు. ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థుల గురించి స్థూలంగా వివరాలతో పాటు విశేష సేవలు అందించిన వారి విశిష్టత, ఫోటోలు ప్రచురించారు. అంతటితో ఆగకుండా, ఆంధ్రప్రదేశ్ హరిత విప్లవానికి స్థానికంగా, అంత ర్జాతీయంగా కృషి చేసిన బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల విజయగాథలను 'వెలుతురు తోవలు', 'వెలుతురు పూలు', 'వెలుగు దివ్వెలు' అనే మూడు సంపుటాలుగా ప్రచురించి ఆవిష్కరణ సభలు జరిపారు. ఈ మహత్కార్యంలో వారితోపాటు 'రైతు నేస్తం' వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ కమిషనర్ దివి పోలు నాయుడు, జీఎస్టీ చీఫ్ కమిషనర్ డాక్టర్ డి. పురుషోత్తం వంటివారు పాలుపంచుకున్నారు.

గోపీచంద్ చేసిన మరో చెప్పుకోదగిన పని – 'డా॥ ఐవీ సుబ్బారావు స్మారక కమిటీ' ద్వారా రైతాంగానికి సేవ చేసిన శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, అధికారులు, నిపుణులు, ఆదర్శ రైతులను గుర్తించి ప్రతీ ఏటా అవార్డులు ఇవ్వటం. గోపీచంద్ మొదలుపెట్టిన ఈ పనిని తర్వాతికాలంలో 'రైతునేస్తం' ఫౌండేషన్ ద్వారా దశాబ్ద కాలంగా కొనసాగిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించడంలోనూ, చిరు ధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడాన్ని ప్రోత్సహించడం లోనూ వీరి కృషి ప్రశంసనీయం. అట్లాగే, 'మిద్దెతోటల' పెంపకం గురించి అనేక అవగాహన సదస్సులు, వర్కుషాపులు నిర్వహించారు. గత మూడు దశాబ్దాలుగా వ్యవసాయానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా విధాన పరమైన అంశాల్లో సైతం అనేక పత్రికల్లో వందలకొద్దీ వ్యాసాలు రాశారు. సమాజ వికాసానికి వ్యక్తిగత స్థాయిలో తన వంతు కృషి చేసిన గోపీచంద్ పేరు వ్యవసాయ సమాచార ప్రసారకుల్లో గుర్తుండిపోతుంది.

– చంద్రశేఖర రావు నూతలపాటి
విజిటింగ్ ప్రొఫెసర్, కార్నెల్ యూనివర్సిటీ

(ఆకాశవాణి నుంచి వలేటి గోపీచంద్ నేడు పదవీ విరమణ చేస్తున్నారు)

జగన్ సుపరిపాలనే ఆయనకు రక్ష!

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఓ దిక్కు ఎన్నికల వాగ్దానాలను పూర్తిచేస్తూ, సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా యువ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దూసుకెళ్తున్నారు. ఏ రాజకీయాలు ఎలా ఉన్నా తరతరాల బాధితులు పేద బహుజన వర్గాలకు అండదండగా ఉంటూ, నాలుగేళ్ళ పాలనలో ఆంధ్ర ప్రజల హృదయాలను గెలుచుకుంటున్న నాయకుడు జగన్. నిజాయతీ, విలువలు గల రాజకీయాలతో సమస్తాంధ్ర ప్రజలకు మెరుగైన జీవితాన్నిస్తున్న దిశలో పథకాలను రూపొందిస్తున్నారు. నాలుగేళ్ళలో నలభై సంవత్సరాల భరోసానిస్తూ పనినే దైవంగా భావించి నిరంతరం కృషిచేస్తున్న వర్క్‌హాలిక్ జగన్.

మరో దిక్కు తిట్లపురాణాలతో, ఆత్మస్తుతితో జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఎంత మంచి పనినైనా సరే నిందిస్తూ ప్రధాన ప్రతిపక్షం తెలుగు దేశం నాయకులు రాష్ట్రమంతటా తిరుగుతూ ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. ఎవరెన్ని తిట్ల దండకాలు చదివినా, ఆర్భాటాలు చేసినా, నెగెటివ్ ప్రచారానికి దూరంగా రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా జగన్ పనులు చేస్తూ పోతున్నారు. రోజురోజుకూ ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం పొందే కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. చంద్రబాబు తిట్లు జగన్‌కు ప్రజల దీవెనలుగా మారుతున్నాయన్నది జగమెరిగిన సత్యం.



జగన్ వ్యతిరేకతను రోజులవారీగా, నెలల వారీగా, సంవత్సరాల వారీగా పదే పదే ప్రచారం చేస్తూ పోతే ప్రజలు నమ్ముతారని చంద్రబాబు ప్రగాఢ విశ్వాసం. కాని జగన్ అన్ని వర్గాల, పక్షాల ప్రజలను అక్కున చేర్చుకోవడం చూస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు జగన్‌పై కాదు, చంద్రబాబుపైనే వ్యతిరేకత పెంచుతున్నాయని తేలింది.

మరో దిక్కు ఏ రాజకీయ ప్రాపంచిక దృక్పథమూ లేని జనసేన నేతతో పొత్తు పెట్టుకొని ఆయన సినిమా గ్లామర్‌ను ఉపయోగించుకుంటూ చేసే జగన్ వ్యతిరేక ప్రచారం, ఇంకొక దిక్కు కేంద్రంలో ప్రభుత్వముంది కాబట్టి బీజేపీతో చేయి కలిపి జగన్‌ను ఇబ్బంది పెట్టాలని చేసే ప్రయత్నాలు చంద్రబాబుకు ఎటువంటి ప్రయోజనాన్నీ కలిగించవు. తొమ్మిదేళ్ళ పాలనలో బీజేపీ జనానికి ఉపయోగపడే పని ఒక్కటీ చేయలేదు. అటువంటి పార్టీ ఆంధ్రప్రదేశ్ లోనూ అధికారంలోకి రావాలని కలలు కంటోంది. అయితే, జగన్ ప్రజారంజక పాలన బీజేపీ కలలను కల్లలు చేయనుంది.

రాష్ట్రం విడిపోయిన తరువాత ఐదేండ్లు పాలించినా పోలవరం ప్రాజెక్టును ఎందుకు పూర్తిచేయలేకపోయారు చంద్రబాబు. ఇపుడు జగన్ చేస్తున్న పనులను చంద్రబాబు అడ్డుకున్నట్టు ఆ ఐదేళ్ళు జగన్ ఆయన్ని అడ్డుకోలేదు కదా! హైదరాబాద్‌కు ఏమేమో చేశానని చెప్పే చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు తన పాలనలో ఎన్ని ఐటీ కంపెనీలను తెచ్చారు? ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారు? జగన్ పాలనలో రోడ్లు వేయలేదని విమర్శించే చంద్రబాబు ఐదేళ్ళలో ఎన్ని రోడ్లు వేశారు? బాబు తెచ్చిన పరిశ్రమలను, ఐటీ కంపెనీలను జగన్ వచ్చినతర్వాత పంపించేశారా!

ఐదేండ్లు పాలించి అమరావతిలో వేల ఎకరాల భూములు అస్మదీయులకు కట్టబెట్టి వారు వ్యాపారాలు చేసుకోవడానికి మార్గం సుగమం చేయడం తప్ప రాజధాని నిర్మాణం చేయలేదు చంద్రబాబు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాన్నీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీని తిట్టడం తప్ప చంద్రబాబు చేసింది, చేస్తు న్నది, చేయబోయేదేదీ లేదు. సామాజిక సమతుల్యతను కాపాడటానికీ, భవిష్యత్తులో మరో విభజన సమస్య రాకుండా ఆంధ్రప్రదేశ్‌ను కాపాడటానికీ, మూడు ప్రాంతాల సమానాభివృద్ధికి విప్లవాత్మకమైన మూడు రాజధానుల నిర్మాణం చేయకుండా అడ్డుకుంటున్నారు.

విమర్శ కోసం విమర్శలు చేసి రుణాత్మక ప్రచారంతో అధికారంలోకి రావాలని చూసే చంద్రబాబు కన్నా స్వల్పకాలంలోనే అనేక విప్లవాత్మక మార్పులతో ఆంధ్రప్రదేశ్‌ను విలువలు గల రాజకీయాలతో నడుపుతున్న జగన్ రాజకీయ పరిపక్వత ఉన్న ప్రజా నాయకుడు. ఆయన పాలనలో ఆంధ్రప్రదేశ్ సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త కథారచయిత
మొబైల్: 91829 18567

ధర్మో రక్షతి రక్షితః

ధర్మం వైపు ఉన్నవారికి ఎప్పుడూ మంచే జరుగుతుందని మన ఇతిహాసాల్లో అనేక ఉదాహరణలున్నాయి. రామాయణంలో రావణుని తమ్ముడు విభీషణుడు రాముని పక్షం వహించినట్లే... మహాభారతంలో కౌరవుల నుంచి ఒకడు పాండవ పక్షం వహించాడు. మహాభారత యుద్ధం ముగిసేనాటికి బతికిబట్టగట్టిన 11 మందిలో అతడూ ఒకడు. అతడే యుయుత్సుడు. కౌరవులలో మిగిలిన ఏకైక వ్యక్తి.

ధృతరాష్ట్రుడు, పాండురాజుల పుట్టుకకు కారకుడైన వేద వ్యాసుడు మహాభారతాన్ని రచించాడు. అతడు ఒకరోజు హస్తినాపురాన్ని సందర్శించాడు. ధృతరాష్ట్రుని భార్య గాంధారి ఆయనకు భక్తిశ్రద్ధలతో అతిథి మర్యాదలు చేసింది. ఆమె సేవలకు మెచ్చి వ్యాసుడు వరం కోరుకోమన్నాడు. 'నాకు వందమంది సంతానం కావాల'ని గాంధారి అంది. వ్యాసుడు ఆ వరమిచ్చి వెళ్ళిపోయాడు.

జ్యోతిర్మయం

వరాన్ని పొందిన రెండేళ్ల తర్వాత గాంధారి కౌరవులతోపాటు 'దుస్సల' అనే పుత్రికనూ కన్నది. కౌరవులు అనగానే దుర్మార్గత్వం, దుష్టత్వం గుర్తుకొస్తుంది కదా! కానీ కురు వంశంలోనే ధర్మాన్ని ఆచరించే యుయుత్సుడు అనేవాడు కూడా జన్మించాడు. ఇతడు గాంధారికి పుట్టిన వాడు కాదు. 'సుగధ' అనే వైశ్య దాసి ద్వారా ధృతరాష్ట్రుడు కన్న పుత్రుడు. గాంధారికి సంతానం కలగడంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆందోళన చెందిన ధృతరాష్ట్రుడు సుగధను చేరదీశాడు. దుర్యోధనుడు, ఇతర కౌరవులు పుట్టిన రోజే యుయుత్సుడు కూడా జన్మించాడు. అయితే చిన్నప్పటి నుంచి దాసి పుత్రునిగా అతడికి అవమానాలు ఎదురయ్యాయి. అయినా వాటిని పట్టించుకోకుండా సకల విద్యలూ అభ్యసించాడు. 60 వేల మందిని ఒక్కసారిగా ఎదుర్కొనగలిగిన 'అతిరథు'ని హోదా అతడిది. కౌరవుల వైపు ఉన్న అతిరథుల్లో అతడు ఒకడు. అటువంటి యుయుత్సుడు మొదటి నుంచీ వారి చేతుల్లో అవమానాలు పడుతున్నందువల్లా, వారి దుష్టత్వం తెలిసినందు వల్లా కురుక్షేత్ర మహా సంగ్రామంలో పాండవుల పక్షం వహించాడు. కౌరవులకు సంబంధించిన రహస్యాలు పాండవులకు చెప్పి వారి విజయానికి తోడ్పడ్డాడు.

కలియుగం ప్రారంభం అవ్వడంతో పాండవులు అర్జునుని కుమారుడైన పరీక్షిత్తుకు సింహాసనం అప్పగించి యుయుత్సుని అతడికి సంరక్షకునిగా నియమించి హిమాలయాలకు వెళ్లిపోయారు. ఆ విధంగా ధర్మం వైపు నిలిచిన యుయుత్సునికి మేలు చేకూరింది.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.9.55 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** విశాఖ ప.1.24 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** సా.5.24 నుండి 6.57 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.09 నుండి 9.01 వరకు తదుపరి ప.12.28 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** రా.2.53 నుండి 4.26 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.32, **సూర్యాస్తమయం:** 6.34.

'నెల పాటు పవర్‌లూమ్స్ బంద్'

ధర్మవరం: ప్రస్తుతం చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉందని, ఈ నేపథ్యంలో చేనేతలు గట్టెక్కేందుకు నెలరోజుల పాటు పవర్‌లూమ్స్ మగ్గాలను బంద్ చేస్తున్నామని ధర్మవరం పవర్‌లూమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలా వెంకటనారాయణ, కార్యదర్శి గిర్రాజు రవిశంకర్, కోశాధికారి నాగార్జునలు తెలిపారు. వీరు గురువారం ధర్మవరంలో విలేకరులతో మాట్లాడారు. చేనేత వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో చర్చించామని తెలిపారు. పవర్‌లూమ్స్‌లో ఉత్పత్తులు నెల పాటు బంద్ చేయడం వల్ల చేనేతలకు కొంతైనా మేలు జరుగు తుందని భావించి ఈ నిర్ణయం తీసుకు న్నామన్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకూ నెలపాటు పవర్‌లూమ్స్ మగ్గాల్లో చీరలు తయారు చేయడం నిలిపివేస్తున్నామన్నారు.

అదిరిందయ్యా.. పిల్ల రొయ్య!

ఏపీలో అతిపెద్ద ఆక్వా జోన్‌గా ఉమ్మడి తూర్పు గోదావరి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 314 హేచరీలు
- ఏటా 60 బిలియన్ల రొయ్య పిల్లల ఉత్పత్తి
- ఒక్క జిల్లాలోనే 50 ప్రాసెసింగ్ యూనిట్లు



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండల తీర ప్రాంతంలో రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు



హేచరీల్లో ఉత్పత్తి అయిన రొయ్య పిల్లలు

పిఠాపురం: ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతంలో రొయ్య పిల్లల ఉత్పత్తి జరుగుతోంది. ఇక్కడి సముద్ర జలాలు, గాలి రొయ్యల లార్వా ఉత్పత్తికి, రొయ్య పిల్ల పెరుగుదలకు అనువుగా ఉండటంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా వందలాది హేచరీలు (రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు) అభివృద్ధి సాధించాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తీర ప్రాంతంలో 314 హేచరీలు ఉండగా.. ఏటా ఇక్కడ 60 బిలియన్ల రొయ్య పిల్లలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇక్కడి నుంచి పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఒడిశా, కేరళ, హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాలకు రొయ్య పిల్లలు (ష్రింప్ సీడ్) ఎగుమతి అవుతున్నాయి.

లక్ష మందికి ఉపాధి

హేచరీలు, రొయ్యల చెరువులు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే కేవలం లక్ష మందికి ఉపాధి లభిస్తోంది. ఒక్కో హేచరీలో వివిధ పనులకు గాను సుమారు 150 మంది వరకు ఉపాధి పొందుతుండగా.. రొయ్యల చెరువుల నిర్వహణలో వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. ఇక రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లలో ఒక్కో యూనిట్‌లో 500 నుంచి 1000 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఒక్క ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే 50 వరకు రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటితోపాటు ఐస్ ఫ్యాక్టరీలు, రవాణా ప్యాకింగ్ యూనిట్లలో వేలాది మందికి ఉపాధి కలుగుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో పురోగమనం

రాష్ట్రవ్యాప్తంగా 70 ఆక్వా హబ్‌లను ఏర్పాటు చేసి నాణ్యమైన మత్స్య సంపదను విక్రయించుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. 10 ఎకరాలలోపు ఆక్వా చెరువులున్న రైతులకు యూనిట్ కేవలం రూ.1.50కే సబ్సిడీ విద్యుత్ అందిస్తోంది. 10 ఎకరాలకు పైబడి ఉన్న వారికి యూనిట్ విద్యుత్ రూ.3.85కే ఇస్తోంది. ఆక్వా ఎగుమతులు సక్రమంగా నిర్వహించడానికి ఎగుమతిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చేస్తోంది.

ఆక్వా రైతులకు అండగా ప్రభుత్వం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ఆక్వా రైతులకు తగిన అండ లభిస్తోంది. దీంతో తీర ప్రాంతంలో రొయ్యల సాగు, హేచరీలు బాగా పెరిగాయి. ఆక్వా ఉత్పత్తులు గణనీయంగా పెరగడానికి ప్రభుత్వ ప్రోత్సాహం దోహదం చేస్తోంది.

– సత్యనారాయణ, జేడీ మత్స్య శాఖ, కాకినాడ

హేచరీలకు ఎల్‌టీ కేటగిరీగా మార్చాలి



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 314 వరకు హేచరీలు ఉన్నాయి. ఏటా 60 బిలియన్ల రొయ్య పిల్లల ఉత్పత్తి జరుగుతోంది. ఇటీవల రొయ్యల ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలు తీవ్ర ఇబ్బంది కలిగించగా సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. కేంద్రంతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంది. హేచరీలకు విద్యుత్ వినియోగం చాలా అవసరం. గతంలో ఎల్‌టీగా ఉండే వాటిని హెచ్‌టీ చేయడం వల్ల అదనపు భారం పడింది. హేచరీలు 8 నెలలు పని చేస్తే 4 నెలలు మూతపడి ఉంటాయి. పని చేసే సమయంలో విద్యుత్ భారంగా మారగా పని చేయని సమయంలోనూ మినిమం బిల్లులు వేయడం వల్ల ఆర్థిక భారం పడుతోంది.

– సత్తి వీర్రెడ్డి, అధ్యక్షుడు, ఆలిండియా ష్రింప్ హేచరీస్ అసోసియేషన్ కాకినాడ చాప్టర్

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న పాలక మండలి చైర్మన్, సభ్యులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం దుర్గగుడి పాలక మండలి సభ్యులతో పాటు పలు భక్త బృందాలు, భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు ట్రస్ట్ బోర్డు సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తెయ్య, నంబూరి రవి, చింతా సింహచలం, దేవిశెట్టి బాలకృష్ణ, మారం వెంకటేశ్వరరావు, చింకా శ్రీనివాసులు, తొత్తడి వేదకుమారి, కేసరి నాగమణి, బచ్చు మాధవీకృష్ణ, నిడమానూరి కల్యాణి, కొలుకులూరి రామసీత, అనుమోలు ఉదయలక్ష్మి, అల్లూరి కృష్ణవేణిలు అమ్మవారికి సారె సమర్పించారు. పిఠాపురానికి చెందిన దుర్గాదేవి భక్త బృందం, భద్రాచలంకు చెందిన శోభన్ భక్త బృందం, గుడివాడకు చెందిన ఝాన్సీలక్ష్మీ భక్త బృందంలతో పాటు విజయవాడలోని పలు ప్రాంతాలకు చెందిన 41 భక్త బృందాలకు చెందిన 900 మంది భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. అలాగే, అమ్మవారిని ఎమ్మెల్సీలు పోతుల సునీత, టి.కల్పలతారెడ్డి దర్శించుకుని సారెను సమర్పించారు. వీరికి పండితులు ఆశీర్వచనాన్ని, ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

నారాయణ ఐఏఎస్ అకాడమీ వద్ద తల్లిదండ్రుల ఆందోళన

అధిక ఫీజులు వసూలు చేసి వసతులు కల్పించలేదని ఆగ్రహం

పెనమలూరు: కృష్ణాజిల్లా కానూరులోని నారాయణ ఐఏఎస్ అకాడమీ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేశారు. లక్షలాది రూపాయలు ఫీజు చెల్లించినా తమ పిల్లలకు కనీస వసతులు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అకాడమీ ఎదుట రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ కోర్సులతోపాటు సివిల్ సర్వీస్ పరీక్షలకు శిక్షణ పేరుతో నారాయణ ఐఏఎస్ అకాడమీలో విద్యార్థులను చేర్చుకున్నారని చెప్పారు. ఏడాదికి ఫీజు రూ.2 లక్షలు కట్టించుకున్నారని తెలిపారు. అడ్మిషన్ సమయంలో విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన భవన సముదాయం, ప్లే గ్రౌండ్, డిజిటల్ క్లాస్ రూములు, హాస్టల్లో గదికి కేవలం ముగ్గురే ఉంటారని, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ సదుపాయం, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో గెస్టు లెక్చరర్స్ ఉంటాయని చెప్పారని వివరించారు. గత ఏడాది గూడవల్లిలో క్యాంపస్ పెట్టి త్వరలో అన్ని వసతులతో ఉన్న భవనంలోకి మారుస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే 15 నెలల తర్వాత ఇప్పుడు కానూరులో కనీస వసతులు లేని భవనంలోకి పిల్లలను మార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నారాయణ ఐఏఎస్ అకాడమీ యాజమాన్యం తమను పూర్తిగా మోసం చేసిందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తుండటంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నారాయణ ఐఏఎస్ అకాడమీ డీజీఎం, ఏజీఎం, ప్రిన్సిపాల్ వచ్చి వారితో జరిపిన చర్చలు ఫలించలేదు. రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వచ్చి తల్లిదండ్రులతో మాట్లాడి శాంతింపజేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జగనన్నను ఎదుర్కోలేకనే బాబు అండ్ కో దుష్ప్రచారం

1,005వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాజకీయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేకనే బాబు అండ్‌కో దుష్ప్రచారానికి తెరలేపాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని 2014–2019 వరకు బాబు ఆయన అనుయాయులు కులం ముసుగులో అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రూ.3.50 లక్షల కోట్లు దోపిడీ చేశారని మండిపడ్డారు. కార్పొరేటర్‌గా కూడా గెలవలేని లోకేశ్, పవన్ యాత్రల పేరుతో రాష్ట్రంలో పర్యటించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బహుజనులను అణగదొక్కి కులాధిపత్యంతో అన్ని రంగాలను తన గుప్పెట్లో పెట్టుకోవాలని చూసిన బాబుకు సీఎం వైఎస్ జగన్ రూపంలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలిందన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, కారుమూరి పుష్పరాజ్, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి వ్యక్తిని కోల్పోయాం

ఉప్పాల రాంప్రసాద్ సంస్మరణ సభలో ప్రభుత్వ సలహాదారు సజ్జల



మాట్లాడుతున్న సజ్జల. చిత్రంలో మంత్రి జోగి రమేశ్, ఉప్పాల రాము, కొడాలి నాని తదితరులు

పెడన: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ క్రమశిక్షణ గల మంచి వ్యక్తి అని, విలువలతో కూడిన రాజకీయాలు చేశారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కొనియాడారు. ఆయన అకాల మరణం పార్టీతో పాటు ప్రజలకు తీరని లోటన్నారు. ఉప్పాల రాంప్రసాద్ సంస్మరణ సభ గురువారం కృష్ణా జిల్లా పెడన మార్కెట్ యార్డులో నిర్వహించారు. రాంప్రసాద్ కుమారుడు ఉప్పాల రాము, కోడలు జెడ్పీ చైర్‌పర్సన్ హారికతో పాటు సోదరులు నెహ్రూ తదితరులను సజ్జల పరామర్శించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాంప్రసాద్ కుటుంబాన్ని వ్యాపారపరంగా ఎన్నో ఇబ్బందులకు గురిచేసిందని వివరించారు. అయినా రాంప్రసాద్ భయపడకుండా వైఎస్ జగన్ వెంటే నడిచారని చెప్పారు. సీఎం జగన్ కూడా రాంప్రసాద్‌ను తన కుటుంబ సభ్యుడిగా గౌరవించేవారని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటారనడానికి రాంప్రసాద్ కుటుంబమే నిదర్శనమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ.. కృష్ణా జెడ్పీ చైర్మన్ పదవి జనరల్‌కు రిజర్వ్ చేయగా.. ఆ పదవిని బీసీ వర్గానికి చెందిన రాంప్రసాద్ కోడలు హారికకు సీఎం జగన్ కేటాయించారని గుర్తుచేశారు. రాంప్రసాద్ మరణం గురించి తెలిసిన వెంటనే సీఎం జగన్ వచ్చి కుటుంబసభ్యులను పరామర్శించారంటే.. ఆయనకు రాంప్రసాద్‌పై ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, సామినేని ఉదయభాను, కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేశ్, కైలే అనిల్, మొండితోక జగన్మోహనరావు, కలెక్టర్ ఢిల్లీరావు, ఎస్పీ జాషువా, గవర్నర్ సంయుక్త కార్యదర్శి పి.సూర్యప్రకాశ్, విజయవాడ డీసీపీ సత్తిబాబు, రాచకొండ కమిషనర్ వెలివెల సత్యనారాయణ, నాయకులు పడమట సురేశ్, పేర్ని కిట్టు, బూరగడ్డ రమేష్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ప్రపంచస్థాయి వేదపాఠశాల

- ఏడాదిన్నరలోనే అందుబాటులోకి
- కల్యాణ వెంకన్న వేదపాఠశాల స్నాతకోత్సవంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి



వేద విద్యను పూర్తిచేసుకున్న వారికి యోగ్యతా పత్రాలను అందిస్తున్న ధర్మారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతికి సమీపంలోని తుమ్మలగుంటలో ప్రపంచస్థాయి వేద పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వేద పాఠశాల మొదటి స్నాతకోత్సవం గురువారం జరిగిన సందర్భంగా ఎనిమిదేళ్ల పాటు సాగే శుక్ల, యజుర్వేదం వేద విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి సొంత నిధులతో రూ.3 లక్షల నగదు, 10 గ్రాములు వెండి డాలర్, యోగ్యతా పత్రాలను అందించారు. చెవిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే కాకుండా, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా తుమ్మలగుంటలో 25 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద వేద పాఠశాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఆగస్టులో నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదిన్నరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. విద్యార్థులకు వేద విద్యతో పాటు యోగా, ఇంగ్లిష్, కంప్యూటర్ విద్యను అందిస్తామన్నారు. వేద పాఠశాల అభివృద్ధిలో టీటీడీ సహకారం మరవలేనిదన్నారు. వేద విద్య పరిరక్షణలో చెవిరెడ్డి దంపతుల చొరవ, సంపూర్ణ తోడ్పాటు అందరికి ఆదర్శప్రాయమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి కొనియాడారు. కష్టం, శ్రమతో కూడిన వేద పాఠశాల నిర్వహణను భావి తరాలకు అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

శుభలేఖ పంపితే అమ్మవారి కుంకుమ, అక్షింతలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): మొదటి శుభలేఖను అమ్మవారికి సమర్పించే భక్తులకు కుంకుమతో పాటు అంక్షితలు అందించనున్నట్లు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు చెప్పారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సభ్యుల సమావేశం గురువారం బ్రహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో జరిగింది. ఇందులో దుర్గగుడిలో విధులు నిర్వహిస్తోన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరించాలనే ప్రతిపాదనను పాలక మండలి తీర్మానించినట్లు చెప్పారు. సీనియారిటీ ప్రకారం ఎన్ఎంఆర్‌లను పర్మినెంట్ చేస్తామన్నారు. దీనికి సంబంధించిన తీర్మానాన్ని ప్రభుత్వానికి, దేవాదాయ శాఖకు పంపిస్తామన్నారు. ఇకపై రూ.300 టికెట్ కొనుగోలు చేసే ప్రతి భక్తుడికి ఉచితంగా ఒక లడ్డూ ఇవ్వాలని తీర్మానం చేశామని చెప్పారు. దేవస్థానానికి చెందిన సీవీ రెడ్డి చారిటీస్ స్థలంలో దేవస్థానం తరఫున ఆసుపత్రిని నిర్మించనున్నట్లు తెలిపారు. దేవస్థానానికి చెందిన రామవరప్పాడులోని 8.71 సెంట్లు, గోశాలలోని 472 సెంట్లు, విద్యాధరపురంలోని 4.25 సెంట్ల మాగాణి భూమిని చదును చేసి గోడౌన్లు, కళ్యాణ మండపాలు, కాలేజీలు, ఆస్పత్రుల నిర్వహణ నిమిత్తం 11 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు వివరించారు.

సాహసానికి 'స్పాట్' అవార్డు

- వంతెనపై నిలిచిపోయిన రైలును కదిలించేందుకు లోకోపైలట్ సాహసం
- ఫుట్‌బోర్డు మెట్లను హత్తుకుని కిందకి వేలాడుతూ సమస్య ఉన్న కోచ్‌కు..
- ఐసోలేషన్ కాక్‌ను లాక్ చేయడంతో కదలిన రైలు



సీహెచ్‌వీపీ ఫణిబాబు

తెనాలి : నది వంతెనపై ఆగిన రైలు.. సాంకేతిక సమస్య తో ముందుకు కదలనంటోంది.. సమయం గడుస్తోంది.. వెనక వచ్చే మెమో రైళ్లు ఆగిపోతున్నాయి.. మరికొన్ని నిముషాల్లో వచ్చే సూపర్‌ఫాస్ట్ రైళ్లకూ బ్రేకులు అనివార్యమైన వేళ.. అసిస్టెంట్ లోకో పైలట్ డ్రైవర్ చేసిన సాహసం.. ఉన్నతాధికారుల ప్రశంసలందుకుంది. దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ స్పాట్ అవార్డును గెలుచుకుంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సీహెచ్‌వీపీ ఫణిబాబు రైల్వే శాఖలో సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్‌గా బెజవాడ డిపోలో చేస్తున్నారు. ఈ నెల 22న చెన్నై–న్యూఢిల్లీ (నం.12615) సూపర్‌ఫాస్ట్ రైల్లో డ్యూటీలో ఉన్నారు. చెన్నై నుంచి బయలుదేరిన ఆ రైలు, ఓ ప్రయాణికుడు చైన్ లాగడంతో ఆ రాత్రి 8.14 గంటలకు తడ–సూళ్లూరుపేట మధ్యలో నిలిచిపోయింది. అది కూడా సరిగ్గా కళింగి నది వంతెనపై. లోపాన్ని సరిదిద్దడం సాధ్యపడలేదు. వాక్యూమ్ పోతోంది.. సంబంధిత బోగీ దిగువ నుండే ఐసోలేషన్ కాక్‌ను లాక్ చేయాలి.. కిందకు దిగడానికి అక్కడ ఎలాంటి సైడ్ పాత్ వే లేదు. దీంతో ఏం చేయాలో పాలుపోక గార్డు, సిబ్బంది నిస్సహాయంగా ఉండిపోయారు. పరిస్థితి గమనించిన రైలు డ్రైవర్(అసిస్టెంట్ లోకో పైలట్) సీహెచ్‌వీపీ ఫణిబాబు.. రైలు ఇంజన్‌లోంచి ఆ కోచ్‌కు వెళ్లి ఐసోలేషన్ కాక్‌ను లాక్ చేయడానికి సిద్ధపడ్డారు. బోగీ హ్యాండిల్స్, ఫుట్‌బోర్డు మెట్లను హత్తుకుని కిందకు వేలాడారు. ఏమాత్రం చేయి జారినా నదిలో పడిపోవడం ఖాయమని తెలిసినా.. భయపడలేదు. రైళ్లు ఆగిపోయి వేలాది ప్రయాణికులకు అసౌకర్యం కలగరాదన్న భావనతో తన విధి కాకున్నా ధైర్యం చేశారు. 15 నిమిషాల్లో ఐసోలేషన్ కాక్‌ను లాక్‌చేసి వ్యాక్యూమ్‌ను నిరోధించారు. దీంతో 9.05 గంటలకు జీటీ ఎక్స్‌ప్రెస్ ప్రయాణాన్ని ఆరంభించింది. తర్వాత వచ్చే సూపర్‌ఫాస్ట్ రైళ్లకు ఎలాంటి అవరోధం లేకుండా చేయగలిగారు. ఫణిబాబు సాహసం తెలుసుకున్న దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం శివేంద్రమోహన్, సీనియర్ డీసీఈ కొండా శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. 'డీఆర్ఎం స్పాట్ అవార్డు'ను బుధవారం ప్రకటించారు.

క్లుప్తంగా...


సిమ్లా కాదు బెంగళూరు

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా చేతులు కలిపిన ప్రతిపక్ష పార్టీలు రెండో విడతగా బెంగళూరులో సమావేశం కానున్నాయి. తొలుత సిమ్లాలో భేటీ నిర్వహించాలని భావించినప్పటికీ వేదికను బెంగళూరుకి మార్చారు. జులై 13, 14 తేదీలలో విపక్షాల భేటీ ఉంటుందని ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ వెల్లడించారు. పట్నాలో జరిగిన తొలి సమావేశంలో 17 పార్టీలు కలసి కట్టుగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సారి సమావేశంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రజా సమస్యలపై పోరుబాట, లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఉమ్మడి ఎజెండా, సీట్ల సర్దుబాటు వంటి అంశాలపై చర్చించనున్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన శరద్ పవార్ పట్నా సమావేశం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీలో అసహనం పెరిగిపోయిందని ఆరోపించారు. ఉమ్మడి పౌరస్మృతి మన దేశానికి అవసరమని ప్రధాని వ్యాఖ్యలపై చర్చ జరుగుతున్న సమయంలో యూసీసీపై తమ పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు. వివిధ వర్గాలు, మత సంస్థలతో చర్చించాక తుది నిర్ణయం వెల్లడిస్తామన్నారు. యూసీసీ కంటే ముందు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని పవార్ డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టులో నూతన రోస్టర్ విధానం!

సాక్షి, న్యూఢిల్లీ: వేసవి సెలవుల అనంతరం జూలై 3వ తేదీ నుంచి దాఖలైన పిటిషన్ల కేటగిరీల ఆధారంగా సుప్రీంకోర్టులో నూతన రోస్టర్ విధానం అమలులోకి రానున్నట్లు సమాచారం. ప్రజా ప్రయోజన వ్యాజ్యా(పిల్)లు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) లేదా సీనియర్ జడ్జీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారిస్తుంది. తాజా కేసుల జాబితా, ప్రస్తావనలకు సంబంధించిన నూతన ప్రక్రియ కూడా జూలై 3 నుంచి అమలులోకి రానుంది. మంగళవారం నాటికి ధ్రువీకరించిన తాజా కేసులు ఆటోమేటిక్‌గా సోమవారానికి, మిగిలినవి శుక్రవారం జాబితా చేయనున్నారు. తాజా కేసులను సీజేఐ ఎదుట లాయర్లు ప్రస్తావించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు సర్క్యులర్‌లో పేర్కొంది. ప్రస్తావన ప్రొఫార్మాలు మధ్యాహ్నం 3 గంటలలోపు సమర్పిస్తే తదుపరి రోజు ధర్మాసనాలు వాటిపై నిర్ణయం తీసుకుంటాయి. అదే రోజున జాబితా చేర్చాలని కోరుకొనే పక్షంలో ఉదయం 10.30 గంటల లోపు అత్యవసర లేఖతో ప్రొఫార్మాను సంబంధిత అధికారికి అందజేయాలి. వీటిపై భోజన విరామ సమయంలో సీజేఐ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

ఒక తిరుగుబాటు.. కొన్ని ప్రశ్నలు!



రష్యాపై పుతిన్ పట్టు సడలుతోందా?
తిరుగుబాటును ఎందుకు పసిగట్టలేదు?
ప్రిగోజిన్‌కు ఎందుకు కోపం వచ్చింది?
జనరల్ సుకోవిన్‌కు ముందే తెలుసా?
ప్రత్యర్థులపై పుతిన్ వేట మొదలుపెట్టారా?

ఎస్. రాజమహేంద్రారెడ్డి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇప్పుడు దెబ్బ తిన్న పులా? అలసిపోయిన పులా? దాదాపు రెండు దశాబ్దాలకుపైగా ఎదురులేని, తిరుగులేని నేతగా రష్యాను పరిపాలిస్తున్న పుతిన్‌ను ఉవ్వెత్తున ఎగసి అంతేవేగంగా నేలకరిచిన ఓ సాయుధ తిరుగుబాటు ఉక్కిరిబిక్కిరి చేసింది. నమ్మక ద్రోహాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసే రికార్డు ఉన్న పుతిన్ ఈసారి ఎందుకో క్షమాభిక్షతో పేజీ తిప్పేశారు. రష్యాపై పుతిన్ పట్టు సడలుతోంది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? ఎన్నో రహస్య యుద్ధాల్లో తన కనుసన్నల్లో కాలుదువ్విన వాగ్నర్ గ్రూప్‌సేనలు మడమతిప్పి తన మీదే తుపాకీ ఎక్కుపెట్టడం పుతిన్‌కు మింగుడు పడడం లేదు. వంటవాడ్ని చెఫ్ నుంచి కిరాయి సేన చీఫ్‌గా అంచెలంచెలుగా ఎదిగిన యెవ్‌గెనీ ప్రిగోజిన్ తిరుగుబాటుకు తెగిస్తాడని పుతిన్ కలలో కూడా ఊహించలేదు. ఆయన తేరుకునేలోపే ప్రిగోజిన్ సేనలు రష్యాలో ఓ పట్టణాన్ని తమ అధీనంలోకి తీసుకోవడమే కాకుండా రాజధాని మాస్కో ముట్టడికి కదం తొక్కాయి. అపారమైన సైనిక శక్తి, సాయుధ సంపత్తి కలిగి ఉన్న రష్యా ఈ కిరాయి సేనలను ఎందుకు నిలువరించలేకపోయిందో ఎవరికీ అర్థం కాని మిలియన్ డాలర్ల ప్రశ్న! తిరుగుబాటును ముందస్తుగా పసిగట్టలేనంత దుస్థితిలో రష్యా ఇంటెలిజెన్స్ వర్గాలు ఉన్నాయా? అన్న అనుమానం రాక మానదు. పుతిన్‌లో మునుపటి దూకుడు లేదనడానికి ఇది నిదర్శనం కాదా? అనవసరమైన రాజ్యకాంక్షకు దాసోహమని అందుబాటులో ఉన్న బలగాలన్నింటినీ ఉక్రెయిన్‌పై మోహరించడం తిరుగుబాటుకు కారణం కాదా? ఇంతకీ పుతిన్‌కు ఏమైంది? రాజకీయ విశ్లేషకులకు కూడా అర్థం కాని ప్రశ్న ఇదే.

ఈ క్షమాభిక్ష తాత్కాలికమే!

తిరుగుబాటును వెన్నుపోటుగా, దేశ ద్రోహంగా అభివర్ణించిన పుతిన్ అందుకు కారణమైన వాళ్ల అంతు చూస్తానంటూ బాహాటంగా ప్రకటించక పోవడం సామాన్య పౌరులకు సైతం విడ్డూరంగా అనిపించింది. బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో మధ్యవర్తిత్వంతో తిరుగుబాటు తిరుగుబాట పట్టినప్పటికీ, ప్రిగోజిన్‌కు, అతడి కిరాయి సేనలకు పుతిన్ క్షమాభిక్ష ప్రసాదించడం ఈ మొత్తం ఉదంతానికి యాంటీ క్లయిమాక్స్‌గానే చెప్పుకోవాలి. ఈ క్షమాభిక్ష తాత్కాలికమేనని, తిరుగుబాటుదారుల్లో ఏ ఒక్కరినీ పుతిన్ వదిలిపెట్టరనేది మరికొందరి వాదన. ఏది ఏమైనప్పటికీ పుతిన్ అధికార ప్రస్థానంలో ఇది మాయని మచ్చగానే మిగిలిపోతుంది. తిరుగుబాటు చల్లారిన తర్వాత పుతిన్ రెండుసార్లు జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆ రెండూ రికార్డు చేసి, ప్రసారం చేసినవే కావడం గమనార్హం. రష్యా ప్రజలను అవి పెద్దగా ఆకట్టుకోలేదు. ఇంత జరిగినా రష్యా ప్రజల్లో అధిక శాతం ఆయనకు మద్దతుగానే నిలవడం విశేషం. ఈ నేపథ్యంలో పుతిన్ ఉన్నట్టుండి బుధవారం జనం మధ్యలో ప్రత్యక్షమయ్యారు. వారితో కరచాలనాలు చేసి తానేమీ బెదిరిపోలేదనే సంకేతాలు పంపించారు.

ఆయుధాలు ఇవ్వనందుకేనా?

వంటవాడు గరిటె విసిరేసి తుపాకీ పడితే.. అతడే యెవ్‌గెనీ ప్రిగోజిన్ అవుతాడు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇష్టమైన వంటకాలను రుచికరంగా వండి వడ్డించి ఆయనకు కుడిభుజంగా రూపాంతరం చెందిన ప్రిగోజిన్ హఠాత్తుగా పక్కల్లో బల్లెంలా తయారై 24 గంటలపాటు తన బాస్‌ను భయపెట్టేశాడు. పుతిన్‌కు ఇంతకాలం విధేయుడిగా మసలిన ప్రిగోజిన్‌కు ఎందుకు అంత కోపమొచ్చింది? ఉక్రెయిన్‌లో తన సారథ్యంలోని వాగ్నర్ గ్రూప్ సేనలు సాధించిన విజయాలను రష్యా సైన్యం వారి ఖాతాలో వేసుకోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. యుద్ధం గడుస్తున్న కొద్దీ కరిగిపోతున్న ఆయుధ నిల్వలు, మందుగుండు సామగ్రిని భర్తీ చేయకపోవడం ప్రిగోజిన్‌ను అసహనానికి గురిచేసింది. నిజానికి అతడి కోపమంతా రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగూ, చీఫ్ జనరల్ వాలెరీ గెరాసిమో పైనే. బఖ్‌ముత్ ప్రాంతంలో ఉక్రెయిన్ సేనలతో జరిగిన యుద్ధంతో తమకు కావాల్సిన ఆయుధాలను సరఫరా చేసేందుకు రష్యా ససేమిరా అనడమే తిరుగుబాటు అసలు కారణమని విశ్లేషకుల అంచనా. రష్యాకు ఆయువు పట్టయిన కీలక మిలటరీ స్థావరం రోస్తోవ్‌ను చేజిక్కించుకొని, అదే ఊపులో ప్రిగోజిన్ సేనలు మాస్కో వైపు కదలడంతో తిరుగుబాటు బహిర్గతమైంది. అయితే రష్యా వైమానిక దళం కమాండర్ జనరల్ సెర్గెయ్ సురోవికిన్‌కు ఈ తిరుగుబాటు వ్యూహం గురించి ముందే తెలుసని, అంతర్లీనంగా ఆయన మద్దతు ప్రిగోజిన్‌కు ఉందని భోగట్టా. అందుకే ఆయన మౌనంగా ఉండిపోయారని రష్యా నిఘా వర్గాల సమాచారం. రష్యా సైన్యంలో కీలక స్థానాల్లో ఉన్న మరికొందరు జనరల్స్ సైతం పుతిన్ వ్యవహార శైలి రుచించక ప్రిగోజిన్‌కు పరోక్షంగా మద్దతు ఇచ్చారన్న వార్తలు కూడా చక్కర్లు కొడుతున్నాయి.

వాగ్నర్ గ్రూప్ కిరాయి సేనల పరిస్థితేమిటి?


సిరియా అంతర్యుద్ధంలో, 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను హస్తగతం చేసుకొనే క్రమంలో జరిగిన పోరాటంలో క్రెమ్లిన్ తరపున ప్రిగోజిన్ పనిచేశాడు. అంతటి వీరవిధేయుడు తిరుగుబాటు నేపథ్యంలో పుతిన్‌కు బద్ధశత్రువుగా మారిపోయాడు. అయినప్పటికీ బెలారస్ అధ్యక్షుడి మధ్యవర్తిత్వంతో ప్రిగోజిన్ క్షేమంగా రష్యా పొలిమేరలు దాటి వెళ్లిపోయాడు. ఏ షరతులకు లోబడి క్రెమ్లిన్‌కు, ప్రిగోజిన్‌కు మధ్య సంధి కుదిరిందో ఇంకా బయటపడలేదు. సంధి కుదిర్చిన బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో కూడా దీనిపై ఏ ప్రకటనా చేయలేదు. పుతిన్ కూడా ఈ అంశంపై పెదవి విప్పలేదు. క్షమాభిక్ష పెడుతున్నానని మాత్రమే ప్రకటించాడు. పుతిన్ మునుపటి బలవంతుడు కాదు, బలహీనుడు అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించడం ఇక్కడ గమనార్హం. ప్రిగోజిన్ క్షమాభిక్షతో బయటపడినప్పటికీ అతడి సారథ్యంలోని వాగ్నర్ గ్రూప్ కిరాయి సైనికుల భవిష్యత్తు ఏమిటన్నది ఇంకా తేలలేదు. చెల్లాచెదురైపోతారా? లేక రష్యా సైన్యంలో విలీనమై ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగిస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

కొసమెరుపు..

తిరుగుబాటు జరిగి(జూన్ 23) వారం రోజులవుతోంది. 24 గంటల్లోనే ఈ తిరుగుబాటు చల్లారడం, బాధ్యుడైన ప్రిగోజిన్ స్వేచ్ఛగా రష్యా విడిచి వెళ్లడం జరిగిపోయింది. అయితే ప్రిగోజిన్ ఎక్కడ తలదాచుకున్నాడో ఎవరికీ అంతుబట్టడం లేదు. మరోవైపు తిరుగుబాటు సమాచారం ముందే తెలిసినా మౌనంగా ఉండిపోయిన రష్యా వైమానిక దళం కమాండర్ సెర్గెయ్ సురోవికిన్ కూడా మాయమైపోయాడు. ఆయన ఎక్కడున్నాడో ఇటు రష్యా నిఘా సంస్థకు గానీ, అటు ఆయన కుటుంబ సభ్యులకు గానీ సమాచారం లేదు. అవిధేయతను అణచివేయడంలో సిద్ధహస్తుడైన పుతిన్ వేట మొదలుపెట్టారా? ఏమో! ఏమైనా కావొచ్చు!!

త్వరలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ?

3న ప్రధాని సారథ్యంలో కేబినెట్ భేటీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన వచ్చే నెల 3వ తేదీన కేంద్ర మంత్రి మండలి సమావేశం కానుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనుందన్న వార్తల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో జూలై 3న మంత్రివర్గ భేటీ జరిగే అవకాశం ఉందని అధికారులు గురువారం తెలిపారు. బుధవారం ప్రధాని మోదీ తన నివాసంలో పార్టీ కీలక నేతలతో సుదీర్ఘ చర్చలు జరిపారు. 2024 ఎన్నికల్లో పార్టీ వ్యూహంపై చర్చలు జరిపారు. 2024 ఎన్నికలకు ముందు ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడం, ఎదుర్కొనే సవాళ్లపై ఒక స్పష్టత సాధించడం వంటి వాటిపై సమావేశం దృష్టి సారించింది. హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు ఇందులో పాల్గొన్నారు. జేపీ నడ్డా కూడా చర్చల్లో పాల్గొనడంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతో పాటు బీజేపీ పార్టీలో రాష్ట్ర స్థాయిలోనూ మార్పులు జరిగే అవకాశం ఉందన్న ఊహాగానాలు వెలువడ్డాయి. మరికొద్ది నెలల్లో కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, 2024లో లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో ఆ మేరకు సన్నద్ధత చర్యలను ప్రారంభించే అవకాశాలున్నాయన్న అంచనాలున్నాయి. ఈ విషయమై అధికారికంగా బీజేపీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయినప్పటికీ, ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)అంశాన్ని ఇటీవల భోపాల్ జరిగిన ర్యాలీలో ప్రధానమంత్రి మోదీ ప్రస్తావించడాన్ని బట్టి చూస్తే 2024 ఎన్నికలకు ముందు బీజేపీ తన ప్రధాన సైద్ధాంతిక ఎజెండాను తెరపైకి తెచ్చే అవకాశాలున్నాయంటున్నారు. గత కొన్ని రోజులుగా అమిత్ షా, నడ్డా, బీజేపీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ కూడా పలురౌండ్ల చర్చలు జరిపి సంస్థాపరమైన, రాజకీయ అంశాలను చర్చించారని తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. సాధారణంగా పార్లమెంట్ సమావేశాలకు ముందుగా కేబినెట్ భేటీ జరుగుతుంటుంది. జూలై మూడో వారం నుంచి వర్షాకాల సమావేశాలు మొదలుకానున్నాయి. కేబినెట్ చివరి సమావేశం ఈ ఏడాది జనవరిలో, బడ్జెట్ సమావేశాలకు ముందుగా జరిగింది. అయితే, రానున్న సమావేశానికి మరో ప్రాధాన్యం ఉంది. మోదీ పాలనకు తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా జరగనున్న సమావేశంగా కూడా నిలువనుంది.

సీఎం చౌహాన్‌పై కాంగ్రెస్ పోస్టర్‌వార్..

ఫోన్ పే వార్నింగ్!

భోపాల్: మధ్యప్రదేశ్‌లో బీజేపీకి చెందిన శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంపై కాంగ్రెస్ చేపట్టిన పోస్టర్ ప్రచారం బెడిసికొట్టింది. ఆ పార్టీకి డిజిటల్ పేమెంట్స్ సంస్థ ఫోన్ పే గట్టి వార్నింగ్ ఇచ్చింది. కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పోస్టర్ యుద్ధం మొదలుపెట్టాయి. సీఎం చౌహాన్ చిత్రంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోస్టర్లు వేసింది. దుకాణాల్లో ఉండే క్యూఆర్ కోడ్ మాదిరిగానే ఈ పోస్టర్లున్నాయి. ఆ పార్టీ ట్విట్టర్ ఖాతాలోనూ వీటిని షేర్ చేసింది. చేసిన ప్రతి పనికీ సీఎం చౌహాన్ 50% కమీషన్ తీసుకుంటున్నారంటూ ఆరోపించింది. ఆ పోస్టర్లలో ఫోన్‌పే బ్రాండ్ పేరు, లోగో కూడా ఉండటం విశేషం. దీనిపై ఫోన్‌పే స్పందించింది. లోగో వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. బ్యానర్లు, పోస్టర్లపై తమ బ్రాండ్ పేరు, లోగోను తీసేయాలని, లేకుంటే చట్టపరంగా వెళ్తామని హెచ్చరించింది. ఇటీవల కర్ణాటకలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్‌కు పోస్టర్ ప్రచారం బాగా కలిసొచ్చింది. ఇదే ప్రచార తంత్రాన్ని ఇక్కడా అమలు చేయాలని భావించిన కాంగ్రెస్‌కు ఇలా అనూహ్యంగా షాక్ తగిలింది.



అయితే..పోస్టర్ వార్‌ను బీజేపీయే మొదలుపెట్టిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మధ్యప్రదేశ్ పీసీసీ చీఫ్ కమల్‌నాథ్‌ను అవినీతి పరుడంటూ వాంటెడ్ కమీషన్ నాథ్ పేరుతో పోస్టర్లు వేసిందని విమర్శించింది. ఈ ఆరోపణను బీజేపీ ఖండించింది. కాంగ్రెస్ పార్టీలోని కమల్‌నాథ్ అంటే గిట్టనివారే ఈ పని చేసి ఉంటారని, అవి తాము వేసిన పోస్టర్లు కాదంటూ ఖండించింది.



ఆస్ట్రియా కళాకారుడు గుస్తావ్ క్లిమ్ట్ గీసిన 'లేడీ విత్ ఏ ఫ్యాన్' చిత్రం. లండన్‌లోని సోత్‌బీలో ఇటీవల జరిగిన వేలంలో రూ.8,854 కోట్లు పలికింది. యూరప్‌లో ఇప్పటి వరకు అమ్ముడైన అత్యంత ఖరీదైన చిత్రంగా రికార్డుకెక్కింది.

మణిపూర్‌లో రాహుల్ గాంధీ అడ్డగింత

- ఘర్షణల భయంతో కాన్వాయ్‌ని అడ్డుకున్న పోలీసులు
- హెలికాప్టర్‌లో చురాచాంద్‌పూర్ చేరుకున్న రాహుల్
- సహాయక శిబిరాల్లోని అల్లర్ల బాధితులకు పరామర్శ



బాధితుల పిల్లలతో మాట్లాడుతున్న రాహుల్

ఇంఫాల్: మణిపూర్‌లో సొంత గ్రామాలు వదిలేసి, సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్న అల్లర్ల బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ వాహన శ్రేణిని పోలీసులు కొన్ని గంటలపాటు అడ్డుకున్నారు. చివరకు ఆయన హెలికాప్టర్‌లో సహాయక శిబిరాల వద్దకు చేరుకొని, బాధితులను పరామర్శించారు. రాహుల్ గురువారం ఉదయం విమానంలో ఢిల్లీ నుంచి ఇంఫాల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తన కాన్వాయ్‌లో చురాచాంద్‌పూర్‌కు బయలుదేరారు. ఇంఫాల్‌కు 20 కిలోమీటర్ల దూరంలోని బిష్ణుపూర్‌లో రాహుల్ కాన్వాయ్‌ని పోలీసులు అడ్డుకున్నారు. రాహుల్ చాలాసేపు అక్కడే ఉండిపోయారు. రాహుల్ కాన్వాయ్‌ని ముందుకు వెళ్లనివ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయన రాకను వ్యతిరేకిస్తూ మరోవర్గం ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాష్పవాయువు ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. చురాచాంద్‌పూర్ మార్గంలో ఘర్షణలు జరిగే అవకాశం ఉందని, రాళ్ల దాడులు జరగొచ్చన్న అధికారుల సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ హెలికాప్టర్‌లోనే పోలీసు ఉన్నతాధికారులతో కలిసి వెళ్లి సహాయక శిబిరాల్లో ఉంటున్న బాధితులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.

దుండగుల కాల్పుల్లో ఒకరి మృతి

మణిపూర్‌లో దుండుగుల కాల్పుల్లో ఒకరు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. రాజధాని ఇంఫాల్‌కు దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో కాంగ్‌పోక్‌పీ జిల్లా హరావోథెల్ గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. ఘటనా స్థలంలో ఒక మృతదేహం లభ్యమైందని ప్రభుత్వ అధికారులు చెప్పగా, మరికొంత మంది మరణించి ఉంటారని సైనికులు వెల్లడించారు. దుండగులు ఉదయం 5.30 గంటలకు స్థానికులపై కాల్పులు ప్రారంభించారు. భద్రతా సిబ్బంది రాకను గమనించి పారిపోయారు.

అంతరిక్షంలో నేపథ్య గానం!

పల్సర్స్ నక్షత్రాల నుంచి గురుత్వాకర్షణ తరంగాలు



పారిస్: అంతరిక్షంలో ప్రతిధ్వనిస్తున్న శబ్దాలకు సంబంధించిన విశేషాలను ఖగోళ శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. గురుత్వాకర్షణ తరంగాల నుంచి ఉద్భవిస్తున్న ధ్వనులపై ఒక ప్రకటన చేశారు. అంతరిక్షంలో వినిపిస్తున్న శబ్దాలకు సంబంధించిన నేపథ్య(బ్యాక్‌గ్రౌండ్) స్వరాలను గుర్తుపట్టినట్లు తెలియజేశారు. ఈ ప్రయోగంలో భారతీయ ఖగోళ శాస్త్రవేత్తలు సైతం కీలక పాత్ర పోషించడం విశేషం. పుణెలో ఉన్న రేడియో టెలిస్కోప్‌కు ఆ ధ్వని తరంగాలు చిక్కాయి. దాదాపు 15 ఏళ్ల నుంచి ఆ డేటాను సేకరిస్తున్నారు. అంతరిక్షంలోని సుదూర ప్రాంతాల నుంచి ఆ లయబద్ధమైన శబ్దాలు(హమ్మింగ్) వస్తున్నట్లు తేల్చారు. నార్త్ అమెరికన్ నానోహెర్ట్జ్ అబ్జర్వేటరీ ఫర్ గ్రావిటేషన్ వేవ్స్ బృందం ఆధ్వర్యంలో ఈ అధ్యయనం నిర్వహించారు. ఇండియా, కెనడా, యూరప్, చైనా, ఆస్ట్రేలియా ఖగోళ శాస్త్రవేత్తలు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. పల్సర్స్ అనే మండిన నక్షత్రాల నుంచి గురుత్వాకర్షణ తరంగాలు వస్తున్నట్లు గుర్తించారు. ఇవి శక్తివంతమైన గురుత్వాకర్షణ శబ్దాలను సృష్టిస్తున్నట్లు తేల్చారు. అంతరిక్షంలో గురుత్వాకర్షణ తరంగాల నుంచి శబ్దాలు వెలువడుతున్నట్లు శతాబ్దం క్రితమే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వెల్లడించారు.

బైడెన్‌కు తీవ్ర నిద్ర సమస్య

ఆయన సీపాప్ ఉపకరణం వాడుతున్నారన్న శ్వేతసౌధం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిద్రకు సంబంధించిన స్లీప్ అప్నియా అనే తీవ్రమైన సమస్యతో బాధపడుతున్నారు. దీంతో, ఆయన కొన్ని రోజులుగా నిద్ర కోసం సీపాప్(కంటిన్యువస్ పాజిటివ్ ఎయిర్ వే ప్రెజర్) అనే యంత్రాన్ని వాడుతున్నారని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. స్లీప్ అప్నియా సమస్య ఆయనకు దశాబ్దకాలంగా ఉందని తెలిపారు. 2008 నుంచి ఈ సమస్యతో బాధపడుతున్నట్లు ఆయన తన మెడికల్ రిపోర్టుల్లో వెల్లడిస్తున్నారని కూడా పేర్కొన్నారు. స్లీప్ అప్నియా అనేది సాధారణంగా కనిపించే సమస్య. నిద్రలో ఉన్న సమయంలో గాలి పీల్చుకోవడం తరచూ ఆగిపోతుంటుంది. ఈ సమస్య ఉన్న వారు రాత్రి మొత్తం నిద్రపోయినా పగటి వేళ అలసిపోయినట్లు ఉంటారు. సీపాప్ యంత్రాన్ని అధ్యక్షుడు మంగళవారం రాత్రి కూడా వాడాల్సి వచ్చిందని వైట్‌హౌస్ అధికారులు వివరించారు. షికాగోలో ఓ కార్యక్రమంలో ప్రసంగించేందుకు బయలుదేరిన సమయంలో ఆయన ముఖంపై గీతలు కనిపించాయి. సీపాప్ పరికరాన్ని వాడటం వల్లే ఇలా గీతలు పడ్డాయని తెలిపారు.

రాక్షస బల్లులతో మానవులకు స్వల్పకాలిక పరిచయం

లండన్: భూమిపై మనుషులతో సహా పలు రకాల క్షీరదాలు ఒకప్పుడు రాక్షస బల్లులతో(డైనోసార్లు) కలిసి జీవించినట్లు ఇంగ్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడయ్యింది. క్షీరదాల శిలాజాల పరీక్ష ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చారు. దాదాపు 6.60 కోట్ల ఏళ్ల క్రితం బలమైన గ్రహ శకలం భూమిని ఢీకొట్టడంతో రాక్షస బల్లులు అంతమైనట్లు పరిశోధకులు ఇప్పటికే నిర్ధారించారు. అంతకంటే కొంత కాలం ముందే మనుషులతోపాటు కుందేళ్లు, శునకాలు, పిల్లులు, గబ్బిలాల వంటి క్షీరదాలు పరిణామ క్రమంలో భూమిపై ఆవిర్భవించాయి. అవి రాక్షస బల్లులతోపాటే మనుగడ సాగించాయని బ్రిస్టల్ సైంటిస్టులు తేల్చారు. ఈ అధ్యయనం వివరాలను కరెంట్ బయాలజీ జర్నల్‌లో ప్రచురించారు. డైనోసార్లతో ప్రాచీన మానవుల పరిచయం ఎక్కువ కాలం కొనసాగలేదని వెల్లడయ్యింది. మానవులు ఆవిర్భవించిన కొంతకాలానికే డైనోసార్లు అంతం కావడమే ఇందుకు కారణం. భూమిపై జీవనం సాగించే విషయంలో డైనోసార్ల నుంచి ఎలాంటి పోటీ లేకపోవడంతో క్షీరదాలు విస్తృతంగా ఆవిర్భవించాయని, కాలానుగుణంగా వాటిలో వైవిధ్యం సైతం చోటుచేసుకుందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు.

భగ్గుమన్న ఫ్రాన్సు

- పోలీసు కాల్పుల్లో యువకుడి మృతితో మొదలైన దాడులు
- 40 వేల మంది పోలీసుల్ని రంగంలోకి దించిన ప్రభుత్వం

పారిస్: పోలీసు కాల్పుల్లో 17 ఏళ్ల యువకుడు మృతి ఘటనతో ఫ్రాన్సు భగ్గుమంది. పారిస్ శివారులోని నాంటెర్రెలోని ట్రాఫిక్ స్టాప్ వద్ద మంగళవారం నహెల్ అనే యువకుడిని పోలీసులు కాల్చి చంపారు. ఈ ఘటనతో రెండు రోజులుగా హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. ఆందోళనకారులు దేశవ్యాప్తంగా నిరసనలకు దిగారు. ముఖ్యంగా పారిస్ నగరంలోని స్కూళ్లు, టౌన్‌హాళ్లు, పోలీస్ స్టేషన్లు వంటి పలు ప్రభుత్వ భవంతులు, వాహనాలు, ఇతర ఆస్తులకు నిప్పంటించారు. రాళ్లు రువ్వారు. వీటిని నిలువరించేందుకు పోలీసులు పలుమార్లు బాష్పగోళాలు ప్రయోగించారు. దాడుల్లో 100కు పైగా ప్రభుత్వ భవనాలు దెబ్బతిన్నట్లు అంచనా వేసింది. ఆందోళనకారుల దాడుల్లో 170 మంది పోలీసులకు గాయాలయ్యాయి. వీటన్నిటికీ చెక్ పెట్టేందుకు ఫ్రాన్సు ప్రభుత్వం నిర్ణయించింది. సిబ్బంది, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బస్సు, రైలు సర్వీసులను నిలిపివేసింది. దీని ఫలితంగా రాజధాని, శివారు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దాడులు ఎక్కువగా జరిగిన ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించింది. ప్రస్తుతమున్న పోలీసుల సంఖ్యను 9 వేల నుంచి 40 వేలకు పెంచింది. నిరసనకారులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించింది. యువకుడిపై కాల్పుల ఘటనకు కారకులపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపింది.



పారిస్ శివారులో తగలబడుతున్న కార్లు

తమిళనాడు మంత్రివర్గం నుంచి సెంథిల్ బాలాజీ బర్తరఫ్



చెన్నై: తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ మంత్రి సెంథిల్ బాలాజీని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేశారు. ఈ మేరకు తమిళనాడు రాజ్‌భవన్ గురువారం ప్రకటన విడుదల చేసింది. లంచాలు తీసుకోని ఉద్యోగాలు ఇప్పించడంతోపాటు మనీ లాండరింగ్ వ్యవహారాల్లో సెంథిల్ బాలాజీపై కేసులు నమోదయ్యాయని, దర్యాప్తు సైతం ప్రారంభమైందని వెల్లడించింది. ప్రస్తుతం ఈడీ దర్యాప్తు చేస్తోందని, ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడని గుర్తు చేసింది.

బాలల సంరక్షణకు భారత్ చర్యలు భేష్

ఐక్యరాజ్య సమితి: అంతర్జాతీయంగా భారత్‌కు మరో శుభపరిణామమిది. చిన్న పిల్లలు సాయుధ పోరాటాల వైపు వెళ్లకుండా కట్టడి చేసినందుకు గాను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ (యూఎన్ఎస్‌జీ) వార్షిక నివేదిక నుంచి భారత్ పేరును తొలగించినట్టుగా యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెరెస్ తెలిపారు. సాయుధ ఘర్షణల ప్రభావం పడకుండా చిన్నారుల మెరుగైన సంరక్షణ కోసం భారత్ తీసుకున్న చర్యల్ని గుటెరెస్ స్వాగతించారు. 2010 నుంచి భారత్ పేరు ఈ నివేదికలో ఉంటూ వస్తోంది. కశ్మీర్‌లో ఉగ్రసంస్థలు బాలలను నియమించడం, భద్రత పేరుతో సైనికులు తిరిగి అదుపులోకి తీసుకోవడం వంటివాటితో భారత్ పేరు ఆ నివేదికలో ఉంటూ వస్తోంది. భారత్‌తో పాటు బుర్కినా ఫాసో, కేమరూన్,



నైజీరియా, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్‌లోనూ చిన్నారులు ఉగ్రముఠాల్లో చేరుతున్నట్టు యూఎన్ నివేదికలు చెబుతున్నాయి. బాలల హక్కుల పరిరక్షణకు కశ్మీర్‌లో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయడంపై గుటెరెస్ హర్షం వ్యక్తం చేశారు. బాలల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలతో ఛత్తీస్‌గఢ్, అసోం, జార్ఖండ్, ఒడిశా, జమ్మూకశ్మీర్‌లలో బాలల సంరక్షణ మెరుగైందని ఆ నివేదిక వెల్లడించింది.

కృత్రిమ తీపితో క్యాన్సర్!

వాషింగ్టన్: కూల్ డ్రింకులు తదితర బేవరేజెస్‌ల్లో నాన్ షుగర్ స్వీటెనర్(ఎన్ఎస్ఎస్)ల వాడకంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. వీటిని వాడటం మానేయాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) మే నెలలో కొత్తగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రపంచంలో అత్యంత సాధారణంగా వాడే కృత్రిమ స్వీటెనర్‌లలో ఒకటైన ఆస్పర్టెమ్‌తో క్యాన్సర్ ప్రమాదం ఉన్నదంటూ తాజాగా పరిశోధనలో తేలడంతో దీని వినియోగంపై అమెరికాలో సమీక్ష మళ్లీ మొదలైందని వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. అత్యంత విరివిగా వాడే కృత్రిమ షుగర్ పదార్థం ఒకటి క్యాన్సర్‌కు కారకంగా మారే అవకాశం ఉందని వచ్చే నెలలో డబ్ల్యూహెచ్‌వో క్యాన్సర్ రీసెర్చ్ ఏజెన్సీ ప్రకటించనుందంటూ రాయిటర్స్ తెలిపింది. ఆస్పర్టెమ్‌ను వాడొచ్చంటూ అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) 1981లోనే అనుమతులిచ్చింది. అయిదేళ్లకోసారి ఈ అనుమతిని సమీక్షిస్తూ వస్తోంది. భారత్ సహా 90కి పైగా దేశాల్లో అస్పర్టెమ్ వినియోగంలో ఉంది. ఆస్పర్టెమ్‌లో ఎలాంటి కేలరీలు ఉండవు. చక్కెర కంటే సుమారు 200 రెట్లు తీపిని ఇది కలిగిస్తుంది. ఆస్పర్టెమ్‌ను వినియోగించేందుకు 2009లో భారత ఫుడ్ సేఫ్టీ అండ్ రెగ్యులేషన్ సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) అనుమతినిచ్చింది. ఆస్పర్టెమ్‌ను 95% కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింకుల్లో స్వీటెనర్‌గా వాడుతున్నారు. బేవరేజెస్ మార్కెట్ షేర్‌లో అతిపెద్దదైన రెడీ టూ డ్రింక్ టీల్లో 90% వరకు వినియోగిస్తున్నారు. మిగతా స్వీటెనర్లతో పోలిస్తే ఆస్పర్టెమ్, అసెసల్ఫేమ్–కె అనే వాటి వాడకంతో క్యాన్సర్ ప్రమాదం కాస్త ఎక్కువేనంటూ గతేడాది ఫ్రాన్సులో చేపట్టిన ఓ అధ్యయనంలో తేలింది.




సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 30 । జూన్ । 2023



దుర్గమ్మకు రూ.లక్ష విరాళం
ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన కె.రవితేజ కుటుంబం గురువారం రూ.1,01,116 విరాళం సమర్పించింది.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిబద్ధత గల నేత రాంప్రసాద్
పెడన: డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ నిబద్ధత గల నేతని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కొనియాడారు. ఉప్పాల చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



పెనమలూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా సూచించారు. వణుకూరు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాన్ని ఆయన గురువారం పరిశీలించారు. లేఅవుట్‌లో మౌలిక వసతులు, నిర్మించిన, నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఎండీ లక్ష్మీశా మాట్లాడారు. గతంలో సొంత ఇళ్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తమకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రుణం తీర్చుకోలేనిదని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఈఈ నిరీక్షణరావు, డీఈ శివప్రసాద్, ఏఈ సత్యనారాయణ రాజు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏపీ ఎస్పీఎఫ్ కమాండెంట్‌గా శంకరరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) విజయవాడ జోన్ కమాండెంట్‌గా ముద్దాడ శంకరరావు గురువారం భవానీపురంలోని జోన్ కమాండెంట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ కమాండెంట్‌గా పనిచేసిన డాక్టర్ కె.ఎస్.రావు రాజమహేంద్రవరం కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి కమాండెంట్‌గా పనిచేస్తున్న ముద్దాడ శంకరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమాండెంట్‌గా సమర్థవంతంగా సేవలు అందిస్తానన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని బ్యాంకు కరెన్సీ చెస్ట్‌ల సెక్యూరిటీ, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, ఏపీ సెక్రటేరియేట్, గన్నవరం ఎయిర్ పోర్ట్, ఎన్టీటీపీఎస్, ఏపీ హైకోర్టు సెక్యూరిటీ, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని సిబ్బంది తన పరిధిలో ఉంటారని పేర్కొన్నారు.

టోల్‌ఫ్రీ నంబర్‌కు ప్రాచుర్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గగుడి టోల్‌ఫ్రీ నంబర్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు గురువారం తెలిపారు. పాలక మండలి సమావేశంలో టోల్‌ఫ్రీ నంబర్ ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. 'దుర్గగుడి పరిసరాల్లో జాడలేని టోల్‌ఫ్రీ నంబర్ బోర్డులు' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 27వ తేదీన ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. ఈ విషయమై ఆలయ అధికారులతో చర్చించారు. ఆలయ పరిసరాలతో పాటు దుర్గాఘాట్, కనక దుర్గనగర్, ఓం టర్నింగ్‌ల వద్ద టోల్‌ఫ్రీ నంబర్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



- దేశ ప్రజలందరూ ప్రేమానురాగాలతో జీవించాలి
- ఐజీఎం స్టేడియంలో సామూహిక ఈదుల్ అజ్‌హా నమాజు
- పది వేల మందికిపైగా హాజరైన ముస్లింలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీకైన బక్రీద్ పండుగను ఉమ్మడి కృష్ణా జిల్లా ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం ఈద్గాహ్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగిన సామూహిక ఈదుల్ అజ్‌హా నమాజులో పది వేల మందికిపైగా ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఫ్తీ షహబాస్ ఖాస్మీ ఉర్దూలో ఈద్ సందేశం అందించారు. పండుగ సంతోషం కేవలం ముస్లింలకు మాత్రమే కాదన్నారు. యావత్ ప్రపంచానికి సంతోషం కలిగించేలా ముస్లిం పండుగలు ఉంటాయన్నారు. త్యాగాల పండుగ బక్రీద్ అని మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. ఇస్లామీయా పండితులు ముఫ్తీ యూసుఫ్ ఖాస్మీ నమాజ్ చేయించారు. అనంతరం అరబ్బీలో ప్రసంగిస్తూ.. మానవులందరి దైవం ఒక్కడే అని అన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రేమానురాగాలతో మెలగాలని పిలుపునిచ్చారు. దేశంలో హిందూ, ముస్లింల మధ్య ఐక్యత, సోదరభావం పెంపొందించాలని సందేశమిచ్చారు. ఇప్పుడు దేశానికి కావాల్సింది కొత్త చట్టాలు కాదని, మంచి నైతికత కలిగిన రాజకీయ నాయకులని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం, దేశం కోసం ప్రత్యేకమైన (దువా) ప్రార్థన చేశారు. నమాజులో పాల్గొన్న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ముస్లిం సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముస్లింలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం ఈద్గా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాలేషావలి, మునీర్ అహ్మద్ షేక్ మాట్లాడుతూ.. ఏటా ఈద్ నమాజ్ రంజాన్, బక్రీద్‌ను ప్రభుత్వ సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నామని సంతోషం వ్యక్తంచేశారు. నమాజ్‌కు సహకరిస్తున్న మునిసిపల్, పోలీస్‌శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌కే వలీ, ఈద్గా కమిటీ సభ్యులు ఇంతియాజ్, అన్వర్ పాషా, ఎండీ ఇర్ఫాన్, ముఖ్తార్ అలీ, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. చిట్టినగర్ ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిట్టినగర్ ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

దుర్గమ్మ దర్శనం.. పులకించిన భక్తజనం

- దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఆషాఢ సారె, ఏకాదశి నేపథ్యంలో రద్దీ
- అమ్మవారి దర్శనానికి మూడు గంటలు



మహా మండపం వద్ద ఉన్న అమ్మవారికి హారతిస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బెజవాడ దుర్గమ్మ దర్శనానికి భక్తజనం తరలివచ్చింది. ఇంద్రకీలాద్రి పరిసరాలు అన్నీ భక్తులతో పోటెత్తాయి. కోరిన కోరికలు తీర్చే చల్లని తల్లిని దర్శించుకుని భక్తులు పులకించారు. ఆషాఢ మాసోత్సవాలు, తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి భక్తులు గురువారం తరలి వచ్చారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఈఓ భ్రమరాంబ, ఆలయ అధికారులు క్యూలైన్లలో రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. వీఐపీల తాకిడి అధికంగానే కనిపించినా సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా క్యూలైన్లను నియంత్రించారు. రూ.300 టికెట్ కొన్న భక్తులకు ముఖ మండప దర్శనం, రూ.100 టికెట్ తీసుకున్న వారికి బంగారు వాకిలి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్థగంట పాటు అన్ని క్యూలైన్లు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ రద్దీ కొనసాగింది. దేవస్థానంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి రద్దీగా ఉండే ప్రదేశాల్లో ప్రత్యేక విధులను కేటాయించారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన ఆర్జిత సేవలోనూ ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సాయంత్రం పంచహారతుల సేవ అనంతరం భక్తుల రద్దీ కొనసాగింది.



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు వస్తున్న మహిళలు

ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

- వారి సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్జీఓ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు ప్రజలకు పారదర్శక సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రకటించారు. ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పనిచేసి అభివృద్ధిలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. నగరంలో ఎన్జీఓ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల్లో తప్పొప్పులను సరిచేసేందుకు నాలుగు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని కలెక్టర్ ఢిల్లీరావు గురువారం ప్రారంభించారు. అనంతరం ఏపీ ఎన్జీఓ సంఘ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి నెలా మూడో వారంలో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి తమ పరిధిలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులకు చేరువ చేయడంలో ఉద్యోగుల సహకారం అవసరమని అన్నారు. ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేకంగా విజయవాడలో తొలిసారిగా ఉద్యోగులు, పెన్షనర్లు అందరికీ ఉపయోగపడేలా ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను ఎన్జీఓ హోంలో ఏర్పాటు చేశామన్నారు. గతంలో కూడా ఆధార్ సెంటర్, కరోనా సమయంలో వ్యాక్సినేషన్ సెంటర్లు, వైద్య శిబిరాలను నిర్వహించామని గుర్తుచేశారు. ప్రజా కలెక్టర్‌గా పేరు పొంది, సామాన్య ఉద్యోగికి సైతం స్నేహ హస్తం అందించే ఢిల్లీరావు ఎన్జీఓ హోంకు రావడం తమలో మరింత ఉత్సాహం నింపిందన్నారు. పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సాంబశివరావు, పెన్షనర్ల సంఘం నాయకులు కె.దాలినాయుడు, ఇక్బాల్, విష్ణువర్ధన్, బి.సతీష్ కుమార్, ఎం.రాజుబాబు, కె.మధుసూదనరావు, పలువురు ఉద్యోగ సంఘ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెంపుడు పిల్లి మృతిపై కేసు నమోదు



పర్షియన్ పిల్లి (ఫైల్)

గన్నవరం: పెంపుడు పిల్లి మృతిపై ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం కాలనీలో నివసిస్తున్న షేక్ చానా, సలామ్ దంపతులు పర్షియన్ పిల్లిని పెంచుకుంటున్నారు. వారి ఇంటి వెనుక నివసించే ఎం.కుమారి ఇంటి ముందు డ్రెయిన్‌లో మంగళవారం ఉదయం పిల్లి చనిపోయి కనిపించింది. గతంలో పర్షియన్ పిల్లి తరచూ కుమారి ఇంటికి వెళ్తుండేది. దీంతో కుమారి కుటుంబ సభ్యులు చానాతో గొడవపడ్డారు. మరోసారి పిల్లి తమ ఇంటి వైపు వస్తే చంపుతామని వారు హెచ్చరించారు. కుమారి కుటుంబ సభ్యులే ఆ పిల్లిని కొట్టి చంపినట్లు షేక్ చానా గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే పిల్లి మరణానికి తమకు ఎటువంటి సంబంధం లేదని కుమారి కుటుంబ సభ్యులు స్పష్టంచేశారు.

తీయని విపత్తు.. ఆరోగ్యం చిత్తు

- పెరుగుతున్న మధుమేహం దుష్ఫలితాలు
- ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్న రోగులు
- ఆరోగ్యం విషమించే వరకూ వ్యాధి సోకిందని గుర్తించని బాధితులు
- గుండెనొప్పి, పక్షవాతం, స్పృహ కోల్పోవడం, కిడ్నీ ఫెయిల్యూర్‌తో ఆస్పత్రుల పాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): తీయని విపత్తుగా పేరుపొందిన మధుమేహం రోగుల ఆరోగ్యాన్ని చిత్తు చేస్తోంది. శరీరంలో షుగర్ లెవల్స్ అసాధారణంగా పెరిగిపోతున్నా రోగులు గుర్తించలేక పోతున్నారు. ఫలితంగా ఏదో ఒక దుష్ఫలితంతో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తే కానీ తమకు మధుమేహం ఉందని వారికి తెలియడం లేదు. వ్యాధిబారిన పడిన ఎంతో మందికి ఆ విషయం తెలియక శరీరంలో అవయవాలు దెబ్బతిని ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ ఎటాక్, కిడ్నీ ఫెయిల్యూర్, కంటిచూపు మందగించడం, కోమాలోకి వెళ్లడం వంటి సమస్యలతో నిత్యం ఎంతో మంది రోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. మధుమేహం ఉన్న వారిలో 50 శాతం మందికి తాము ఆ వ్యాధిబారిన పడ్డామన్న విషయమే తెలియదు. అందుకే దీనిని 'సైలెంట్ కిల్లర్'గా పిలుస్తారు. మధుమేహం ఉన్నట్లు తెలిసిన వారిలో సైతం సగం మంది మాత్రమే మందులు వాడుతుండగా, వారిలోనూ సగం మందికే వ్యాధి అదుపులో ఉంటోందని వైద్యులు వివరిస్తున్నారు.

దుష్ఫలితాలతో ఆస్పత్రులకు..

మధుమేహ దుష్ఫలితాలతో ప్రభుత్వాస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీలు ఫెయిల్యూర్‌తో డయాలసిస్, చూపు మందగించడంతో రెటీనా దెబ్బతినడం, కాళ్లలో రక్తప్రసరణ తగ్గడంతో కుళ్లిన పాదాలతో నిత్యం రోగులు ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్నారు. జనరల్ సర్జరీ ఇన్‌ఫెక్షన్ వార్డులో సగం మంది రోగులు మధుమేహం వల్ల కలిగిన దుష్ఫలితాలతో వచ్చిన వారే ఉంటున్నారు. డయాలసిస్ కోసం వచ్చే వారిలో 70 శాతం మంది మధుమేహులు ఉంటున్నారు. గుండె జబ్బుల రోగుల్లో 40 శాతం, పక్షవాతం రోగుల్లో 30 శాతం మధుమేహులు ఉంటున్నట్లు చెపుతున్నారు. ఆప్తమాలజీ ఓపీకి రోజులో ఒకరిద్దరు రెటీనా సమస్యలతో వస్తున్నారు.

విషమించే వరకూ గుర్తించడం లేదు

మధుమేహం వలన కలిగే దుష్ఫలితాలతో పరిస్థితి విషమించే వరకూ తమకు వ్యాధి ఉందని రోగులు గుర్తించలేక పోతున్నారు. పక్షవాతంతో రోగి ఆస్పత్రికి వచ్చిన తర్వాత రక్తపరీక్షలు చేస్తే మధుమేహం అదుపులో లేదని తేలుతోంది. షుగర్ లెవల్స్ విపరీతంగా పెరిగిపోయి కోమాలోకి వెళ్లిన వారు సైతం ప్రభుత్వాస్పత్రికి వస్తున్నారు. వారికి బ్లడ్ టెస్ట్ చేస్తే రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అవుతుంది. అయితే ఇప్పటి వరకూ మధుమేహం ఉన్నట్లు తమకు తెలియదని రోగి కుటుంబ సభ్యులు చెపుతుంటారని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవయవాలు కోల్పోతున్నారు

మధుమేహం కారణంగా అవయవాలు కోల్పోతున్న వారు ఎందరో ఉంటున్నారు. కాళ్లకు రక్తప్రసరణ తగ్గిన వారికి వేళ్లు, కాళ్లు తొలగిస్తుంటారు. అదుపులో లేని మధుమేహంతో రెండు కిడ్నీలు పాడైన వారు ఉంటున్నారు. వారికి వారంలో రెండు, మూడు సార్లు డయాలసిస్ చేయాల్సి వస్తోంది. కంటి రెటీనా దెబ్బతిని చూపు కోల్పోతున్న వారు కొందరైతే, లివర్, బ్రెయిన్‌లపై సైతం తీవ్రమైన ప్రభావం చూపుతున్నట్లు వైద్యులు చెపుతున్నారు.

మధుమేహంపై అవగాహన పెరగాలి



మధుమేహంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉంటేనే వ్యాధి నియంత్రణలో ఉంటుంది. చాలా మంది పక్షవాతం, కోమాలోకి వెళ్లిన వారు, కిడ్నీలు ఫెయిల్యూర్ వంటి సమస్యలతో మా వద్దకు వస్తుంటారు. అప్పటి వరకూ వారికి వ్యాధి ఉన్నట్లు తెలియదు. వయస్సు 40 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా ఆరు నెలలకోసారి షుగర్ పరీక్ష చేయించుకుంటే మంచిది. షుగర్ మందులు వాడే వాళ్లు సైతం నెలకోసారి వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడే వ్యాధి నియంత్రణలో ఉందో లేదో తెలుసుకోగలుగుతాం.

– డాక్టర్ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్

వ్యాధిని అదుపులో ఉంచుకోవాలి



మధుమేహానికి మంచి మందులు అందుబాటులోకి వచ్చాయి. బరువు పెరగకుండా షుగర్‌ను నియంత్రించొచ్చు. ఒబెసిటీ ఉన్న వారు, స్మోకింగ్ చేసేవారు, ఫ్యామిలీలో ఎవరికైనా షుగర్ ఉన్నా, గర్భిణి సమయంలో షుగర్ వచ్చిన వారు వయస్సు 40 ఏళ్లు దాటిన తర్వాత తరచూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. దీర్ఘకాలంగా మధుమేహం ఉన్న వారు, షుగర్ లెవల్స్ అదుపులో లేని వారిలో అవయవాలు దెబ్బతింటాయి. షుగర్ ఉండి, బీపీ, కొలస్ట్రాల్ అదుపులో లేని వారిలోనూ అవయవాలపై ప్రభావం ఉంటోంది.

– డాక్టర్ ఎం. సునీత, డయాబెటాలజిస్ట్

విద్యుదాఘాతంతో బాలుడి మృతి


మురళీ మృతదేహం

గుడివాడరూరల్: ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై బాలుడు మృతి చెందిన విషాద సంఘటన మల్లాయపాలెంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడ ద్రోణాదులవారి వీధికి చెందిన వేముల మురళీ(17), మల్లయ్యపాలెంలో బెజవాడ అయ్యప్ప అనే వ్యక్తి ఇంటికి శ్లాబ్ వేసే నిమిత్తం మరికొందరు కూలీలతో కలసి పనికి వచ్చాడు. కూలీలు ఇంటికి కింద పనులు నిర్వహిస్తుండగా.. మురళీ ఇంటిపైకి ఎక్కాడు. ఇంటిపై నుంచి 11కేవీ విద్యుత్ వైర్లు ఉండటంతో ప్రమాదవశాత్తూ వాటికి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కూలీలతో పాటు ఉన్న తండ్రి, మిగిలిన కూలీలు హుటాహుటిన గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అప్పటికే మురళీ మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఈ విషయమై మృతుని తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎల్ఎస్ఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విషాద ఛాయలు..

ద్రోణాదుల వారి వీధిలో నివాసముండే నాగరాజు, జయలక్ష్మిలకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు తండ్రితో పాటే ప్రతిరోజు కూలి పనులకు వెళ్తుంటాడు. ఒక్కడే కుమారుడు కావడంతో తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచుకున్నారు. ప్రతిరోజు తండ్రితో పాటే పనికి వెళ్లే మురళీ, తండ్రి కళ్ల ఎదుటే విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో తండ్రి గుండెలవిసేలా రోధించారు.

భాగస్వాములే కిడ్నాపర్లు

- భార్యాభర్తల కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు
- విజయవాడలో భర్త శ్రీనివాస్ రియల్ ఎస్టేట్ సంస్థ ఏర్పాటు
- భాగస్వాములుగా మరో నలుగురు ఆ సంస్థలో పెట్టుబడులు
- కోవిడ్ సమయంలో ఇచ్చిన అడ్వాన్స్‌లు తిరిగి రాక నష్టాలు
- డబ్బులు ఇవ్వకపోవడంతో భాగస్వాములే కిడ్నాప్‌కు ప్రయత్నం
- గంటల్లోనే వారిని పట్టుకున్న విశాఖ పోలీసులు


మాట్లాడుతున్న విశాఖ సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి(విశాఖ): విజయవాడకు చెందిన భార్యాభర్తల కిడ్నాప్ కేసును విశాఖ పోలీసులు ఛేదించారు. వ్యాపార భాగస్వాములే వారిని కిడ్నాప్ చేసి రెండు కార్లలో విశాఖ నుంచి విజయవాడకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోనే పోలీసులు వారిని పట్టుకున్నారు. బాధితులు పట్నాల శ్రీనివాసరావు, లోవలక్ష్మి ఇద్దరినీ సురక్షితంగా విడిపించారు. విజయవాడకు చెందిన నలుగురు కిడ్నాపర్లు గ్రంధి బ్రహ్మయ్య, కొమవరపు సాయి నిఖిల్, బండారి వీరమణికంఠ, సింగంరెడ్డి ప్రదీప్‌రెడ్డిలను అరెస్ట్ చేయగా.. మరో వ్యక్తి సన్నీ పరారీలో ఉన్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు ఆ వివరాలివీ..

విజయవాడ కేంద్రంగా..

విజయవాడకు చెందిన పట్నాల శ్రీనివాసరావు మరో నలుగురు మనోజ్‌కుమార్, రవితేజ, వాగ్దేవి, నవీన్‌లతో కలిసి 2019లో ఎంకే కన్‌స్ట్రక్షన్స్ పేరుతో ఓ రియల్ ఎస్టేట్ బ్రోకరేజ్ సంస్థను ప్రారంభించారు. శ్రీనివాసరావుకు మార్కెటింగ్‌లో మంచి అనుభవం ఉందని భావించిన ఈ నలుగురు రూ.15లక్షలు చొప్పున పెట్టుబడులు పెట్టారు. వీరు భూములు కొనే వారికి, అమ్మేవారికి మధ్య వర్తిత్వం చేసి కమిషన్ తీసుకునే వారు. ఇలా 39 మంది కొనుగోలుదారుల నుంచి అడ్వాన్సుల రూపంలో వీరు రూ.3.36కోట్లు వసూలు చేశారు. అయితే కోవిడ్ కారణంగా భూముల యజమానులు, రియల్ ఎస్టేట్ సంస్థలకు ఇచ్చిన అడ్వాన్సులు తిరిగి రాలేదు. అలాగే భూముల లావాదేవీలు జరగకపోవడంతో ఎంకే కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కార్యకలాపాలు కూడా నిలిచిపోయాయి.

విజయవాడ టు విశాఖ వయా రావులపాలెం..

దీంతో తీసుకున్న డబ్బును చెల్లించాలని కొనుగోలుదారులు ఒత్తిడి చేశారు. అప్పటికీ ఇవ్వకపోవడంతో వారు విజయవాడ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో శ్రీనివాసరావుతో పాటు నలుగురిని అరెస్ట్ చేశారు. శ్రీనివాసరావు 11 నెలల పాటు రిమాండ్‌లో ఉన్నాడు. అనంతరం బెయిల్‌పై విడుదలైన అతను తూర్పుగోదావరి జిల్లా రావులపాలేనికి మకాం మార్చాడు. అక్కడ సత్యసాధ అనే స్వచ్ఛంద సంస్థలో వలంటీర్‌గా చేరాడు. అందులో వీర మణికంఠ అనే వ్యక్తి నుంచి రూ.20లక్షలు తీసుకొని డబ్బు చెల్లించకుండా మోసం చేశాడు. అక్కడి నుంచి భార్య లోవలక్ష్మితో కలిసి రెండు నెలల కిందట విశాఖకు వచ్చేశాడు.

విజయవాడ నుంచి రెండు కార్లలో వచ్చి..

విశాఖకు వచ్చిన శ్రీనివాసరావు దంపతులు గురుద్వార ప్రాంతంలో ఉన్న స్నేహితుడి ఇంట్లో నివాసముంటున్నారు. అక్కయ్యపాలెం ప్రాంతంలో ఒక రియల్‌ఎస్టేట్ సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా శ్రీనివాసరావు, టెలీకాలర్‌గా లోవలక్ష్మి చేరారు. వీరి భాగస్వాములు డబ్బులు కోసం శ్రీనివాసరావుకు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో వారు విజయవాడ నుంచి విశాఖకు వచ్చారు. భార్యాభర్తలు ఇద్దరినీ బుధవారం సాయంత్రం అక్కయ్యపాలెంలో బలవంతంగా కారు ఎక్కించి విజయవాడకు బయలుదేరారు. మార్గమధ్యలో శ్రీనివాస్ బహిర్భూమికి వెళతానని చెప్పడంతో వారు యలమంచిలి జాతీయ రహదారిపై కారు నిలిపారు. ఈ సమయంలో భార్య లోవలక్ష్మి బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు గమనించారు. దీంతో కిడ్నాపర్లు లోవలక్ష్మిని కారు నుంచి దింపేసి శ్రీనివాసరావును ఎక్కించుకుని వెళ్లిపోయారు. స్థానికుల సహాయంతో లోవలక్ష్మి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో అక్కడ పోలీసులు అప్రమత్తమై విశాఖ నాలుగో పట్టణ పోలీసులకు కూడా సమాచారం అందించారు.

గంటల్లోనే కిడ్నాపర్ల పట్టివేత..

విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై మిగిలిన స్టేషన్లకు సమాచారం అందించారు. దీంతో కిడ్నాపర్ల కారుపై నిఘా పెట్టిన పోలీసులు కత్తిపూడి వద్ద గుర్తించి పట్టుకున్నారు. నలుగురు కిడ్నాపర్లు విజయవాడకు చెందిన గ్రంధి బ్రహ్మయ్య, గన్నవరానికి చెందిన కొమవరపు సాయి నిఖిల్, కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన బండారి వీర మణికంఠ, విజయవాడకు చెందిన సింగంరెడ్డి ప్రదీప్‌రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో కిడ్నాపర్ సన్నీ కోసం గాలిస్తున్నట్లు సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు.

శ్రీనివాసరావుపై నాలుగు చీటింగ్ కేసులు

కిడ్నాప్‌నకు గురైన శ్రీనివాసరావుపై విజయవాడలో నమోదైన కేసుతో పాటు మూడు చీటింగ్ కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలిందని సీపీ వెల్లడించారు. 2012లో నర్సీపట్నంలో గృహోపకరణాలు తక్కువ ధరకు ఇస్తానని చెప్పి డిపాజిట్లు సేకరించి ఇవ్వకపోవడంతో కేసు నమోదైందన్నారు. ఆ కేసు ప్రస్తుతం పెండింగ్‌లో ఉందన్నారు. అలాగే ఓ అమ్మాయిని మోసం చేసి పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించగా కృష్ణా జిల్లా కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో, చెల్లని చెక్కులు ఇచ్చి రూ.20 లక్షలు తీసుకున్నందుకు రాజానగరం పోలీస్‌స్టేషన్‌లోను కేసులు నమోదైనట్లు వివరించారు. సమావేశంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు


బాలుడిని తల్లికి అప్పగించిన ఏసీపీ హనుమంతరావు, సీఐ సలాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో బాలుడిని కిడ్నాప్ చేసిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఈ కేసును పోలీసులు గంటల వ్యవధిలో ఛేదించారు. బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. గురువారం భవానీపురం స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశం ఏసీపీ కె. హనుమంతరావు కేసు వివరాలను వెల్లడించారు. ఆ వివరాలు..

ఆర్థిక లావాదేవీలే కారణం..

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన లింగం దేవేందర్ అలియాస్ దేవేంద్ర, గోపీకృష్ణ స్నేహితులు. ఓ రియల్టర్ కిడ్నాప్ కేసులో ఇద్దరు జైలుకు వెళ్లివచ్చారు. దేవేంద్ర ద్వారా కృష్ణా జిల్లా పామర్రు మండలానికి చెందిన వసంబత్తిన బుజ్జిబాబు, గూడూరుకు చెందిన ఊస సుభాషిణి, తూలిమేల్ల మంగారాణి ముగ్గురు గోపీ కృష్ణకు పరిచయమయ్యారు. అంతా కలిసి హైదరాబాద్‌లో ఇసుక వ్యాపారం చేశారు. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఇటీవల కాలంలో గోపీకృష్ణ తన కుమార్తె చదువు కోసం విజయవాడకు మకాం మార్చాడు. తమకు రావాల్సిన డబ్బులు అడుగుతున్నప్పటికీ గోపీకృష్ణ వాయిదాలు వేస్తూ వచ్చాడు. దీంతో బుధవారం దేవేంద్ర, బుజ్జిబాబు, సుభాషిణి, మంగారాణి నలుగురు తమకు రావాల్సిన డబ్బుల కోసం హైదరాబాద్ నుంచి భవానీపురంలో ఉంటున్న గోపీ కృష్ణ ఇంటికి చేరుకున్నారు. ఆ సమయంలో గోపీ కృష్ణ ఇంటి వద్ద లేడని తెలుసుకుని వెళ్లిపోయారు. కొంత సమయానికి అక్కడకు వచ్చి ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం నలుగురు కలిసి ఇంటి బయట ఆడుకుంటున్న గోపీకృష్ణ కుమారుడిని కిడ్నాప్ చేశారు. కొద్దిసేపటి తర్వాత దేవేంద్ర బాలుడి తండ్రి గోపీకృష్ణకు ఫోన్ చేసి తమకు రూ.50లక్షలు ఇవ్వాలని లేదంటే మీ అబ్బాయిని చంపేస్తామని బెదిరించారు. బాలుడి తల్లి రమాదేవి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దేవేంద్రపై ఇప్పటికే కేసులు..

దేవేంద్ర హైదరాబాద్‌లో హోం గార్డుగా చేసేవాడని, అతనిపై గోల్కొండ పీఎస్‌లో కేసులు ఉన్నాయని తెలిపారు. హోం గార్డు విధుల నుంచి తొలగించామన్నారు. కేసును గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులను ఏసీపీ హనుమంతరావు అభినందించారు.

నాలుగు బృందాలుగా..

బాలుడి కిడ్నాప్ వ్యవహారంపై జిల్లాలోని పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేశారు. సీఐ సలాం ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి సాంకేతికత సాయంతో కృష్ణా జిల్లా గూడూరు పోలీసు స్టేషన్ పరిధిలోని తుమ్మలపాలెం వద్ద కిడ్నాపర్లు ఉన్నట్లు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి బాలుడిని సురక్షితంగా తల్లికి అప్పగించారు. ఈ కేసులో నిందితులు దేవేంద్ర, బుజ్జిబాబు, సుభాషిణి, మంగారాణిలపై 364 (ఏ) రెడ్ విత్ 34 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ హనుమంతరావు తెలిపారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం

ప్రభుత్వ విప్ ఉదయభాను


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, ఎమ్మెల్యేలు పార్థసారథి, అనిల్‌కుమార్

ఉయ్యూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఉయ్యూరు పట్టణంలో ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్‌తోకలిసి గురువారం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా విప్లవాత్మకంగా కార్యక్రమాలను సీఎం జగన్ తీసుకుంటున్నారన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను చేరువ చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తుందన్నారు. ప్రజలు ఏ ధ్రువీకరణ పత్రాలు కోసం గతంలో ఇబ్బందులు పడ్డారో వాటిని పరిష్కరించి జగనన్న సురక్షతో పూర్తి పరిష్కారం లభించేలా చేస్తున్నామన్నారు. జూలై 1 నుంచి నెల రోజులు పాటు నిర్విఘ్నంగా సాగుతుందన్నారు. ప్రభుత్వమే ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తుందన్నారు.

బాధ్యతతో 'సురక్ష'ను నిర్వహిద్దాం

మంత్రి మేరుగ నాగార్జున


మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

అవనిగడ్డ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగాఅమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎవరికైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఒక విజన్ తో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని కొనియాడారు. చుక్కల భూముల సమస్యను పరిష్కరించడంతో ఎమ్మెల్యే సింహాద్రి ఎంతో కృషిచేశారన్నారు. కాపు సామాజిక వర్గం ఎప్పుడూ బాగుండాలని తమ పార్టీ కోరుకుంటుందన్నారు. రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లేది, కాపుల సంక్షేమం కోసం పాటు పడేదీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మీ, ఏపీ వ్యవసాయ మిషన్ జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి తదితరులు పాల్గొన్నారు.

8.5 కేజీల గంజాయి స్వాధీనం, ముగ్గురు అరెస్ట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నిషేధిత గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 8.50కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సేకరించిన వివరాల మేరకు నందిపాటి నాగరాజు అలియాస్ మున్నా ఖాళీగా తిరుగుతూ సీతమ్మవారి పాదాలు, వన్‌టౌన్, తాడేపల్లి ప్రాంతాలలో ప్లాట్‌ఫామ్‌పై ఉంటున్నాడు. రాజరాజేశ్వరిపేటకు చెందిన పసుపులేటి రాజా, పసుపులేటి సాయి అన్నదమ్ములు. వీరు స్వర్గపురిలో పాడెకట్టుకొని జీవిస్తుంటారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వీరిద్దరు మున్నాతో కలిసి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు.

ఒక్కొక్కరు రూ.5వేలు చొప్పున ముగ్గురు రూ.15వేలు పోగుచేసుకున్నారు. గంజాయిని కొనుగోలు చేయడానికి వెళ్లేందుకు మున్నా అంగీకరించి మూడు రోజుల క్రితం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరుకు వెళ్లాడు. అక్కడ రూ.15వేలకు గంజాయిని కొనుగోలు చేశాడు. తిరిగి అక్కడ నుంచి రైలులో ప్రయాణించి బుధవారం రాత్రి విజయవాడ వచ్చి స్టేషన్‌లో రైలు దిగకుండా.. కృష్ణానదిపై రైల్వే ట్రాక్‌పై దిగాడు. అనంతరం ముగ్గురు కలిసి గంజాయిని పంచుకునేందుకు నిర్మానుష్య ప్రాంతానికి వెళ్తున్నారు. ఆ సమయంలో గంజాయి తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేసి ఒక సంచిలో 8.5 కేజీల బరువు కలిగిన నాలుగు గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

4 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు

కొయ్యూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం పెదవలస నుంచి కాకినాడ జిల్లా బూదరాళ్ల, ఏలేశ్వరం, యర్రవరం మీదుగా విజయవాడకు తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని కాకరపాడు సెంటర్‌లో గురువారం పట్టుకున్నామని ఎస్‌ఐ రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకరపాడులో వాహనాల తనిఖీల్లో భాగంగా రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి బయటపడిందన్నారు. వారిలో విజయవాడకు చెందిన లంకే ఆదిత్య, మట్టి మనోజ్, గూడెం కొత్తవీధికి చెందిన వెంకట్రావును అరెస్టు చేశామన్నారు. ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు నుంచి జారి పడిన ఘటనలో గాయపడిన వ్యక్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. విజయవాడ జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17న రాత్రి 11.30 గంటల సమయంలో చెరువుమాధవరం రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో గుర్తు తెలియని మగ వ్యక్తి రైలు నుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. విధుల్లో ఉన్న సిబ్బంది గుర్తించి 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుని వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5 అడుగుల 7 అంగుళాలు, బట్టతల, తెల్లగడ్డం కలిగి ఉన్నాడని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యంకాలేదని పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా వారు కోరారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఘటనపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పైలా వారి వీధికి చెందిన సింగంశెట్టి మరియదాసు, పాల పరిమళ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. విజయ్‌కుమార్(4), వివేక్ కుమార్ (2)లతో పరిమల ఇంట్లోనే ఉంటోంది. బుధవారం ఉదయం పనికి వెళ్లిన మరియదాసు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. ఇంటి తలుపునకు తాళం వేసి ఉండటంతో పరిమళ స్నేహితురాలైన జ్యోతికను ఆరా తీశాడు. అయితే ఉదయం ఇద్దరు పిల్లలతో బయటకు వెళ్లిన పరిమళ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బీ న్యూ మొబైల్స్ షోరూం ప్రారంభం



తిరువూరు: స్థానిక సినిమాహాల్స్ సెంటర్లో బీ న్యూ మొబైల్స్ షోరూంను సీఈవో యర్రగుంట్ల సాయి నిఖిలేష్ గురువారం పునః ప్రారంభించారు. ప్రముఖ కంపెనీల మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాలు, టీవీలను వినియోగదారులకు అందుబాటు ధరల్లో ఉంచినట్లు సీఈవో తెలిపారు. ప్రముఖ కంపెనీల ల్యాప్‌టాప్‌లు, అన్ని రకాల కొనుగోళ్లకు క్యాష్‌బ్యాక్ ఆఫర్ ఉందని, ఎంపిక చేసిన మోడల్స్‌పై సున్నా డౌన్ పేమెంట్‌తో ఫైనాన్స్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఎంపిక చేసిన టీవీ మోడల్స్‌పై రూ.5వేల వరకు క్యాష్ బ్యాక్ సదుపాయం కూడా ఉందన్నారు. నూతన షోరూం ప్రారంభ సందర్భంగా తమ సంస్థ సేవలను విస్తృతపరిచేందుకు డోర్ డెలివరీ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు.

ఉరివేసుకొని బాలుడి ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసు స్టేషన్ పరిధి రాధానగర్‌కు చెందిన నల్లగుళ్ల దుర్గాప్రసాద్(16)ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లగుళ్ల వెంకట దుర్గాదేవి తన ఇద్దరు కొడుకులతో రాధానగర్లో అద్దె కుంటోంది. ఆమె పెద్ద కొడుకు దుర్గాప్రసాద్ మేనమామతో కలిసి చేపల వ్యాపారం చేస్తుంటాడు. అతను ప్రేమ పేరుతో మాటవినకుండా తిరుగుతున్నాడని తల్లి బుధవారం దుర్గాప్రసాద్‌ను మందలించి, బయటకు వెళ్లింది. సాయంత్రం 7గంటల సమయంలో చిన్న కొడుకు వెంకటేష్ ఇంటికి వచ్చి చూడగా దుర్గాప్రసాద్ చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకొని కనిపించాడు. చుట్టుపక్కల వారి సహాయంతో అతన్ని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. తల్లి వెంకట దుర్గాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై అంతర్గత బదిలీలు జరిగాయి. ఏఈవో స్థాయి నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు సుమారు వంద మందిని ఏకకాలంలో బదిలీ చేస్తూ ఈవో భ్రమరాంబ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ అంతర్గత బదిలీలు జరిగినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అధికారులను అంతర్గత బదిలీ చేస్తూ జారీ చేసిన సర్క్యులర్‌లోనే ఆయా అధికారులు ఏ తేదీన బదిలీ అవుతారో తెలియజేయడం గమనార్హం. మరో వైపున ఈ బదిలీలు ప్రతి మూడు నెలలకు ఒక సారి తప్పని సరిగా జరుగుతాయని అంటున్నారు.

దత్తపీఠంలో సహస్ర మోదక హోమం



పటమట(విజయవాడతూర్పు): తొలి ఏకాదశి సందర్భంగా పటమట లోని గణపతి సచ్చిందనంద ఆశ్రమంలో సహస్ర మోదక హోమం జరిగింది. ఈ హోమాన్ని శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ (బాల స్వామీజీ) నిర్వహించారు. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు పడి పాడి పంటలు పుష్కలంగా ఉండాలని హోమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన లాప్‌టాప్ అందజేత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆటోలో మర్చిపోయిన లాప్‌టాప్‌ను గంట వ్యవధిలో ఫిర్యాదుదారునికి వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి అందించారు. నలందడిగ్రీ కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చదువుతున్న మానేపల్లి భాగ్యతేజ్ తన ఇంటి నుంచి గురువారం కళాశాలకు బయలుదేరాడు. ఆ క్రమంలో ఆటోలో కాళేశ్వరరావు మార్కెట్ వద్ద వేరే ఆటో ఎక్కాడు. ఆ క్రమంలో ఆటోలో తన బ్యాగ్‌ను మరిచిపోయాడు. దాంతో వెంటనే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చి సుమారు రూ.80 వేల విలువైన లాప్‌టాప్‌ను మర్చిపోయినట్లు ఫిర్యాదు చేశాడు. దానిపై పోలీసులు వారు ప్రత్యేకంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిశీలించారు. దాంతో ఆ ఆటోను గుర్తించి లాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను గుర్తించారు. అనంతరం దానిని భాగ్యతేజ్‌కు అందించారు. దాంతో ఆ కుటుంబం పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు: చెన్నై–కోల్‌కత జాతీయ రహదారిపై తేలప్రోలు ఉషారామ కళాశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంలో కారు ధ్వంసమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన కోట సతీష్, శ్రీనివాసరావు పెద అవుటపల్లిలోని తమ స్నేహితుడైన నానిబాబు వద్దకు వచ్చారు. కారులో వారు ముగ్గురు కలసి గురువారం చిన్న తిరుపతికి బయలుదేరి వెళుతున్నారు. తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో కోల్‌కత వెళుతున్న లారీ వారి కారు వెనుక భాగంలో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కారు ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. ఆత్కూరు ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిప్పనగుంట సొసైటీకి ప్రత్యేక పురస్కారం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: రుణాల వసూళ్లలో నూరుశాతం పురోగతి సాధించటంతో తిప్పనగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ప్రత్యేక పురస్కారాన్ని సొంతం చేసుకున్నట్లు చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ గురువారం తెలిపారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు చేతుల మీదగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు చెప్పారు. 2022–23 వ సంవత్సరానికి గానూ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు కలిపి రూ.6.2 కోట్లు మంజూరు చేయగా, ఆ రుణ మొత్తాన్ని పూర్తిగా వసూలు చేసినట్లు తెలిపారు. దీనికి గానూ కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి పురస్కారాన్ని అందజేశారని చెప్పారు. రైతులకు ఉచితంగా మంచినీటి ట్యాంకర్‌ను సరఫరా చేస్తున్నట్లు ప్రభుకాంత్ తెలిపారు.

త్యాగనిరతికి నిదర్శనం బక్రీద్



మున్సిపల్ స్టేడియంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

పటమట(విజయవాడతూర్పు): ఐకమత్యానికి, త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని యునైటెడ్ ముస్లిం మైనారిటీ ఫోర్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బెజవాడ నజీర్ అన్నారు. గురువారం బక్రీద్ సందర్భంగా పటమటలో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ సమాజ హితం కోసం మహమ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగ నిరతికి ప్రతీకగా జరుపుకునేది బక్రీద్ పండుగ అన్నారు. దానం, సాయం, త్యాగం వంటి సుగుణాలను ఈ పండుగ ప్రతిబింబింపజేస్తుందని తెలిపారు. ఈ పండుగ సమస్త మానవాళికి ఆదర్శనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలీ, మొహమ్మద్ చాన్ బాషా, రాష్ట్ర కోశాధికారి మొహమ్మద్ ఫెరుజ్, కార్యనిర్వాహక కార్యదర్శి మొహమ్మద్ ఆష్రఫుల్ల తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు స్వీట్లు పంపిణీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): బక్రీద్ పర్వదినం సందర్భంగా రాణిగారితోట, 17వ డివిజన్‌లోని మస్జిద్‌లో ముస్లింలకు గురువారం స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ముస్లింలకు బక్రీద్ శుభాకాకంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్‌లో ముస్లింలు బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరకట్ట సమీపంలోని మసీద్ ప్రాంగణంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): ముస్లిం ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బక్రీద్‌ను పురస్కరించుకుని నిర్వహించిన ఈదుల్ అజ్‌హా నమాజులో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

గురు పౌర్ణిమ పూజల్లో ఎమ్మెల్యే వెలంపల్లి



వెలంపల్లికి ప్రసాదాలు అందిస్తున్న మందిర పాలకమండలి సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గురుపౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పాత హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణిమ ద్వాదశ సప్తాహ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు గురువారం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి సాయినాథునితోపాటు వారి భక్తులకు విశేష సేవలు అందిస్తున్న మందిర పాలకమండలి సభ్యులను వెలంపల్లి శ్రీనివాసరావు అభినందించారు. ముఖ్యంగా సాయిబాబాకు భక్తులతోనే అభిషేకాలు, సహస్రనామార్చన చేసే అవకాశం కల్పించటం హర్షణీయమన్నారు. సప్తాహ వేడుకల్లో భాగంగా ఉదయం 6గంటలకు బాబా విగ్రహాన్ని పంచగంగలతో అభిషేకించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో సహస్రనామార్చన గావించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 'ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి'అనే అఖండ సాయినామ సంకీర్తనతో భక్తులు పరవశించిపోయారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న సాయిబాబాకు మధ్యాహ్నం పంచహారతులు ఇచ్చిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. శుక్రవారం స్వామివారిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించనున్నామని, అనంతరం ప్రతి రోజూ మాదిరిగానే భక్తులు సాయిబాబాను పుష్పాలతో సహస్రనామార్చన చేస్తారని మందిరం పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు తెలిపారు.

పాలకమండలి ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పోతార్లంక రజనీకాంత్, గురజపల్లి వెంకట కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు నిర్వహించారు.

భక్తి భావ సమన్వితం తరంగ గానం



గోష్ఠిగానంలో మల్లాది సూరిబాబు, మోదుమూడి సుధాకర్, గౌరీనాథ్ తదితరులు

విజయవాడ కల్చరల్: లబ్బీపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సంగీత విద్వాంసులు నారాయణ తీర్థులు 348 వ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన తరంగ గానం భక్తి భావ రాగ సమన్వితంగా సాగింది.

సంగీత ప్రయోక్త మల్లాది సూరిబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు ప్రారంభ కార్యక్రమంలో తరంగ గోష్ఠి గానం నిర్వహించారు. మల్లాది సూరిబాబు, మల్లాది బ్రదర్స్, పోవూరి గౌరీనాథ్, మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, విష్ణుభొట్ల సోదరీమణులు పాల్గొన్నారు. సంగీతాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సామగాన లహరి ట్రస్ట్ చైర్మన్ మల్లాది సూరిబాబు నారాయణ తీర్థులు సంగీత సాహిత్య విశేషాలను వివరించారు. సంగీత కార్యక్రమాలు ఉదయం ప్రారంభమై 12 గంటలపాటు సాగాయి.

గణాంకశాస్త్రంతో దేశాభివృద్ధి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కిరణ్‌కుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గణాంకశాస్త్రం ద్వారా దేశాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు చేయవచ్చని నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఫీల్డ్ ఆపరేషన్ డివిజన్) ఆర్ కిరణ్‌కుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా గణాంక శాస్త్ర ప్రాముఖ్యతపై సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆర్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాజ వికాసానికి, అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయటానికి గణాంకాలు చాలా అవసరమన్నారు. ఆయా గణాంకాలను సేకరించటానికి వాటిని అధ్యయనం చేయటానికి, ఫలితాలను వివరించేందుకు గణాంక శాస్త్రం చాలా ఉపకరిస్తుందన్నారు. గణాంకశాస్త్రంపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. గణాంక శాస్త్ర నిపుణులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు గణాంకశాస్త్రంలో నైపుణ్యాలను సాధించాలన్నారు. ఈ రంగానికి సంబంధించిన నిపుణుల కొరత ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. ఈ శాస్త్రంలో పట్టు సాధించటం ద్వారా అద్భుతమైన అవకాశాలను పొందవచ్చని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో వివిధ అంశాలపై నిర్వహించిన పలు పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. విభాగాధిపతి సీహెచ్ రాధిక, అధ్యాపకులు డాక్టర్ పి.శేషుబాబు, సిహెచ్ సౌజన్య, సురేఖ, నాగలక్ష్మి తదితరులున్నారు.

తూర్పులో జేసీఎస్ ఇన్‌చార్జిల నియామకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గానికి జేసీఎస్ ఇన్‌చార్జిలను నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వారిలో 4, 9 నుంచి 14 డివిజన్‌లకు గద్దే కళ్యాణ్‌రామ్, సీహెచ్ సన్నీ, 2, 3, 5,6,7,8, 19 డివిజన్‌లకు తుళ్లూరి ఉదయ్, ప్రభు, 15,16,17,18, 20,21,22 డివిజన్‌లకు రామకృష్ణ, సాయికృష్ణారెడ్డిలను నియమించారు.

ట్రస్టు ఆధ్వర్యంలో గంగానమ్మ దేవస్థానం అభివృద్ధి

గుణదల(విజయవాడ తూర్పు): ఐదో డివిజన్ గుణదల గంగిరెడ్డులదిబ్బలోని గంగానమ్మ తల్లి దేవస్థానంను రూ.2.50 లక్షలతో అభివృద్ధి చేసినట్లు విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ తెలిపారు. అక్కడి ప్రజలు కోరిన మేరకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన తన సొంత నిధులు వెచ్చించి దేవస్థానం ఫ్లోరింగ్, టైల్స్, ప్రహరీ, గేట్ తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ట్రస్ట్ సిబ్బంది గురువారం పరిశీలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ తన తండ్రి దేవినేని నెహ్రూ హయాంలో కొండప్రాంత వాసులకు అండగా నిలిచారన్నారు. గంగిరెడ్డుల దిబ్బ ప్రాంత వాసులకు గంగానమ్మ తల్లి అంటే ఒక నమ్మకం అని ఆ దేవస్థానం అభివృద్ధి చేయాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు అక్కడి ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే స్పందించానన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సొంత నిధులు వెచ్చించి దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

డెప్యూటీ డీఈఓ కుమార్



ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్న డెప్యూటీ డీఈఓ కుమార్

ఆటోనగర్(విజయవాడతూర్పు): సెలవు దినాల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డెప్యూటీ డీఈఓ కేవీఎస్ కుమార్ హెచ్చరించారు. గురువారం బక్రీద్ పండుగ రోజున పటమటలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వస్తున్నారన్న సమాచారంతో విద్యార్థులను పంపించారు. ఉపాధ్యాయులను డెప్యూటీ డీఈఓ కుమార్ ప్రశ్నించారు. అకడమిక్ ఇయర్ ప్రారంభమై 20 రోజులు కాకముందే క్లాసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. మరలా ఇలాంటి సమస్య ఉత్పన్నమైయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సెలవుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలుకు పంపించడం నేరమన్నారు. సెలవుల్లో ప్రశాంతంగా ఇంటి వద్ద ఉండే విధంగా చూడాలన్నారు.

టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు ఎం.కృష్ణప్రభు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పట్టుదలతో నేర్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు ఎం.కృష్ణప్రభు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్, ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ 9వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కృష్ణప్రభు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కుటుంబాలు గడవాలంటే పురుషులతో పాటుగా మహిళలు కూడా ఆర్థిక సంపాదనలో భాగం పంచుకోక తప్పనిస్థితి ఏర్పడిందన్నారు. అనేక సమస్యలు ఉన్న వాటికి కుంగిపోకుండా అధికమించాలనే పట్టుదల ఉండాలన్నారు. కొత్త ఆలోచనలు చేసినప్పుడే అభివృద్ధి చెందగలమన్నారు. మహిళలు, ఆడపిల్లల అభివృద్ధికి రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ బి.రామ్మోహన రెడ్డి మాట్లాడుతూ టైలరింగ్ నేర్చుకుంటున్న వారు ఇంతటితో ఆగిపోకుండా నిరంతరం నైపుణ్యాన్ని పెంచుకునే కృషి చేయాలన్నారు. మారుతున్న ఫ్యాషన్స్‌కు అనుగుణంగా స్కిల్స్ పెరగాలన్నారు. మంచి నైపుణ్యం కలిగిన టైలర్స్‌గా అభివృద్ధి కావాలన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా శిక్షణా విభాగం బాధ్యులు విజయ, కార్యక్రమాల కమిటీ కన్వీనర్ యు.వి.రామరాజు, టైలరింగ్ టీచర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పాండురంగడి కల్యాణం




పాండురంగడి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్త గుళ్ళు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి శాంతి కల్యాణోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజాము నుంచి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం స్వామి వారి మూలమూర్తులకు పంచామృత తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫలపుష్పసుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అలాగే ఆలయంలో కొలువై ఉన్న సంతాన వేణుగోపాలస్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహాసంకల్పం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, మంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర ఘట్టాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవ విశిష్టతను అర్చకస్వాములు భక్తులకు వివరించారు. పండరీపురంలో జరిగే రీతిన నగరంలో కూడా స్వామి వారి కల్యాణోత్సవం, అర్చనలను నిర్వహించడం అపూర్వమని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయదాతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన సంప్రదాయ జీవన విధానంతో సంపూర్ణ ఆరోగ్యం



గన్నవరం: మానవ జీవన విధానంలో వస్తున్న మార్పులు, ఆహార, ఆధ్యాత్మిక విధానంలో ఆచరణ లోపించడం వల్ల తీవ్ర అనారోగ్య పరిణామాలను ఎదుర్కొంటున్నారని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవివర్మ అన్నారు. స్థానిక విమానాశ్రయం పక్కనే ఉన్న ఏబీ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం న్యాయవాది కలపాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత భక్తిశ్రద్దలతో ధన్వంతరి హోమం నిర్వహించారు. అనంతరం రవివర్మ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మానవులు మానసిక ఆనందాన్ని, ఆరోగ్యాన్ని కోల్పోయి జీవితాన్ని అగమ్యగోచరంగా చేసుకుంటున్నారని తెలిపారు. ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యంపై సరైన శ్రద్ధ వహించడం లేదన్నారు. ఫలితంగా క్యాన్సర్, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటివి సాధారణ వ్యాధులుగా మారిపోయాయని తెలిపారు. ఒకప్పుడు 120 ఏళ్లు ఉన్న మనిషి జీవిత కాలం ప్రస్తుతం 60 ఏళ్లకు పడిపోయిందన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే జీవన, ఆహార శైలిని పాటించాలని సూచించారు. అనంతరం సుమారు 1,500 మందికి ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, ఉప సర్పంచ్ పాలడుగు నాని, పుర ప్రముఖులు నెక్కలపూడి ఈశ్వరరావు, గన్నె వెంకట్రావు, అరవపల్లి రణధీర్, ప్రత్తిపాటి శ్రీనివాసరావు, ప్రసాద్, నిడమర్తి బుజ్జిరావు, నల్లమోతు రమేష్, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై మహిళలకు అవగాహన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 'నిర్భయ్ భారత్–సశక్తి నారీ' అనే అంశంపై విజయవాడ రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైల్వే హాస్పటల్ సీఎమ్ఎస్ డాక్టర్ ఎం.శౌరిబాల పాల్గొని మహిళ ఆరోగ్యం, పోషకాహారం, విద్య, బాలల హక్కులు, మహిళా హక్కులు, సాధికారిత అనే అంశాలపై మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబంతో పాటు సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. దైనందిన జీవితంలో మహిళలు రోజు తీసుకునే ఆహారంతో పాటు అదనంగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మహిళ ఆరోగ్యం, మహిళా హక్కులు, సాధికారతపై అవగాహ కల్పించేందుకు ఇప్పటికే హాస్పటల్ సిబ్బంది అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎమ్ఎస్ డాక్టర్ ఎమ్.జైదీప్, డాక్టర్ సీతారాం, సిబ్బంది పాల్గొన్నారు.

పేరంటాలమ్మను దర్శించుకున్న దేవదాయశాఖ అదనపు కమిషనర్



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మను గురువారం దేవదాయశాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి వీరిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆషాఢమాసం పురస్కరించుకుని అమ్మవార్లకు గ్రామస్తులు సారె సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

మెర్లిన్

మెరుపై మెరిసెన్

'కాల్ చాట్‌జీపీటీ వేరెవర్ యూ ఆర్' అంటూ రంగంలోకి దిగిన చాట్‌జీపీటీ యాప్ 'మెర్లిన్' మెరుపు వేగంతో విజయం సాధించింది. 'పవర్ ఆఫ్ చాట్‌జీపీటీ'ని యూజర్‌కు దగ్గర చేసి, టైమ్ సేవ్ చేసే 'మెర్లిన్' సృష్టికర్తలు ప్రత్యూష్ రాయ్, సిద్ధార్థ సక్సెనా, సిరిసేందు సర్కార్‌లు మూకుమ్మడిగా చెప్పే మాట... 'కొత్తగా ఆలోచించడం అనేది విజయానికి తొలి మెట్టు'



ప్రత్యూష్ రాయ్, సిద్ధార్థ సక్సెనా, సిరిసేందు సర్కార్

గ్లోబల్ కన్సల్టెన్సీ 'బీసీజీ'లో పనిచేస్తున్న సమయంలో ఎన్నో విలువైన అనుభవాలను మూటగట్టుకున్నాడు ప్రత్యూష్‌రాయ్. ఆ అనుభవాలను విశ్లేషించుకునే క్రమంలో తనకు కొత్తగా ఏదైనా చేయాలనిపించేది. ఐఐటీ–కాన్పూర్‌లో సివిల్ ఇంజనీరింగ్ చేసిన ప్రత్యూష్ రాయ్ తన ఇద్దరు స్నేహితులు సిద్ధార్థ సక్సెనా, సిరిసేందు సర్కార్‌లతో మాట్లాడాడు.

'కొత్తగా అనిపించే అర్థవంతమైన పని ఏదైనా చేద్దాం' అనుకున్నారు వాళ్లు.

అలా వారి మేధోమథనం నుంచి పుట్టిన అంకురమే...మెర్లిన్.

చాట్‌జీపీటీ యాప్ 'మెర్లిన్' మెరుపు వేగంతో విజయం సాధించింది. ప్రారంభమైన ఆరు నెలల్లోనే ఈ యాప్‌ను వందలాది మంది ఇన్‌స్టాల్ చేసుకున్నారు.

టెక్ కంపెనీ 'ఫోయర్'లో విలీనం అయిన తరువాత యూఎస్, తూర్పు ఆసియా, యూరప్‌లలో 'మెర్లిన్'కు మంచి మార్కెట్ ఏర్పడింది.

> 'హమ్మయ్య... సక్సెస్ అయ్యాం' అని సేద తీరడం లేదు 'ఫోయర్–మెర్లిన్' బృందం. ఇప్పుడు వారి దృష్టి సిబ్బందిని పెంచుకోవడం, మెర్లిన్‌లోకి రకరకాల సబ్ ఫీచర్స్‌ని తీసుకురావడంపై ఉంది.

'ఎలాంటి అయోమయాలకు, సంక్లిష్టతలకు తావు లేకుండా బ్రౌజర్‌లో భాగమయ్యే సింపుల్ ప్రొడక్ట్ ఇది. యూట్యూబ్, జీమెయిల్, ట్విట్టర్, లింక్డ్‌ఇన్... మొదలైన వాటికి సంబంధించి క్లిష్టమైన సమస్యల పరిష్కారం విషయంలో డైలీ యాక్టివ్ యూజర్‌లకు ఉపయోగపడుతుంది. మార్కెటర్స్, రిక్రూటర్స్‌కు ఒక వాక్యం ట్వీట్ నుంచి ఎన్నో పదాల ఇమెయిల్ వరకు ఎన్నో పనుల్లో టైమ్ వృథా కాకుండా చూస్తుంది. ఇది సింపుల్ క్రోమ్ ఎక్స్‌టెన్షన్. బటన్‌ను ఒక్కసారి క్లిక్ చేస్తే చాలు చాట్‌జీపీటీ మనల్ని వెదుక్కుంటూ వస్తుంది' అని 'మెర్లిన్' గురించి చెబుతున్నాడు ప్రత్యూష్ రాయ్.

యూట్యూబ్‌కు సంబంధించి 'మెర్లిన్'ను 'యూట్యూబ్ సమ్మరైజర్'గా ఉపయోగించుకుంటున్నారు యూజర్‌లు. ఒక యూట్యూబ్ వీడియోను పూర్తిగా చూడనవసరం లేకుండానే దానిలోని ముఖ్యమైన సెగ్మెంట్‌ల గురించి 'మెర్లిన్' చెబుతుంది.

పర్సనలైజ్‌డ్ ప్రాంప్ట్స్ విషయంలోనూ 'మెర్లిన్' ఉపయోగపడుతుంది. మన రైటింగ్ స్టైల్‌ను కాప్చర్ చేస్తుంది.

'నిజానికి మా దృష్టి డెవలపర్స్‌పై ఉండేది. అయితే మా ప్రొడక్ట్‌ను యూజర్‌లు ఆసక్తికరమైన పద్ధతుల్లో ఉపయోగించుకుంటున్నారు' అంటున్నాడు ప్రత్యూష్ రాయ్.

నేర్చుకున్న పాఠాలు ఎప్పుడూ వృథా పోవు.

'బీసీజీ'లో రాయ్ అనుభవంతో నేర్చుకున్న ఎన్నో పాఠాలు 'మెర్లిన్' ప్రయాణంలో ఉపయోగపడ్డాయి. రాయ్ మాటల్లో చెప్పాలంటే ఆ అనుభవ పాఠాలు తన ప్రపంచాన్నే మార్చేసి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాయి.

'మెర్లిన్ సక్సెస్‌కు కారణం దానిపై యూజర్‌లకు గురి కుదరడమే' అంటున్నాడు 'ఫోయర్–మెర్లిన్' ఫస్ట్ ఇన్వెస్టర్, బెటర్ క్యాపిటల్ సీయివో వైభవ్.

'హమ్మయ్య...సక్సెస్ అయ్యాం' అని సేద తీరడం లేదు 'ఫోయర్–మెర్లిన్' బృందం.

ఇప్పుడు వారి దృష్టి సిబ్బందిని పెంచుకోవడం, మెర్లిన్‌లోకి రకరకాల సబ్ ఫీచర్స్‌ని తీసుకురావడంపై ఉంది.

'మెర్లిన్' అనేది ఒక రకమైన డేగ. దానిలోని సునిశితమై దృష్టిని తమ 'మెర్లిన్'లోకి తీసుకురావాలనుకుంటోంది, ఫినిష్ ఎనీ టాస్క్ అని ధైర్యం ఇవ్వాలనుకుంటోంది బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఫోయర్–మెర్లిన్ బృందం.

● టెక్.. టాక్

నథింగ్ ఫోన్2 త్వరలో...



సైజ్: 6.7 అంగుళాలు ప్రొటెక్షన్: గొరిల్లా గ్లాస్
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
ఇంటర్నల్: 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్ 256జీబి 12 జీబి ర్యామ్
కలర్: వైట్, బ్లాక్

లెనోవా ట్యాబ్ ఎం9



డిస్‌ప్లే: 9.0 అంగుళాలు వోఎస్: ఆండ్రాయిడ్ 12
రిజల్యూషన్: 800×1340 పిక్సెల్స్ బరువు: 344 గ్రా. బ్యాటరీ సామర్థ్యం: 5100 ఎంఏహెచ్
ర్యామ్: 3జీబి ఇంటర్నల్ స్టోరేజ్: 32జీబి ● టచ్ స్క్రీన్
కలర్స్: ఫాస్ట్ బ్లూ, స్ట్రోమ్ బ్లూ

వుయ్ కూల్ ఎస్4 సెల్ఫీ స్టిక్



బ్రాండ్: వుయ్ కూల్ కలర్: బ్లాక్
మెటీరియల్: అల్యూమినియం
- సెల్ఫీ స్టిక్ విత్ రీఛార్జబుల్ ఎల్ఈడీ ఫిల్ లైట్
- ట్రైపాడ్ స్టాండ్
- 360 డిగ్రీ రోటేటబుల్ మౌంట్
- 3 కలర్ టెంపరేచర్ లైట్
- బరువు: 165 గ్రా.

టెలిగ్రామ్‌లో కొత్త ఫీచర్



వచ్చే నెలలో టెలిగ్రామ్ 'ఇన్‌స్టాగ్రామ్–స్టోరీస్'లాంటి ఫీచర్‌ని తీసుకురానుంది. ఈ స్టోరీస్ ఎక్కువ స్పేస్ తీసుకోకుండా స్క్రీన్ టాప్‌లో కనిపిస్తాయి. యాప్‌లోని వీడియో మెసేజ్ ఫీచర్స్‌లాగే ఫ్రంట్ అండ్ బ్యాక్ కెమెరాతో తీసిన ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేయవచ్చు. షేరింగ్‌కు సంబంధించి యూజర్‌లకు 'ఎవ్రీవన్' 'హోల్లీ కాంటాక్ట్స్' 'సెలెక్ట్ కాంటాక్ట్' ఆప్షన్‌లు ఉంటాయి.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



డాబ్ హ్యాండ్

ఒక వ్యక్తి నైపుణ్యానికి సంబంధించి చెప్పే సందర్భంలో వాడే మాట.

ఉదా: శారద ఈజ్ ఏ డాబ్ హ్యాండ్ ఎట్ కుకింగ్

పాస్ట్ ది బాటన్

ముఖ్యమైన బాధ్యతను ఇతరులకు అప్పగించడం, ఉద్యోగ బదిలీ... మొదలైన సందర్భాల్లో వాడే మాట ఇది.

ఉదా: ది గవర్నర్ ఆఫ్ ది 'బ్యాంక్ ఆఫ్ అమెరికా' రిజైన్స్ దిస్ మంత్. పాసింగ్ ఆన్ ది బాటన్ టు వన్ ఆఫ్ హిజ్ క్లోజెస్ట్ అసోసియేట్స్.

● ఆర్ట్ అండ్ కల్చర్

శ్రేయరాగ రాక్‌స్టార్



శ్రేయా లెంక

ఎక్కడి ఒడిశా? ఎక్కడి కొరియా? అయితే కలలు కనేవారికి దూరభారాలు ఉండవు. పట్టుదలతో దూరాలను కరిగించేస్తారు. కలలను నిజం చేసుకుంటారు. ఒడిశాలోని రూర్కెలాకు చెందిన శ్రేయా లెంక ఈ కోవకు చెందిన ప్రతిభాశాలి....

ఇండియా ఫస్ట్ కె–పాప్ ఐడల్‌గా శ్రేయా లెంక చరిత్ర సృష్టించింది. పన్నెండు సంవత్సరాల వయసులో డ్యాన్సర్‌గా శ్రేయ కళా ప్రస్థానం మొదలైంది. ఎప్పుడూ పెద్ద కలలే కనేది. ఒక ఫ్రెండ్ ద్వారా శ్రేయకు 'కె–పాప్' పరిచయం అయింది. వారి మ్యూజిక్ వీడియోలు తనను బాగా ఆకట్టుకున్నాయి. 'వీళ్ల ఆర్టిస్టులా? మెరుపు తీగలా?' అనిపించింది.

వారి యూనిక్ స్టైల్, సింగింగ్, డ్యాన్సింగ్ తనకు తెగ నచ్చేశాయి. ఏదో ఒకరోజు వారిలో కలిసి, వారిలో ఒకరిగా కలిసి పనిచేయాలనుకుంది. 'అది అసాధ్యం' అని ఎవరు అన్నా సరే శ్రేయ వెనక్కి తగ్గలేదు.

ఆమె కల నెరవేరడానికి ఎంతో కాలం పట్టలేదు. ప్రపంచంలోని వందలాది మందితో పోటీ పడి గెలిచింది. 'కె–పాప్' మెంబర్‌గా తన కలను నెరవేర్చుకుంది. దేశం కాని దేశం... సౌత్ కొరియాలోకి అడుగు పెట్టినప్పుడు శ్రేయా లెంకాకు అక్కడి ఆహారం, జీవనవిధానం, భాష...అన్నీ కొత్తగా అనిపించాయి. తాను ఇల్లు విడిచి అంత దూరం వెళ్లడం అదే తొలిసారి.

కొత్త విషయాలను ఉత్సాహంగా నేర్చుకుంది. కొత్త జీవనవిధానానికి ఆనందంగా అలవాటు పడింది. చుట్టు పక్కల వాళ్లు కూడా ఎంతో ప్రోత్సాహకంగా ఉండేవాళ్లు. ఇండియాలో అయితే రాత్రి పదిలోపు భోజనం చేసేది. కొరియాలో మాత్రం సాయంత్రం 6–7 మధ్య భోజనం చేస్తారు. మొదట్లో కష్టం అనిపించినా ఆ పద్ధతికి మెల్లగా అలవాటు పడింది.

తనలాగే 'కె–పాప్ ఐడల్' కావాలనుకునే ఔత్సాహికులకు శ్రేయా లెంకా ఇచ్చే సలహా...

'మీ కలలను నెరవేర్చుకోవడం విషయంలో రాజీ పడవద్దు. వందసార్లు అపజయం పాలైనా సరే, ఆవగింజంత ఆత్మవిశ్వాసం కూడా కోల్పోవద్దు. ఆత్మవిశ్వాసం ఉన్న వాళ్లు తప్పకుండా ఒక రోజు గెలుస్తారు'

ఎక్కడ? నువ్వెక్కడ?



● గేమింగ్

సర్వైవల్ హారర్ వీడియోగేమ్ 'గిల్ట్' జూలై 6న రీరిలీజ్ అవుతోంది. 2019లో వచ్చిన 'గిల్ట్'కి విమర్శకుల నుంచి భిన్నమైన స్పందన లభించింది. 'ఎంజాయ్ చేయవచ్చు. గ్రాఫిక్స్ బాగున్నాయి. అయితే ఎగ్జయిట్‌మెంట్ లోపించింది' అనే మాట వినిపించింది. సాలీ అనే అమ్మాయి ఈ గేమ్‌లో కథానాయిక. స్కూల్ తప్ప మరో ప్రపంచం తెలియని సాలీ తప్పిపోయిన తన కజిన్ ఎమిలీ జాడ కనిపెట్టడానికి ఎన్నో ప్రమాదకరమైన ప్రదేశాలకు వెళుతుంది. ఎన్నో గందరగోళ పరిస్థితులను ఛేదిస్తూ సాహసాలు చేస్తుంది. ఈ సర్వైవల్ హారర్ గేమ్‌లో ఫ్లాష్‌లైటే ప్రధాన ఆయుధం. 'షేప్ యువర్ ఫీయర్స్–ఫీయర్ ది షేప్స్' అంటోంది గేమ్ ట్రైలర్.

మోడ్: సింగిల్–ప్లేయర్ జానర్స్: అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్, పజిల్ వీడియో గేమ్
ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, ప్లేస్టేషన్ 4, గూగుల్ స్టాడియ, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సినిమా



ఎన్టీఆర్ • రామ్ చరణ్ • మణిరత్నం • కీరవాణి • చంద్రబోస్ • సెంథిల్ • సాబు సిరిల్ • కరణ్ జోహార్ • షౌనక్ సేన్

క్లాస్ ఆఫ్ 2023

● ఆస్కార్ సభ్యులుగా 'ఆర్‌ఆర్‌ఆర్' నుంచి ఆరుగురు

ప్రతి ఏడాది ఆస్కార్ సభ్యత్వ నమోదు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆస్కార్ అవార్డు విజేతల నిర్ణయానికి ఈ సభ్యుల ఓటింగ్ కీలకంగా నిలుస్తుంది. 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 14న జరగనుంది. కాగా 'క్లాస్ ఆఫ్ 2023'లో భాగంగా 398 మంది కొత్త సభ్యులకు ఆస్కార్ సభ్యత్వ ఆహ్వానాన్ని పంపినట్లు ఆస్కార్ కమిటీ సీఈవో బిల్ క్రామెర్, అధ్యక్షుడు జానెట్ యాంగ్ వెల్లడించారు. ఈ జాబితాలో మన దేశం నుంచి దాదాపు 15 మందికి ఆహ్వానం అందడం విశేషం. తెలుగు నుంచి 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌లో ఆరుగురు, తమిళం నుంచి మణిరత్నం, బాలీవుడ్ నుంచి దర్శక–నిర్మాత కరణ్ జోహార్ వంటివారు ఉన్నారు. వృత్తిపరమైన అర్హతలు, ప్రపంచవ్యాప్త గుర్తింపు వంటి అంశాల ఆధారంగా ఈ 'క్లాస్ ఆఫ్ 2023' జాబితాను తయారు చేసినట్లు అకాడమీ పేర్కొంది. ఈ 398 మందిలో 51 దేశాలకు చెందినవారు ఉండగా, వీరిలో 40 శాతం మంది మహిళలు, 52 శాతం మంది యూఎస్‌కు చెందినవారు ఉన్నట్లుగా ఆస్కార్ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఇక ఈ కొత్త సభ్యులతో కలిసి ఆస్కార్ మెంబర్‌షిప్‌లు కలిగి ఉన్న వారి సంఖ్య 10, 817కు చేరినట్లు హాలీవుడ్ అంటోంది.

ఆర్‌ఆర్‌ఆర్ నుంచి ...

'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు' పాటకుగాను 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఆస్కార్ అవార్డు అందుకున్న మ్యూజిక్ డైరెక్టర్ యంయం కీరవాణి, పాట రచయిత చంద్రబోస్‌లకు అకాడమీ ఆహ్వానాలు అందాయి. అలాగే ఈ చిత్రం హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్‌లు కూడా ఆస్కార్ అకాడమీ సభ్యులు కానున్నారు. దర్శకులు మణిరత్నం, షౌనక్ సేన్ (95వ ఆస్కార్ అవార్డ్స్‌లో డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇండియా తరఫున నామినేట్ అయిన 'ఆల్ దట్ బ్రీత్స్' దర్శకుడు), నిర్మాతలు కరణ్ జోహార్, సిద్ధార్థ్ రాయ్ కపూర్ (95వ ఆస్కార్ అవార్డ్స్‌లో బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇండియా తరఫున అఫీషియల్ ఎంట్రీగా పంపబడిన గుజరాతీ ఫిల్మ్ 'ది చెల్లో షో' నిర్మాత), చైతన్య తమ్హానే (మరాఠీ), ప్రొడక్షన్ అండ్ టెక్నాలజీకి చెందిన గిరీష్ బాలకృష్ణన్, క్రాంతి శర్మ, విజువల్ ఎఫెక్ట్స్ ఆర్టిస్టులు హరేష్ హింగోరాణి, పీసీ సనత్, ఫిల్మ్ ఎగ్జిక్యూటివ్‌లు శివానీ రావత్, శివానీ పాండ్యా మల్హోత్రా వంటి వారు ఉన్నారు.

కొత్త రూల్

ఓ సినిమాను ఆస్కార్ ఎంట్రీకి పంపాలంటే కొన్ని నియమ, నిబంధనలు ఉన్నాయి. యూఎస్‌లోని ఆరు ప్రధాన నగరాల్లో (న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, చికాగో, మియామి, అట్లాంటా, శాన్ ఫ్రాన్సిస్కో) ఆ సినిమా కనీసం ఏడు రోజులు ప్రదర్శితం కావాలి. వీటిలో ఒక షో సాయంత్రం ప్రైమ్ టైమ్‌లో ఉండాలి, థియేటర్స్‌లో కనీస సీటింగ్ సామర్థ్యం ఉండాలి. తాజాగా బెస్ట్ పిక్చర్, ఫారిన్ బెస్ట్ ఫిల్మ్ విభాగాలకు సంబంధించి కొత్త రూల్ పెట్టనున్నారట. ఇకపై ఆస్కార్‌కు ఓ సినిమాను పంపాలంటే యూఎస్‌లోని పాతికకు పైగా మూవీ మార్కెట్స్ ఉన్నచోట సినిమాలు ప్రదర్శించబడాలట. అది కూడా రెండువారాలకు పైగా. అయితే ఇది ఖర్చుతో కూడుకున్న పని అని కొందరు పెదవి విరుస్తున్నారు. ఈ కొత్త రూల్‌ను 97వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవం (2025) నుంచి అమలులోకి తేవాలని అవార్డ్ కమిటీ ప్లాన్ చేస్తోందన్నది హాలీవుడ్ టాక్.

గర్వంగా ఉంది - రాజమౌళి

''ఆస్కార్ అకాడమీ సభ్యత్వ నమోదు కోసం 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ నుంచి ఆరుగురికి ఇన్విటేషన్స్ రావడం గర్వంగా ఉంది. వీరితో పాటు భారత దేశం తరఫున ఆస్కార్ ఆహ్వానం అందుకున్నవారికి కూడా నా శుభాకాంక్షలు'' అని ట్వీట్ చేశారు రాజమౌళి.

ఆ నలుగురికీ గౌరవం



ఏంజెలా • కరోల్ • మెల్ బ్రూక్స్ • మిచెల్ సాటర్

''ఈ నలుగురూ చలన చిత్రపరిశ్రమలో మంచి మార్పుకు నాంది అయ్యారు. తర్వాతి తరం ఫిల్మ్ మేకర్స్‌కి, ఫ్యాన్స్‌కి స్ఫూర్తిగా నిలిచారు. వీరిని సత్కరించడం 'బోర్డ్ ఆఫ్ గవర్నర్స్'కి థ్రిల్‌గా ఉంది'' అని ఆస్కార్ అకాడమీ అవార్డ్ అధ్యక్షుడు జానెట్ యాంగ్ అన్నారు. సినిమా రంగానికి విశిష్ట సేవలందించిన ప్రముఖులకు 'గవర్నర్ అవార్డ్స్'లో భాగంగా హానరరీ ఆస్కార్ అవార్డ్‌ను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఈ గౌరవ ఆస్కార్‌ను అందుకోనున్న నలుగురిలో ముగ్గురు మహిళలు ఉండటం విశేషం. నటి ఏంజెలా బాసెట్, రచయిత–దర్శకుడు–నటుడు–గేయ రచయిత మెల్ బ్రూక్స్, ఫిల్మ్ ఎడిటర్ కరోల్ లిటిల్టన్‌లతో పాటు సన్‌డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మిచెల్ సాటర్‌లకు అవార్డును అందజేయనున్నారు. నవంబర్ 18న లాస్ ఏంజెల్స్‌లోని ఫెయిర్‌మాంట్ సెంచరీ ప్లాజాలో జరిగే వేడుకలో ఈ నలుగురూ గౌరవ పురస్కారాలు అందుకుంటారు.

వినాయక చవితికి...



లారెన్స్

'చంద్రముఖి' (2005) లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన డైరెక్టర్ పి.వాసు 18 ఏళ్ల తర్వాత ఆ సినిమాకి సీక్వెల్‌గా తెరకెక్కించిన చిత్రం 'చంద్రముఖి 2'. తొలి భాగంలో రజనీకాంత్ చేసిన పాత్రను సీక్వెల్‌లో రాఘవా లారెన్స్ చేయగా, కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించారు. సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమాని వినాయక చవితికి విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. సుభాస్కరన్ మాట్లాడుతూ– ''ఈ సీక్వెల్‌ని భారీ బడ్జెట్‌తో నిర్మించాం. ప్రేక్షకుల అంచనాలను మించేలా ఉంటుంది'' అన్నారు.

త్వరలో శ్రీరంగనీతులు



సుహాస్, కార్తీక్, రుహాని

సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ ప్రధాన పాత్రల్లో విరాజ్ అశ్విన్, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'శ్రీరంగనీతులు'. వీఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. న్యూ ఏజ్ కామెడీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ షురూ



పాయల్ గుప్తా, నరేశ్, బి.గోపాల్

దివంగత నటుడు జయప్రకాష్ రెడ్డి కూమార్తె మల్లికా రెడ్డి నిర్మాతగా మారారు. శ్రీ జయప్రకాష్ రెడ్డి ప్రొడక్షన్స్‌పై ఆమె నిర్మిస్తున్న కొత్త చిత్రం షురూ అయింది. నరేశ్ వనపర్తి హీరోగా, పాయల్ గుప్తా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మల్లికార్జున్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత బెక్కం వేణుగోపాల్ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ బి.గోపాల్ క్లాప్ కొట్టగా, దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించారు. ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు అవినాష్ కొకటి. ''నాన్నగారి (జేపీ) ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్మాణంలోకి వచ్చాను'' అన్నారు మల్లికా రెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: శివ.

ట్రైలర్ ఆసక్తిగా ఉంది - డైరెక్టర్ హరీష్ శంకర్



హరీష్ శంకర్, చైతు, రవిశంకర్

''7:11 పీఎం' ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సౌండ్, విజువల్స్, వీఎఫ్ఎక్స్ అద్భుతంగా ఉన్నాయి'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ అన్నారు. సాహస్, దీపిక జంటగా చైతు మాదాల దర్శకత్వం వహించిన చిత్రం '7:11 పీఎం'. నరేశ్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. చైతు మాదాల మాట్లాడుతూ–'' ఒక టౌన్, రెండు గ్రహాలు, మూడు కాలాలు.. ఇదీ మా సినిమా లైన్. వీటిని ఎలా కనెక్ట్ చేశామనేది ఆసక్తిగా ఉంటుంది. మా సినిమాని విడుదల చేస్తున్న రవిశంకర్, నవీన్‌గార్లకు థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు వై. రవిశంకర్.

పల్లెటూరి వినోదం



ఆసిఫ్ జానీ, నక్కిన త్రినాథరావు, శ్రీరామ్

తెలంగాణ నేపథ్యంలో రూపొందిన పల్లె కథా చిత్రం 'తురుమ్ ఖాన్‌లు'. శివ కల్యాణ్ దర్శకత్వంలో ఎండీ ఆసిఫ్ జానీ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలోని 'రంగు రంగుల చిలక...' అంటూ సాగే తొలి పాటను దర్శకుడు త్రినాథరావు నక్కిన విడుదల చేశారు. ''పల్లెటూరి పగ, ప్రతీకారాలతో వినోదాత్మకంగా, మహబూబ్ నగర్ స్లాంగ్‌లో రూపొందిన చిత్రం ఇది'' అని యూనిట్ తెలిపింది. నిమ్మల శ్రీరామ్, దేవరాజ్ పాలమూర్, అవినాష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, అఖిలేష్ గోగు, రియాన్.

తెలంగాణ ఉద్యమ కెరటాలు



చందు, హాసిని

చందు రాగం, హాసిని, ప్రీతి సుందర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఉద్యమ కెరటాలు'. పిడమర్తి రవీంద్ర స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ''ఈ తరానికి తెలంగాణ ఉద్యమ పోరాటాన్ని తెలియజేయడానికి ఈ చిత్రాన్ని తీస్తున్నాం'' అన్నారు రవీంద్ర. ఈ చిత్రానికి బోలె షావలి స్వరకర్త.

బాధ్యులెవరంటూ బండ అబద్ధాలు..!

నిపుణుల కమిటీ నివేదిక రాకముందే రామోజీ సొంత రిపోర్టు రెడీ

పోలవరం గైడ్ బండ్ కుంగడానికి బాధ్యులను తేల్చమని జల్ శక్తి శాఖ మంత్రి మీ చెవిలో చెప్పారా?

- 4 నెలల్లోనే నిర్మించాలన్నది తొలి ప్రణాళికని మీకు మీరే తీర్మానించేస్తారా?
- ఆలస్యం జరిగిందెక్కడ? వరదల్లోనూ కట్టాలన్న నిపుణుడెవరు?
- డిజైన్, నిర్మాణ పరమైన వైఫల్యాలతో కుంగిందనడం విష ప్రాత్రికేయం కాదా?



సాక్షి, అమరావతి: పోలవరంలో గైడ్ బండ్ జారడానికి దారితీసిన కారణాలను తేల్చేందుకు సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏబీ పాండ్య నేతృత్వంలో కేంద్ర జల్ శక్తి శాఖ నియమించిన నిజ నిర్ధారణ కమిటీ అసలు ఇప్పటిదాకా నివేదిక ఇవ్వలేదు. క్షేత్రస్థాయిలో గైడ్ బండ్‌ను పరిశీలించిన అనంతరం కారణాలను గుర్తించేందుకు మరికొన్ని పరీక్షలు అవసరమని కమిటీ పేర్కొంది. ఈ క్రమంలో గైడ్ బండ్‌కు తాత్కాలిక మరమ్మతులు, శాశ్వతంగా పటిష్టం చేయడంపై జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన ఢిల్లీలో సమావేశం జరిగింది. జల్ శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు, రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, పోలవరం సీఈ సుధాకర్‌బాబు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈలోగానే గైడ్ బండ్ కుంగడానికి బాధ్యులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని జల్ శక్తి శాఖ ఆదేశించినట్లు ఈనాడు రామోజీ అచ్చేశారు. ఆ విషయాన్ని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి ఆయన చెవిలో చెప్పారా? లేదంటే ఆ సమావేశంలో ఎక్కడైనా బల్ల కింద నక్కి విన్నారా? బాధ్యతా రాహిత్యంగా కథనాలను ప్రచురించారు.

ఈనాడు ఆరోపణ: గైడ్ బండ్‌ను 4 నెలల్లోనే పూర్తి చేయాలనేది తొలి ప్రణాళిక. అలాంటిది ఏడాదికి పైగా పట్టింది. ఇలా ఆలస్యం కావడం వల్లే నిర్మాణ ప్రదేశంలో మార్పులు జరిగి గైడ్ బండ్, రిటైనింగ్ వాల్ దెబ్బతిన్నాయి.

వాస్తవం: గోదావరి సహజ మార్గాన్ని స్పిల్‌వే మీదుగా మళ్లించడానికి వీలుగా స్పిల్‌వే ఎడమ వైపు స్ప్యూబండ్ నిర్మించాలని సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ తొలుత ప్రతిపాదించాయి. సీడబ్ల్యూపీఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్)లో నిర్వహించిన అధ్యయనంలో స్ప్యూబండ్ నిర్మిస్తే స్పిల్‌వేకు ఎడమ వైపున వరద ఉధృతి సెకనుకు 13.6 మీటర్లకు పెరిగి సుడిగుండాలకు దారి తీస్తుందని తేలింది. దీనిపై 2019 మార్చి 26న నిర్వహించిన డీడీఆర్పీ 12వ సమావేశంలో స్ప్యూబండ్ స్థానంలో గైడ్ బండ్ నిర్మించాలనే అభిప్రాయం వ్యక్తమైంది. అప్రోచ్ చానల్‌కు సమాంతరంగా 500 మీటర్ల పొడవున గైడ్ బండ్ నిర్మిస్తే వరద ఉధృతి సెకనుకు 3 నుంచి 6.5 మీటర్లకు తగ్గుతుందని 2021 మార్చి 23న జరిగిన డీడీఆర్పీ 17వ సమావేశంలో సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదించింది. ఆ మేరకు గైడ్ బండ్ డిజైన్ రూపొందించాలని డీడీఆర్పీ ఆదేశించింది. దీంతో 2021 మార్చిలో గైడ్‌బండ్ నిర్మించే ప్రాంతంలో ఎనిమిది చోట్ల ఈసీపీటీ(ఎలక్ట్రో కోన్ పినట్రేషన్ టెస్ట్) నిర్వహించారు. అదే ఏడాది ఏప్రిల్ 12న రిటైనింగ్ వాల్, మే 15న స్టోన్ కాలమ్స్‌తో గైడ్ బండ్ డిజైన్లను సీడబ్ల్యూసీకి రాష్ట్ర జల వనరుల శాఖ సమర్పించింది. రిటైనింగ్ వాల్ డిజైన్‌ను 2021 ఏప్రిల్ 30, స్టోన్ కాలమ్స్‌తో కూడిన గైడ్ బండ్ డిజైన్‌ను 2021, మే 24న సీడబ్ల్యూసీ ఆమోదించింది. గైడ్ బండ్‌లో మొత్తం 13,762 స్టోన్ కాలమ్స్‌కుగానూ 8,388 కాలమ్స్‌ను 2021 మే 25 నుంచి జూన్‌లోపే కాంట్రాక్టు సంస్థ పూర్తి చేసింది. రిటైనింగ్ వాల్‌లో మొత్తం 105 ప్యానళ్లకుగానూ 35 ప్యానళ్లను 2021 మే నెలలో పూర్తి చేసింది. జూలైలో వరదలు వచ్చాయి. వరదలు తగ్గాక 2021 డిసెంబర్‌లో మళ్లీ పనులను ప్రారంభించింది. 2022 మార్చికి రిటైనింగ్ వాల్, ఏప్రిల్‌కు స్టోన్ కాలమ్స్‌ను పూర్తి చేసింది. గైడ్ బండ్ పనులను 2022 ఏప్రిల్ 12న ప్రారంభించింది. వరదలు వచ్చేలోగా గైడ్ బండ్‌ను +35 మీటర్ల ఎత్తుకు పూర్తి చేయాలని 2022 జనవరిలో పీపీఏ నిర్దేశించింది. ఆ ప్రకారం +34 మీటర్ల ఎత్తు వరకూ గైడ్ బండ్‌ను పూర్తి చేశారు. గతేడాది ఎన్నడూ లేని విధంగా జూలై 10న గోదావరికి లక్ష క్యూసెక్కుల వరద వచ్చింది. జూలై 17 నాటికి అది 25 లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో పీపీఏ నిర్దేశించిన విధంగా వరద తగ్గాక మిగిలిన కొద్దిపాటి పనిని చేపట్టి ఈ ఏడాది ఏప్రిల్‌కు పూర్తి గైడ్ బండ్ +51.32 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసింది.

ఈనాడు ఆరోపణ: గైడ్ బండ్ కుంగడానికి డిజైన్ పరంగా, నిర్మాణపరంగా వైఫల్యం.

వాస్తవం: జాతీయ ప్రాజెక్టు పోలవరం పనులపై కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన పీపీఏ, సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ, సీఎస్ఆర్ఎంఎస్, వ్యాప్కోస్, జీఎస్ఐ అజమాయిషీ ఉంటుంది. నిపుణుల పర్యవేక్షణలో నిర్మాణంలో లోపాలకు అవకాశమే ఉండదు. నాణ్యత పరీక్షలు నిర్వహించి ధ్రువీకరించాకే పనులు చేస్తారు.

నిపుణులంటూ ఊహాగానాలా..

ఇప్పుడు చెప్పండి రామోజీ.. పనుల్లో ఎక్కడ జాప్యం జరిగింది? గైడ్ బండ్‌ను 4 నెలల్లోనే నిర్మించాలన్నది తొలి ప్రణాళికని మీకు మీరే ఊహించుకున్నారా? నిర్మాణంలో జాప్యం వల్లే గైడ్ బండ్, రిటైనింగ్ వాల్ దెబ్బ తిన్నట్లు ప్రాథమికంగా తేల్చిన నిపుణుడు మీరేనా? వరద తగ్గాక అప్రోచ్ చానల్ గైడ్ బండ్ వద్ద మట్టి తవ్వకం పనులు చేస్తున్నప్పుడు రిటైనింగ్ వాల్ 144 మీటర్ వద్ద వంగినట్లు, గైడ్ బండ్ 51.32 మీటర్ల నుంచి జారినట్లు జూన్ 3న అధికారులు గమనించారు. ఆ వెంటనే సీడబ్ల్యూసీకి తెలిపారు. దీనిపై జూన్ 5న సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాక గైడ్ బండ్ జారలేదు.

గైడ్ బండ్ అంటే..

నీటి ప్రవాహానికి మార్గ నిర్దేశం చేయడానికి ప్రత్యేకంగా నిర్మించే వంతెనలాంటి కట్టడాన్ని గైడ్ బండ్ అంటారు. పోలవరం ప్రతిపాదిత ప్రాజెక్టు వద్ద ఉన్న భౌగోళిక పరిస్థితుల రీత్యా గోదావరి సహజ ప్రవాహాన్ని అప్రోచ్ చానల్ ద్వారా మళ్లించి స్పిల్ వే నిర్మించారు. తద్వారా స్పిల్ వే ఎడమ వైపున వరద ఉధృతి ఎక్కువగా ఉంటుందని, దీంతో సుడిగుండాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందని గుర్తించారు. స్పిల్ వే కు కూడా కొంత ఇబ్బంది ఉంటుందని భావించారు. ఆ సమయంలో నీటి వేగాన్ని తగ్గించి, సుడిగుండాల నివారణ కు రాళ్ల, మట్టితో స్పిల్ వే కు ఎగువన ఎడమ వైపున గైడ్ బండ్‌ను నిర్మించారు. ఒక్క మాటలో చెప్పాలంటే స్పిల్ వే పొడవునా నీటి ప్రవాహ వేగం ఒకేలా ఉండేందుకే దీనిని నిర్మించారు.

నేరం చేయాలంటేనే భయపడేలా చర్యలు

డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేరాలు చేయాలంటేనే భయపడేలా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాధాన్యత కేసుల్లో వీలైనంత త్వరగా కోర్టుల్లో చార్జ్‌షీట్‌లు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆయన అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీని సందర్శించారు. శిక్షణ పొందుతున్న ట్రైనీ డీఎస్పీలతో మాట్లాడారు. నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. లోన్ యాప్‌లతో ప్రజలు మోసపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. మహిళల మొబైల్ ఫోన్లలో సుమారు 1.22 కోట్లు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించామని వివరించారు. రాష్ట్రంలో రౌడీల కార్యకలాపాలను పూర్తిగా నియంత్రించామన్నారు.

నెల్లూరు టీడీపీ ఇన్‌చార్జిగా నారాయణ

పలు నియామకాలు ప్రకటించిన అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: నెల్లూరు సిటీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ మంత్రి పొంగూరు నారాయణను నియమిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు గురువారం రాత్రి ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు నారాయణను నియమిస్తున్నట్టు అచ్చెన్నాయుడు ప్రకటించడం గమనార్హం. దీంతోపాటు పార్టీకి సంబంధించి పలు నియామకాలు చేసినట్టు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కర్నూలు లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్షుడిగా బీటీ నాయుడు, నంద్యాల లోక్‌సభ నియోకవర్గం అధ్యక్షుడిగా మల్లెల రాజశేఖర్‌గౌడ్‌లను నియమించారు. పార్టీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా వి.మాధవనాయుడు, సెంట్రల్ కమిటీ సెక్రటరీగా కాసాని వీరేశ్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా సరిపెల్ల రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బచ్చుల సుబ్రమణ్యం, కె.సుధాకర్ (గుంటూరు తూర్పు), గాజుల అదెన్న (అనంతపురం అర్బన్), రాష్ట్ర కార్యదర్శులుగా దొండపనేని రాజనాయుడు (నెల్లూరు రూరల్), ఒమ్మి సన్యాసిరావు (విశాఖ తూర్పు), బొబ్బూరి వెంగళరావు (ఉదయగిరి), కురుబ శివబాల (అనంతపురం అర్బన్), గంపా కృష్ణా(ఎస్.కోట), దంపూరి భాస్కర్ యాదవ్ (తిరుపతి)లను నియమించినట్టు అచ్చెన్నాయుడు తెలిపారు.

ఎవరేం చేశారో తేల్చుకుందాం

- మేనిఫెస్టో హామీలపై చర్చకు సిద్ధమా?: మంత్రి జోగి రమేశ్
- కుప్పం, టెక్కలి.. ఎక్కడైనా సరే మేం రెడీ అచ్చెన్నా
- టైమ్, ప్లేస్ మీరే చెప్పండి.. తప్పించుకోవద్దు
- ఒక గ్రామాన్ని మీరే ఎంచుకోండి.. కాదంటే అసెంబ్లీకి రండి
- స్వాతిముత్యాన్ని కూడా వెంటబెట్టుకుని సభకు రావాలి

సాక్షి, అమరావతి: గతంలో పార్టీ లేదు.. బొక్కా లేదని వ్యాఖ్యానించిన ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఓ పత్రాన్ని విడుదల చేసి అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ మండిపడ్డారు. మేనిఫెస్టో హామీలపై చర్చించేందుకు తాము సిద్ధమని చంద్రబాబు, అచ్చెన్నాయుడుకు మంత్రి రమేష్ సవాల్ విసిరారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఒక గ్రామానికి వెళదాం..

'టైమ్, ప్లేస్ మీరే చెప్పండి.. తప్పించుకోవద్దు.. కుప్పం, టెక్కలి.. ఎక్కడైనా సరే.. ఎప్పుడైనా సరే..! ఓ గ్రామాన్ని మీరే ఎంచుకోండి. చంద్రబాబు హయాంలో ఏం జరిగింది? ముఖ్యమంత్రి జగన్ ఏం చేశారు? అనే అంశాలపై పూర్తిగా చర్చిద్దాం. ఒక గ్రామాన్ని కొలమానంగా తీసుకుని



ఎవరి పాలనలో మేలు జరిగిందో చూద్దాం. గ్రామంలో టీడీపీ హయాంలోఅక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలను పరిశీలించి చంద్రబాబు ఏమిచ్చారో చూద్దాం. 2019 నుంచి ఇప్పటి వరకూ సీఎం జగన్ ఏమిచ్చారో కూడా చూద్దాం. ఒకవేళ బయట ప్రజల మధ్య వద్దనుకుంటే అసెంబ్లీకి రావాలి. అచ్చెన్నాయుడు స్వాతిముత్యాన్ని (చంద్రబాబును) కూడా వెంటబెట్టుకుని అసెంబ్లీకి రావాలి. చీము, నెత్తురు, దమ్ము, ధైర్యం ఉంటే మడమ తిప్పకుండా చర్చకు సిద్ధం కావాలి. నా సవాల్‌పై స్పందించాలని చంద్రబాబు, అచ్చెన్నను పాత్రికేయ మిత్రుల ద్వారా కోరుతున్నా.

మోసగించిన చరిత్ర మీదే బాబూ

టీడీపీ మేనిఫెస్టోలో ఏముందో అచ్చెన్నాయుడుకి తెలియదు. టీడీపీ వెబ్‌సైట్ నుంచే తొలగించారు. విలువలు, విశ్వసనీయత లేని టీడీపీ నేతలకు మేనిఫెస్టో గురించి మాట్లాడే అర్హతే లేదు. రుణ మాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళలను మోసగించిన టీడీపీ నేతలకు మా మేనిఫెస్టో గురించి మాట్లాడేందుకు సిగ్గుండాలి. అచ్చెన్నాయుడు ఒళ్లు పెంచడం కాకుండా బుర్ర పెంచుకోవాలి. నాలుగేళ్లలో 99 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనే. గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? ధైర్యంగా అడుగుతున్న ప్రభుత్వం మాది. చరిత్ర పుటల్లో ఏ ఎమ్మెల్యే ఇలా వెళ్లిన దాఖలాల్లే. అర్హులు మిగిలిపోతే వారికీ సీఎం జగన్ ప్రయోజనం చేకూరుస్తున్నారు.

పవన్ - బాబు 'చలో హైదరాబాద్'

- స్థిరత్వం లేని పవన్ రాజకీయాలకు తగడు: మంత్రి అంబటి
- వారాహిని వాహనంగా చేసుకుంటే అనర్థాలు తప్పవు
- పెళ్లి, విడాకులు, గుండు.. అన్నిటికీ పవన్ దగ్గర కథలు రెడీ



సత్తెనపల్లి: హలో ఏపీ .. నా జనసేన పార్టీని అమ్మేశానంటూ పవన్ కళ్యాణ్ వారాహిపై ఊగిపోతున్నాడని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. స్థిరత్వం లేని పవన్ రాజకీయాలకు పనికిరాడని, ఆయన గళం గరళమని ధ్వజమెత్తారు. ఎన్నికల అనంతరం పవన్-చంద్రబాబు చలో హైదరాబాద్ అనక తప్పదన్నారు. సత్తెనపల్లిలో గురువారం మీడియాతో మాట్లాడారు.

కథలు.. కథలు

వారాహి అంటే శక్తివంతమైన అమ్మవారు. వారాహిని వాహనంగా చేసుకోవటం తప్పు. వారాహిని వాహనంగా చేసుకుని ప్రయాణిస్తే చాలా అనర్థాలకు దారి తీస్తుందని స్పష్టంగా చెప్పా. రాజకీయ భవిష్యత్తు కూడా ఉండదని చెప్పా. పవన్ కళ్యాణ్ చెప్పు చూపించడానికి ఓ కథ, గుండు కొట్టించుకోవడానికి ఓ కథ, చంద్రబాబును కలవడానికి ఓ కథ, పెళ్లికి ఓ కథ, విడాకులకు ఓ కథ.. అన్నిటికీ కలిపి మరో కథ చెబుతారు. టీడీపీ, జగన్ పోవాలంటున్న పవన్ కళ్యాణ్‌కు ఎవరు రావాలో క్లారిటీ లేదు. సీఎం జగనే మళ్లీ వచ్చి సంక్షేమం కొనసాగించాలని ప్రజలంతా కోరుకుంటున్నారు.

నవయుగకు కాంట్రాక్టు పోయిందనే..

పోలవరంలో గైడ్ బండ్ కుంగింది. అందులో రహస్యమేముంది? నేను వ్యక్తిగతంగా వెళ్లి పరిశీలించి కుంగిందని ఆ రోజే చెప్పా. అది ప్రమాదకరం కాదని, సరి చేయవచ్చని పరిశీలన కమిటీ చెప్పింది. ఈనాడు కడుపు మంట అంతా నవయుగ నుంచి పోలవరం కాంట్రాక్టు పోయిందనే! దీనికన్నా ప్రమాదకరమైన ఘటన డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే ఈనాడు రామోజీ ఒక్క ముక్క కూడా రాయలేదు. ఎందుకంటే అది నవయుగ వారు చేశారు కాబట్టి!

కన్నా..! నా సవాల్‌ను స్వీకరించు

టీడీపీది బస్సు యాత్ర కాదు.. తుస్సు యాత్ర. ఆ పార్టీ కార్యకర్తలు కూడా రావడం లేదు. సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ నేను విసిరే మూడు సవాళ్లకు సమాధానం చెప్పాలి. రంగాని హతమార్చింది ఎవరో చెప్పు? నిన్ను చంపడానికి యత్నించిందెవరో చెప్పు? చివరి వరకూ చంద్రబాబుతోనే ఉంటావా.. పార్టీ ఫిరాయిస్తావా? అసలు ఎన్నికల వరకూ సత్తెనపల్లిలోనే ఉంటావా? పోటీ చేయకుండా పారిపోతావా?

దారిచూపిన 'గడప గడపకు'

- చదువుకుంటానంటూ 'గడప గడపకు మన ప్రభుత్వం'లో బాలిక విన్నపం
- కలెక్టర్ ఆదేశాల మేరకు కస్తూర్బా జూనియర్ కాలేజీలో సీటు
- బాలిక చదువుకు అయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందన్న కలెక్టర్


కౌన్సెలింగ్ అనంతరం జిల్లా కలెక్టర్ జి.సృజనతో నిర్మల

కర్నూలు(సెంట్రల్) : నిర్మల కోరిక నెరవేరింది. చదువుకోవడానికి మార్గం సుగమమైంది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో.. తాను చదువుకుంటానని.. అందుకు తన తల్లిదండ్రులను ఒప్పించాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని కోరడంతో కలెక్టర్ డాక్టర్ జి.సృజన స్పందించారు. బాలికను ఆస్పరి కస్తూర్బా జూనియర్ కాలేజీలో బైపీసీ గ్రూప్‌లో ఇంటర్ చదివేందుకు సీటు ఇప్పించారు. భవిష్యత్‌లోనూ ఆ బాలిక చదువుకు ఆటంకాలు లేకుండా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇందుకు అయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భర్తిస్తుందని భరోసా ఇచ్చారు. ఆదోని మండలం పెద్ద హరివణంకు చెందిన శ్రీనివాసులు, అనుమంతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు. వీరిలో నిర్మల చిన్న కుమార్తె. మిగిలిన ముగ్గురికి పెళ్లిళ్లయ్యాయి. నిర్మల చిన్నతనం నుంచే చదువులో రాణిస్తుండటంతో తల్లిదండ్రులు పదో తరగతి వరకు చదివించారు. 2022 మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 537 మార్కులు తెచ్చుకుంది. అయితే తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత ఆ బాలిక ఉన్నత చదువులకు శాపమైంది. చదువుకుంటానంటే తమకు అంత స్థోమత లేదని, ఇంటి దగ్గర ఉండాలని చెప్పారు. దీంతో గతేడాది ఇంటి దగ్గర ఉంటూ సాయంత్రం చిన్న పిల్లలకు ట్యూషన్లు చెబుతూ పొలం పనులకు వెళ్లేది. అయితే ఆ బాలికలో చదువుకోవాలన్న కోరిక మాత్రం అలానే ఉండిపోయింది. ఈ క్రమంలో బాలికకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం వరమైంది. ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, అధికారుల బృందం బుధవారం ఇంటింటికీ తిరుగుతూ ఆ బాలిక ఇంటికి చేరుకున్నారు. తాను పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్నానని, తాను ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్థోమత లేదని, ఆ దిశగా తనకు సాయం చేసి.. తన తల్లిదండ్రులను కూడా తనను చదివించేలా ఒప్పించాలని కోరింది. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. మరుసటి రోజు బాలిక ఉదంతం మీడియాలో రావడంతో పాటు ఎమ్మెల్యే కూడా ఆదేశించడంతో కలెక్టర్ డాక్టర్ సృజన వెంటనే స్పందించారు. బాలికను, ఆమె తల్లిదండ్రులను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి మాట్లాడి.. నిర్మలను కాలేజీలో చేర్పించేందుకు మార్గం సుగమం చేశారు. తాను ఐపీఎస్ అయి దేశానికి సేవ చేస్తానని నిర్మల సంతోషంగా చెప్పింది.

నిరుపేద ప్రాణాలు బలిగొన్న టీడీపీ

- 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమ జన సమీకరణకు మద్యం ఎర
- పూటుగా మద్యం తాగి ప్రాణాలు విడిచిన వండ్రయ్య
- అనంతపురం జిల్లాలో ఘటన


వండ్రయ్య

కణేకల్లు: 'భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో బస్సు యాత్ర చేస్తున్న టీడీపీ నేతలు జన సమీకరణ కోసం జనానికి మద్యాన్ని ఎరగా వేస్తున్నారు. ఓ వ్యక్తి ఇలా మోతాదుకు మించి ఇచ్చిన మద్యాన్ని తాగి మైకంలోనే ప్రాణాలు విడిచాడు. అనంతపురం జిల్లా కణేకల్లు పట్టణంలో ఈ విషాదం జరిగింది. టీడీపీ నేతలు చేపట్టిన బస్సు యాత్ర బుధవారం రాత్రి కణేకల్లుకు చేరింది. అప్పటికే బాగా పొద్దుపోవడంతో జనాన్ని అక్కడే ఉంచేందుకు ఆ పార్టీ నేతలు నానా తంటాలు పడ్డారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి జనాలను బలవంతంగా కణేకల్లుకు తీసుకొచ్చారు. ఇందుకు గాను ఒక్కొక్కరికి రూ.200తో పాటు మద్యం, బిర్యానీని ఎరగా వేశారు. దీంతో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో పలువురు కణేకల్లుకు చేరుకున్నారు. సాయంకాలం జరగాల్సిన సభ ఆలస్యమై.. రాత్రి 8.15 గంటలకు జరిగింది. జనం కదిలిపోకుండా ఉండేందుకు ఆ పార్టీ నేతలు భారీగా మద్యాన్ని పంచారు. ఈ క్రమంలో బొమ్మనహాళ్ మండలం దర్గాహోన్నూరు గ్రామానికి చెందిన వండ్రయ్య(58) సభకు హాజరై మోతాదుకు మించి మద్యం తాగాడు. మద్యం మత్తులో ఉన్న అతను తిరిగి స్వగ్రామానికి వెళ్లలేని స్థితిలో బస్టాండ్ ప్రాంతంలో నిలిచి ఉంచిన ఓ పికప్ వాహనంలో నిద్రపోయి.. తెల్లారేసరికి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య సుంకమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఇంటికి పెద్దదిక్కైన వండ్రయ్య మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. వండ్రయ్య మృతదేహానికి రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి చెప్పారు.

అధికారంలోకొస్తే బెట్టింగ్ యాప్‌లు నిషేధిస్తాం..

- విద్యార్థులతో ముఖాముఖిలో లోకేశ్
- ఓ విద్యార్థి 'జై జగన్' నినాదంతో ఉలికిపాటు

చిల్లకూరు(తిరుపతి జిల్లా) : టీడీపీ అధికారంలోకొస్తే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు నిషేధిస్తామని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా చిల్లకూరు మండలం కాకువారిపాళెం గ్రామం వద్ద గురువారం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 8 లక్షల ఉద్యోగాలిచ్చామని మళ్లీ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామన్నారు. యువత తప్పుదోవ పట్టకుండా ఆన్‌లైన్‌లో ఉన్న బెట్టింగ్ యాప్‌లను నిషేధిస్తామని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యలో సమూల మార్పులు తెచ్చి పాత విద్యా విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే మొదటి 100 రోజుల్లో 77 జీవోను రద్దు చేస్తామన్నారు. ఆ సమయంలో ఓ విద్యార్థి 'జై జగన్' అని నినాదం చేయడంతో లోకేశ్‌తో పాటు అక్కడున్న తెలుగుదేశం నాయకులు ఉలిక్కిపడ్డారు.

టీడీపీ బస్సుయాత్రలో తొక్కిసలాట..

కుర్మా పాత్రలో పడి ఒకరి మృతి

- ఇరుకు రోడ్డులో భోజనాల ఏర్పాటుతో ప్రమాదం
- పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లిలో ఘటన


కోటేశ్వరరావు (ఫైల్)

పిడుగురాళ్లరూరల్: పల్నాడు జిల్లాలో టీడీపీ బస్సు యాత్ర సందర్భంగా ఇరుకు రోడ్డులో ఏర్పాటు చేసిన భోజనాల వద్ద తొక్కిసలాట జరిగి ఒక వ్యక్తి కుర్మా పాత్రలో పడి మృతిచెందాడు. ఈ దుర్ఘటన బుధవారం రాత్రి బ్రాహ్మణపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యరగాని కోటేశ్వరరావు (50) ముఠా మేస్త్రిగా పనిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ బస్సుయాత్రలో భాగంగా బుధవారం రాత్రి గ్రామంలో బహిరంగసభ ఏర్పాటు చేశారు. దీని కోసం వచ్చిన కార్యకర్తలకు, అభిమానులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కోటేశ్వరరావు భోజనం ఏర్పాటు చేసిన ప్రదేశానికి వెళ్లాడు. ఆ ప్రాంతం ఇరుకు రోడ్డు కావటం, అంతా ఒక్కసారిగా భోజనాలకు రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ సమయంలో కోటేశ్వరరావు అప్పుడే వండి తీసుకొచ్చిన కుర్మా పాత్రలో పడ్డాడు. కోటేశ్వరరావును బయటకుతీసి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే శరీరం బాగా ఉడికిపోయిందని, మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించమని వైద్యులు సూచించారు. కోటేశ్వరరావును గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి తరువాత మృతిచెందాడు. కోటేశ్వరరావు కుమారుడు వెంకటేశ్వర్లు చేసిన ఫిర్యాదు మేరకు పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ ఆంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపూర్ణ మద్యపాన నిషేధం ఎక్కడా సాధ్యం కాలేదు


- పాత పద్ధతిలోనే మద్యం విక్రయిస్తాం
- లిక్కర్ వ్యాపారంలో శెట్టిబలిజలకు ప్రాధాన్యత
- జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్



సాక్షి, భీమవరం: దేశంలో ఎక్కడా సంపూర్ణ మద్యపాన నిషేధం సాధ్యం కాలేదని, అందువల్ల పాత పద్ధతిలోనే మద్యం విక్రయాలు అమలు చేస్తూ లిక్కర్ వ్యాపారంలో శెట్టిబలిజలకు ప్రాధాన్యత ఇవ్వాలని మేనిఫెస్టోలో పొందుపరుస్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చెప్పారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన శెట్టిబలిజ, గౌడ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్లును నిషేధించి చీప్ లిక్కర్‌ను పెంచడం వల్ల గౌడ, శెట్టిబలిజ కులాల వారు ఆదాయాన్ని కోల్పోతున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీసీలంతా ఒక్కటిగా ఉండాలని, బీసీ కులాలు రాజ్యాధికారం చేపట్టాలన్నది తన కోరికని చెప్పారు. అందువల్లే తూర్పు గోదావరి జిల్లాలో కాపులు, శెట్టిబలిజ కులస్తుల మధ్య ఉన్న గొడవలను ఆత్మీయ సమ్మేళనంతో తానే తగ్గించానని తెలిపారు. సంఖ్యాబలం ఉన్న కులాల్లో ఐక్యత ఉండదన్నారు. యువత అభివృద్ధి చెందడానికి రూ.10 లక్షలు రుణం ఇస్తామని చెప్పారు. తనకు అన్ని కులాలూ సమానమేనని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా కులాలను విడదీయనని తెలిపారు. నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

వాజ్‌పేయిని ఒప్పించి తొలిరోడ్డు వేశాం

- హైదరాబాద్‌లో మనం తెచ్చిన మైక్రో సాఫ్ట్‌లోనే సత్య నాదెళ్ల పనిచేశాడు
- టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి, అమరావతి: మలేసియాలో రోడ్లు చూసిన తాను వాజ్‌పేయిని ఒప్పించి నెల్లూరు నుంచి చెన్నై వరకు తొలి రోడ్డు వేశామని, సత్య నాదెళ్ల హైదరాబాద్‌లో మనం తెచ్చిన మైక్రోసాఫ్ట్‌లో పని చేశారు కాబట్టి ఇప్పుడు దానికి సీఈవో అయ్యారని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పుకున్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సీవీ నాయుడు తన అనుచరులతో చంద్రబాబు సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ.. నాలెడ్జ్ అనేది కేవలం ఇంగ్లీష్‌తోనే రాదన్నారు. తెలుగులో చదివిన సత్య నాదెళ్ల, తమిళంలో చదివిన సుందర్ పిచాయ్ ఉన్నత స్థానాలకు వెళ్లారన్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయని చెప్పారు. నాడు రూ.364 కోట్లు ఖర్చు చేసి 5 వేల మందిని విదేశీ విద్యకు పంపించామని, ఇప్పుడు జాబ్ క్యాలెండర్ లేదని, ఉద్యోగాలు లేవని అన్నారు. విభజనకంటే జగన్ వల్ల ఎక్కువ నష్టపోయామని అన్నారు. ఏపీలో భూముల ధరలు పడిపోయాయన్నారు.

ఓటరు జాబితాలో అక్రమాలపై పోరాటం

ఓటరు జాబితాలో అక్రమాలపై నిరంతరం పోరాటం చేయాలని చంద్రబాబు టీడీపీ నేతలకు సూచించారు. పార్టీ చేపట్టిన ఓటర్ వెరిఫికేషన్‌పై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎలక్షన్ కమిటీ సభ్యులతో చంద్రబాబు సమీక్షించారు.

పంచ్ డైలాగులతో ప్రజల మనసు గెలవలేవు

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



శ్రీశైలం టెంపుల్: మీసాలు మెలేసి, తొడలు కొట్టి, సినిమా పంచ్ డైలాగులు చెప్పి.. ప్రజల మనసులను గెలుచుకోలేరని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. గురువారం శ్రీశైలంలో మల్లికార్జునస్వామికి నిర్వహించిన సహస్ర ఘటాభిషేకంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికలప్పుడు కూడా వైఎస్ జగన్‌ను సీఎం కానివ్వను.. ఇది నా శాసనమంటూ పవన్ సినిమా డైలాగులు చెప్పారని మంత్రి గుర్తు చేశారు. కానీ భగవంతుడి అనుగ్రహం, ప్రజల ఆశీస్సులతో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. అధికారం చేపట్టిన రోజు నుంచే హామీలను నెరవేరుస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలకు దిక్కుతోచని విధంగా సీఎం జగన్ పరిపాలన చేస్తున్నారన్నారు. ప్రజల మనసుల్లో స్థానం సంపాదించిన ఆయన్ని సింగిల్‌గా ఎదుర్కోలేక.. అందరూ ఏకమవుతున్నారని విమర్శించారు. వంగవీటి రంగాను చంపించిన చంద్రబాబుతో చేతులు కలిపిన పవన్‌కళ్యాణ్‌ను కాపు వర్గం నమ్మడం లేదన్నారు.

టీడీపీ నేత ప్రవీణ్‌ను విచారించాలి

- ఆయన ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చాలి
- హోం మంత్రి, డీజీపీ, ఎస్పీలకు ఫిర్యాదు చేశా
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : తనపై ఆరోపణలు చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు విచారించి నిజాలు నిగ్గు తేల్చాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కోరారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. తాను, తన బావమరిది బంగారు మునిరెడ్డి కలసి ముగ్గురిని హత్య చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రవీణ్ అంటున్నారని, అందుకు ఆయన్ని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించాలని అన్నారు. ఆయన ఆరోపణ వాస్తవమైతే ఆ ముగ్గురిని ప్రాణాపాయం నుంచి కాపాడాలని, తమ హస్తం ఉంటే కేసు నమోదు చేయాలని కోరారు. ప్రవీణ్ చెప్పింది అవాస్తవం అయితే ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై రాష్ట్ర హోం మంత్రికి, డీజీపీకి, ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. 48 గంటల్లో ఆయన్ని విచారించకపోతే శివాలయం సెంటర్‌లో సత్యాన్వేషణ దీక్ష చేపడతానని హెచ్చరించారు. తాము ఎక్కడా సెంటు భూమిని ఆక్రమించలేదని, ఎవరిదీ అంగుళం భూమి రాయించుకోలేదని, ఏనాడూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వినియోగించుకుని అక్రమాలకు పాల్పడలేదని, రేణువంతైనా ఇసుక అక్రమ రవాణా చేయలేదని స్పష్టంచేశారు. ఎక్కడైనా ఆక్రమించినట్లు నిరూపిస్తే 2024 ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని అన్నారు. కావాలంటే రిటైర్డు జడ్జితో విచారణ జరిపించాలని కోరతానన్నారు. ప్రవీణ్ ప్రమాదకరమైన ఆరోపణలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ప్రవీణే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా మామూళ్లు వసూలు చేస్తున్నారని, సత్యనారాయణ అపార్ట్‌మెంట్ యజమానిని, తహసీల్దార్ కార్యాలయంలో, బయో డీజిల్ వ్యవహారంలో బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. కడపలో ఇద్దరి హత్య జరిగితే సీఎం జగన్ జిల్లాలో హత్యలంటూ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
30-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)	
సెన్సెక్స్	నిఫ్టీ
499 ▲	155 ▲
63,915	18,972

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,581	▽	11
డోజోన్స్	34,098	▲	245
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,472	▽	22
డాక్స్	15,947	▽	2
షాంఘై	3,182	▽	7
నికాయ్	33,234	▲	40

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఇంటర్‌గ్లోబ్ విలువ

రూ. లక్ష కోట్లు

- ఈ ఫీట్ సాధించిన తొలి ఎయిర్‌లైన్స్
- ఈ ఏడాది షేరు 30 శాతంపైగా ర్యాలీ

న్యూఢిల్లీ: ఇండిగో బ్రాండ్ విమానయాన సేవల కంపెనీ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) తొలిసారి రూ. లక్ష కోట్లను తాకింది. వెరసి దేశీయంగా ఈ మైలురాయిని చేరిన తొలి ఎయిర్‌లైన్స్ కంపెనీగా చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది ఇప్పటివరకూ షేరు 30 శాతంపైగా దూసుకెళ్లడంతో కంపెనీ తాజా ఫీట్‌ను సాధించింది. ఇదే కాలంలో సెన్సెక్స్ 5 శాతమే బలపడటం గమనార్హం! బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఇండిగో షేరు



3.6 శాతం జంప్‌చేసింది. బీఎస్ఈలో రూ. 2,620కు చేరగా.. ఎన్ఎస్ఈలో రూ. 2,621 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో రూ. 2,634 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకింది. వెరసి కంపెనీ మార్కెట్ విలువ రూ. 1,01,007 కోట్లను అధిగమించింది. సోమవారం ఎయిర్‌బస్ నుంచి 500 విమానాల కొనుగోలుకి ఆర్డర్ జారీ చేసింది. తద్వారా ఎయిర్‌బస్ చరిత్రలోనే భారీ కాంట్రాక్టుకు తెరతీసింది. దీర్ఘకాలిక వృద్ధిలో భాగంగా భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించడంతో ఇండిగో కౌంటర్ జోరందుకుంది. ఇందుకు సరికొత్త గరిష్టాలకు చేరిన స్టాక్ మార్కెట్లు సైతం దోహదపడినట్లు విశ్లేషకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశీయంగా అతిపెద్ద విమానయాన కంపెనీగా నిలుస్తున్న ఇండిగో అంతర్జాతీయంగా విస్తరించేందుకూ ప్రణాళికలు అమలు చేస్తోంది. దేశీయంగా కంపెనీ మార్కెట్ వాటా 61 శాతానికిపైగా నమోదుకావడం విశేషం!

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-6-2023	
విశాఖ	550-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
29-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

పదేళ్లలో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులు

అదానీ టోటల్ గ్యాస్ భారీ ప్రణాళికలు • సీఎన్‌జీ రిటైలింగ్ విస్తరణపై మరింత దృష్టి

న్యూఢిల్లీ: అదానీ టోటల్ గ్యాస్ (ఏజీటీఎల్) భారీ స్థాయిలో కార్యకలాపాలను విస్తరించనుంది. ఇందుకోసం వచ్చే 8–10 ఏళ్లలో రూ. 18,000 – రూ. 20,000 కోట్లు వెచ్చించనుంది. తద్వారా వాహనాలకు సీఎన్‌జీ, గృహాలు .. పరిశ్రమలకు పైపింగ్ గ్యాస్ సరఫరాకు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచుకోనుంది. కంపెనీ సీఎఫ్‌వో పరాగ్ పారిఖ్ ఈ విషయాలు తెలిపారు. సంస్థ వార్షిక నివేదికలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో అదనంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 1,150 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు. దీర్ఘకాలిక దృష్టి కోణం నుంచి చూస్తే పర్యావరణ అనుకూల ఇంధనంగా గ్యాస్‌కు డిమాండ్ సానుకూలంగా ఉన్న నేపథ్యంలో మరింతగా పెట్టుబడులు పెట్టనున్నట్లు పారిఖ్ పేర్కొన్నారు. అదానీ గ్రూప్, ఫ్రెంచ్ సంస్థ టోటల్ఎనర్జీస్ కలిసి జాయింట్ వెంచర్‌గా అదానీ-టోటల్‌ను ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 124 జిల్లాల్లో కంపెనీ కార్యకలాపాలు సాగిస్తోంది. 460 పైచిలుకు సీఎన్‌జీ స్టేషన్లు, 7 లక్షలకు పైగా పైప్డ్ కుకింగ్ గ్యాస్ కస్టమర్లు ఉన్నారు.

1,800 సీఎన్‌జీ స్టేషన్ల ఏర్పాటు..

వచ్చే 7-10 సంవత్సరాల్లో 1,800 పైచిలుకు సీఎన్‌జీ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఏజీటీఎల్ సీఈవో సురేష్ పి.మంగ్లానీ తెలిపారు. మరిన్ని గృహాలకు పైప్డ్‌గ్యాస్‌ను అందించడంపై దృష్టి పెడుతున్నట్లు పేర్కొన్నారు.



ప్రధానమైన గ్యాస్ సరఫరా వ్యాపారాన్ని పెంచుకోవడంతో పాటు .. బయోగ్యాస్, ఈవీ చార్జింగ్ తదితర విభాగాలను కూడా మరింతగా విస్తరించనున్నట్లు వివరించారు. ఈ-మొబిలిటీ కోసం అదానీ టోటల్ఎనర్జీస్ ఈ-మొబిలిటీ పేరిట అనుబంధ సంస్థను నెలకొల్పినట్లు, ఇది ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు కార్లు, బస్సులు మొదలైన వాటి కోసం ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంగ్లానీ చెప్పారు. ఇప్పటికే తమకు 26 ప్రాంతాల్లో 104 చార్జింగ్ పాయింట్లు ఉండగా, వీటిని 3,000కు పెంచుకోనున్నట్లు తెలిపారు. అటు మరో అనుబంధ సంస్థ అదానీ టోటల్ఎనర్జీస్ బయోమాస్ (ఏటీబీఎల్) దేశంలోనే అతి పెద్ద కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటును ఉత్తర్‌ప్రదేశ్ మథుర దగ్గర్లోని బర్సానాలో నెలకొల్పుతున్నట్లు మంగ్లానీ చెప్పారు.

దక్షలో కోరమాండల్‌కు మెజారిటీ వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డ్రోన్ సేవల్లో ఉన్న దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు చెందిన కోరమాండల్ టెక్నాలజీ మరో 32.68 శాతం వాటాను చేజిక్కించుకుంది. దీంతో దక్షలో కోరమాండల్ వాటా 51.02 శాతానికి ఎగబాకింది. డీల్ విలువ రూ.204 కోట్లు.



'ఇండస్‌ఇండ్' ప్రణాళికకు ఆర్‌క్యాప్ రుణదాతల ఆమోదం

న్యూఢిల్లీ: హిందుజా గ్రూప్ సంస్థ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ సమర్పించిన పరిష్కార ప్రణాళికకు రిలయన్స్ క్యాపిటల్ (ఆర్‌క్యాప్) రుణదాతలు ఆమోదముద్ర వేశారు. రెండో రౌండ్ బిడ్డింగ్‌లో ఐఐహెచ్ఎల్ అత్యధికంగా రూ. 9,661 కోట్లు ఆఫర్ చేసింది. దీంతో ముందస్తుగా అత్యధిక మొత్తంలో నగదును రికవర్ చేసుకునే అవకాశం ఉండటంతో 99% బ్యాంకర్లు.. ఐఐహెచ్ హోల్డింగ్స్ ప్రణాళికకే ఓటు వేసినట్లు సమాచారం.



ఐసీఐసీఐ సెక్యూరిటీస్ డీలిస్టింగ్

ఐసీఐసీఐ బ్యాంకుకు పూర్తి అనుబంధ సంస్థగా ఏర్పాటు

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ చేసే ప్రతిపాదనను బోర్డు ఆమోదించినట్లు ప్రైవేట్ రంగ ఐసీఐసీఐ బ్యాంకు వెల్లడించింది. తద్వారా పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించనున్నట్లు తెలియజేసింది. పథకంలో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వాటాదారులకు తమవద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంకు షేర్లను జారీ చేయనున్నట్లు తెలియజేసింది.



ఆరుగురు ఉద్యోగులపై టీసీఎస్ చర్యలు

ముంబై: కొన్ని రిక్రూట్‌మెంట్ సంస్థలతో కుమ్మక్కై, వాటికి ప్రయోజనాలు చేకూర్చేలా వ్యవహరించినందుకు గాను ఆరుగురు ఉద్యోగులపై ఐటీ దిగ్గజం టీసీఎస్ చర్యలు తీసుకుంది. నైతిక నియమావళిని పాటించలేదని విచారణలో తేలడంతో ఆరుగురు ఉద్యోగులను, అలాగే ఆరు సంస్థలను నిషేధించినట్లు సంస్థ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. మరో ముగ్గురు ఉద్యోగుల పాత్రపైనా సంస్థ విచారణ జరుపుతోందని ఆయన షేర్‌హోల్డర్లకు వెల్లడించారు. కొందరు ఉద్యోగుల తప్పుడు ప్రవర్తన గురించి ఇద్దరు ప్రజావేగుల నుంచి కంపెనీకి ఫిర్యాదులు రావడం, టీసీఎస్‌లో ఉద్యోగాలకు లంచాలు తీసుకుంటున్నారని.. తత్సంబంధ వ్యక్తులు ఈ రకంగా కనీసం రూ. 100 కోట్లు సంపాదించారని ఇటీవల మీడియాలో వార్తలు రావడం నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, సంపన్న దేశాల్లో అనిశ్చితితో రాబోయే కొన్ని త్రైమాసికాల్లో వ్యాపారానికి ఒడిదుడుకులు తప్పకపోవచ్చని, అయితే మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా చూస్తే అవకాశాలు ఆశావహంగానే ఉన్నాయని చంద్రశేఖర్ వివరించారు.




డివిడెండ్‌పై హర్షం

కెనరాబ్యాంక్ 21వ షేర్‌హోల్డర్ల సమావేశం



బెంగళూరు: కెనరా బ్యాంక్ బోర్డ్ 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుకు రూ. 12 డివిడెండ్ సిఫారసు చేయడంపై షేర్ హోల్డర్లు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన షేర్‌హోల్డర్ల 21 వార్షిక సార్వత్రిక సమావేశం యాజమాన్యంపై పూర్తి విశ్వాసాన్ని వెలిబుచ్చింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజును చిత్రంలో తిలకించవచ్చు. ఇదిలావుండగా, రూపే క్రెడిట్ కార్డ్‌ల ద్వారా వ్యాపారులకు యూపీఐ చెల్లింపులను ఆఫర్ చేస్తున్నట్లు మరో ప్రకటనలో బ్యాంక్ తెలిపింది. తద్వారా ఈ తరహా సేవలు ప్రారంభిస్తున్న మొదటి ప్రభుత్వ రంగ బ్యాంక్‌గా కెనరా బ్యాంక్ నిలిచిందని పేర్కొంది.

లాభదాయకతకు దగ్గర్లో బైజూస్



న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ నెమ్మదిగా, స్థిరంగా వృద్ధి చెందుతోందని సంస్థ సీఈవో బైజూ రవీంద్రన్ తెలిపారు. గ్రూప్ స్థాయిలో లాభదాయకతకు చాలా దగ్గర్లోనే ఉన్నామని ఆయన చెప్పారు. బైజూస్ వృద్ధి, భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితిపై ఆందోళనలను తొలగించేందుకు నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా రవీంద్రన్ ఈ విషయాలు తెలిపారు. 1.2 బిలియన్ డాలర్ల టర్మ్ లోన్ బీ (టీఎల్‌బీ) రుణదాతలతో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, మరికొన్ని వారాల్లోనే సానుకూల ఫలితం రాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. అంతర్జాతీయంగా టెక్ కంపెనీలు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ బైజూస్ మాత్రం లాభదాయకత లక్ష్యాల దిశగా గణనీయంగా పురోగతి సాధించిందని రవీంద్రన్ చెప్పారు. బైజూస్ ఆర్థిక పని తీరు, రుణ భారం, ఆర్థిక ఫలితాలను ప్రకటించడంలో జాప్యాలు, కంపెనీ వేల్యుయేషన్‌ను ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రోసస్ 6 బిలియన్ డాలర్లకు కుదించడం తదితర ప్రతికూల పరిణామాల నేపథ్యంలో రవీంద్రన్ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

సాక్షి స్పోర్ట్స్




భారత ఫుట్‌బాల్ జట్టు ర్యాంక్ 100

స్వదేశంలో ఇటీవల జరిగిన ఇంటర్ కాంటినెంటల్‌కప్ నాలుగు దేశాల టోర్నీలో టైటిల్ సాధించినందుకు భారత జట్టు ర్యాంకింగ్స్‌లో పురోగతి కనిపించింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) తాజా ర్యాంకింగ్స్‌లో సునీల్ ఛెత్రి సారథ్యంలోని భారత పురుషుల జట్టు సరిగ్గా 100వ స్థానంలో నిలిచింది. క్రితంసారి భారత్ 101వ ర్యాంక్‌లో నిలువగా... ఈసారి ఒక స్థానం మెరుగుపర్చుకుంది. 2019 ఫిబ్రవరి 7 తర్వాత భారత జట్టు మళ్లీ టాప్-100లోకి రావడం ఇదే తొలిసారి. 2019 ఫిబ్రవరిలో భారత్ 97వ ర్యాంక్‌లో నిలిచింది. ఆ తర్వాత భారత ర్యాంక్ పడిపోయింది. 1996లో భారత్ అత్యుత్తమంగా 94వ ర్యాంక్‌లో నిలిచింది. ప్రస్తుతం భారత జట్టు స్వదేశంలో జరుగుతున్న దక్షిణాసియా చాంపియన్‌షిప్‌లో బరిలో ఉంది. రేపు జరిగే సెమీఫైనల్లో లెబనాన్ జట్టుతో టీమిండియా తలపడుతుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... ఫ్రాన్స్ రెండో ర్యాంక్‌లో, బ్రెజిల్ మూడో ర్యాంక్‌లో ఉన్నాయి.

జింబాబ్వే మరింత ముందుకు...

'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో ఒమన్‌పై విజయం

- సీన్ విలియమ్స్ భారీ సెంచరీ
- కశ్యప్ ప్రజాపతి శతకం వృథా


సీన్ విలియమ్స్


కశ్యప్ ప్రజాపతి

బులవాయో: మరోసారి సమష్టి ప్రదర్శనతో అదరగొట్టిన జింబాబ్వే జట్టు వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి అర్హత సాధించే దిశగా మరో అడుగు ముందుకు వేసింది. లీగ్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన జింబాబ్వే... గురువారం మొదలైన 'సూపర్ సిక్స్' దశలోనూ శుభారంభం చేసింది. ఒమన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 14 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచిన ఒమన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 332 పరుగులు సాధించింది. వన్‌డౌన్ బ్యాటర్ సీన్ విలియమ్స్ (103 బంతుల్లో 142; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒమన్ బౌలర్లపై విరుచుకుపడి ఈ టోర్నీలో రెండో సెంచరీ, కెరీర్‌లో ఏడో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సికందర్ రజా (49 బంతుల్లో 42; 6 ఫోర్లు)తో కలిసి నాలుగో వికెట్‌కు సీన్ విలియమ్స్ 102 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. చివర్లో ల్యూక్ జోంగ్వి (28 బంతుల్లో 43 నాటౌట్; 4 ఫోర్లు) దూకుడుగా ఆడటంతో జింబాబ్వే భారీ స్కోరు నమోదు చేసింది. ఒమన్ బౌలర్ ఫయాజ్ భట్ 79 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. 333 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లకు 318 పరుగులు చేసి ఓడిపోయింది. గుజరాత్‌లో జన్మించి ఒమన్ జట్టుకు ఆడుతున్న ఓపెనర్ కశ్యప్ ప్రజాపతి (97 బంతుల్లో 103; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. ఆకిబ్ ఇలియాస్ (45; 5 ఫోర్లు), జీషాన్ మక్సూద్ (37; 3 ఫోర్లు, 1 సిక్స్), అయాన్ ఖాన్ (47; 5 ఫోర్లు), నదీమ్ (30 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా పోరాడటంతో ఒకదశలో ఒమన్ లక్ష్యం దిశగా సాగుతున్నట్లు అనిపించింది. అయితే కీలక తరుణాల్లో జింబాబ్వే బౌలర్లు వికెట్లు పడగొట్టి ఒమన్ ఓటమిని ఖరారు చేశారు. జింబాబ్వే బౌలర్లలో చటారా, ముజరబాని మూడు వికెట్ల చొప్పున తీయగా... ఎన్‌గరవాకు రెండు వికెట్లు దక్కాయి. సీన్ విలియమ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. నేడు జరిగే రెండో 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో శ్రీలంక తలపడుతుంది.


'టాప్ ర్యాంక్'లోకి...

ఒమన్‌పై విజయంతో జింబాబ్వే 'సూపర్ సిక్స్' దశలో ఆరు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది. లీగ్ దశలో గ్రూప్ 'ఎ'లోని నెదర్లాండ్స్, వెస్టిండీస్ జట్లపై జింబాబ్వే గెలవడం... ఆ రెండు జట్లు కూడా 'సూపర్ సిక్స్' దశకు చేరుకోవడంతో... జింబాబ్వే 'సూపర్ సిక్స్' పోటీలను నాలుగు పాయింట్లతో మొదలుపెట్టింది. తాజాగా ఒమన్‌పై నెగ్గిన జింబాబ్వే రెండు పాయింట్లు సాధించింది. జింబాబ్వే రన్‌రేట్ కూడా (0.75) బాగుంది. ఫలితంగా రన్‌రేట్‌లో చాలా వెనుకబడ్డ వెస్టిండీస్ (-0.35) జట్టు వన్డే ప్రపంచకప్‌కు అర్హత పొందాలంటే 'సూపర్ సిక్స్'లో మూడు మ్యాచ్‌ల్లోనూ భారీ విజయాలు సాధించాల్సి ఉంటుంది. 'సూపర్ సిక్స్'లో తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్ చేరే రెండు జట్లకు ప్రపంచకప్ బెర్త్‌లు లభిస్తాయి.

ఇంగ్లండ్ పోరాటం...

- ఆశలన్నీ స్టోక్స్, బ్రూక్‌పైనే
- ప్రస్తుతం 278/4
- స్మిత్ సెంచరీ
- ఆస్ట్రేలియా 416 ఆలౌట్

లండన్: యాషెస్ సిరీస్ రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు పోరాటం సాగిస్తోంది. ఒకదశలో 188/1తో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్ జట్టు 34 పరుగుల తేడాలో మూడు వికెట్లు కోల్పోయి 222/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో మరో రెండు వికెట్లు పడి ఉంటే ఇంగ్లండ్ ఇన్నింగ్స్ కుప్పకూలేది! కానీ హ్యారీ బ్రూక్ (51 బంతుల్లో 45 బ్యాటింగ్; 4 ఫోర్లు), కెప్టెన్ బెన్ స్టోక్స్ (57 బంతుల్లో 17 బ్యాటింగ్; 1 ఫోర్) పట్టుదలతో ఆడి ఐదో వికెట్‌కు అజేయంగా 56 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దారు. ఫలితంగా రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 61 ఓవర్లలో 4 వికెట్లకు 278 పరుగులు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (48; 5 ఫోర్లు) రెండు పరుగులతో అర్ధ సెంచరీ... డకెట్ (98; 9 ఫోర్లు) రెండు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నారు. ఓలీ పోప్ (42; 4 ఫోర్లు) రాణించగా, జో రూట్ (10) విఫలమయ్యాడు. ఆస్ట్రేలియా స్కోరుకు ఇంగ్లండ్ మరో 138 పరుగుల దూరంలో ఉంది. మూడో రోజు స్టోక్స్, బ్రూక్‌లతోపాటు బెయిర్‌స్టో క్రీజులో నిలబడితే ఇంగ్లండ్ జట్టు ఈ మ్యాచ్‌పై ఆశలు ఉంచుకోవచ్చు. ఆసీస్ మేటి స్పిన్నర్ నాథన్ లయన్ కాలి పిక్క గాయం కారణంగా మూడో రోజు బౌలింగ్‌కు దిగుతాడో లేదో అనుమానం. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 339/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 77 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 416 పరుగులవద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (110; 15 ఫోర్లు) కెరీర్‌లో 32వ సెంచరీ సాధించడం విశేషం. ఇంగ్లండ్ బౌలర్లలో రాబిన్సన్, జోష్ టంగ్ మూడు వికెట్ల చొప్పున తీశారు.


స్టీవ్ స్మిత్

22 టెస్టుల్లోని తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా స్మిత్ నిలిచాడు. ఇప్పటి వరకు స్మిత్ తొలి ఇన్నింగ్స్‌లో 22 సెంచరీలు చేశాడు. 21 సెంచరీలతో రికీ పాంటింగ్ పేరిట ఉన్న రికార్డును స్మిత్ సవరించాడు.



భారత్‌కు నాలుగో విజయం


బుసాన్ (దక్షిణ కొరియా): ఆసియా పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా నాలుగో విజయం సాధించింది. ఇరాన్ జట్టుతో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పవన్ సెహ్రావత్ కెప్టెన్సీలోని భారత జట్టు 33–28 పాయింట్ల తేడాతో గెలిచింది. పవన్, అర్జున్ దేశ్వాల్, అస్లామ్ ఇనామ్‌దార్ చక్కటి రెయిడింగ్‌తో నిలకడగా పాయింట్లు రాబట్టారు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత్ ఫైనల్ చేరడం దాదాపు ఖాయమైంది.

చీఫ్ సెలెక్టర్ రేసులో అగార్కర్!



ముంబై: భారత జట్టు మాజీ ఆల్‌రౌండర్ అజిత్ అగార్కర్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ పదవి నుంచి వైదొలిగాడు. బీసీసీఐ చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్ నియమితుడయ్యే అవకాశాలు ఉండటమే దీనికి కారణం. 45 ఏళ్ల అగార్కర్ భారత్ తరఫున 191 వన్డేలు, 26 టెస్టులు, నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడాడు. మరోవైపు చీఫ్ సెలెక్టర్ వార్షిక వేతనం పెంచే ఆలోచనలో బీసీసీఐ ఉంది. ప్రస్తుతం చీఫ్ సెలెక్టర్‌కు ఏడాదికి రూ. 1 కోటి లభిస్తుండగా... కమిటీలోని సభ్యులకు రూ. 90 లక్షల చొప్పున ఇస్తున్నారు.

తొలిసారి ఏటీపీ టోర్నీ ఫైనల్లో యూకీ బాంబ్రీ



మలోర్కా (స్పెయిన్): భారత అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారుడు యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో తొలిసారి ఏటీపీ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించాడు. మలోర్కా ఓపెన్ ఏటీపీ-250 టోర్నీ లో యూకీ బాంబ్రీ (భారత్)-లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా) జోడీ డబుల్స్ విభాగంలో టైటిల్ పోరుకు చేరింది. సెమీఫైనల్లో యూకీ-హారిస్ ద్వయం 6-4, 7-6 (7/2)తో టాప్ సీడ్ గొంజాలెజ్ (మెక్సికో)-వాసెలిన్ (ఫ్రాన్స్) జోడీపై సంచలన విజయం సాధించింది.

నిశాంత్, హర్షిత్ సెంచరీలు

నార్త్ జోన్ 540/8 డిక్లేర్డ్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో భాగంగా నార్త్ ఈస్ట్ జోన్ జట్టుతో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్లో నార్త్ జోన్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 306/6 రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన నార్త్ జోన్ జట్టు 8 వికెట్లకు 540 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. నిశాంత్ సింధు (245 బంతుల్లో 150; 18 ఫోర్లు, 3 సిక్స్‌లు), హర్షిత్ రాణా (86 బంతుల్లో 122 నాటౌట్; 12 ఫోర్లు, 9 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. నిశాంత్‌తో కలిసి హర్షిత్ ఎనిమిదో వికెట్‌కు 104 పరుగులు... సిద్ధార్థ్ కౌల్ (9 నాటౌట్)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 64 పరుగులు జోడించాడు.


హర్షిత్


నిశాంత్


అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ ఈస్ట్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది.

సెంట్రల్ జోన్‌కు ఆధిక్యం

ఈస్ట్ జోన్ జట్టుతో జరుగుతున్న మరో క్వార్టర్ ఫైనల్లో సెంట్రల్ జోన్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఓవరాల్‌గా 124 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు జవాబుగా ఈస్ట్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 42.2 ఓవర్లలో 122 పరుగులకే ఆలౌటైంది. సెంట్రల్ జోన్ బౌలర్లలో అవేశ్ ఖాన్, సౌరభ్ కుమార్ మూడు వికెట్ల చొప్పున తీశారు. 60 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన సెంట్రల్ జోన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 64 పరుగులు సాధించింది.

విదేశాల్లో బజరంగ్, వినేశ్ శిక్షణ

న్యూఢిల్లీ: ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్ సెలెక్షన్ ట్రయల్స్‌కు సమాయత్తమయ్యేందుకు భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్ విదేశాల్లో శిక్షణ తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపించగా వాటికి ఆమోదం లభించింది. బజరంగ్ 36 రోజుల శిక్షణ కోసం కిర్గిస్తాన్‌ను... వినేశ్ 18 రోజుల శిక్షణకు హంగేరిని ఎంచుకున్నారు. ఆగస్టు రెండో వారంలో ట్రయల్స్ జరగనుండగా... వచ్చే వారంలో వీరు విదేశాలకు బయలుదేరుతారు. వినేశ్ వెంట ఫిజియోథెరపిస్ట్ అశ్విని జీవన్ పాటిల్, కోచ్ సుదేశ్, ప్రాక్టీస్ భాగస్వామిగా సంగీత ఫొగాట్... బజరంగ్ వెంట కోచ్ సుజీత్ మాన్, ఫిజియోథెరపిస్ట్ అనూజ్, ప్రాక్టీస్ భాగస్వామి జితేందర్, స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ నిపుణుడు కాజీ హసన్ వెళతారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బ్రిజ్ భూషణ్‌పై లైంగిక ఆరోపణల కేసును కోర్టులోనే తేల్చుకుంటామని బజరంగ్, వినేశ్ ప్రకటించారు.





క్లుప్తంగా...

కాకతీయ టు కారకోరం!


- 7,500 కి.మీ మేర యాత్ర చేపట్టిన నేవల్ డాక్ యార్డ్



కారు యాత్ర ప్రారంభోత్సవ దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళ అనుబంధ నేవల్ డాక్‌యార్డ్ నుంచి కే టూ కే (కాకతీయ టూ కారకోరం) పేరుతో కారు యాత్ర ప్రారంభమైంది. కాకతీయ నుంచి భారత్ పాకిస్తాన్ బోర్డర్‌లో ఉన్న కారకోరం పర్వత శ్రేణి వరకు ఈ యాత్ర నిర్వహించనున్నట్లు నేవల్ మెటీరియల్ చీఫ్ వైస్ అడ్మిరల్ సందీప్ తెలిపారు. జూలై 19 వరకు జరిగే ఈ కేటూకే లో ఉద్యోగిణులతో సహా మొత్తం 20 మంది నౌకాదళ ఉద్యోగులు పాల్గొంటున్నారు. 28 రోజుల వ్యవధిలో పలు నగరాల మీదుగా 7,500 కి.మీ మేర కార్ ఎక్స్‌పిడిషన్ సాగనుంది. సముద్ర భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, అగ్నిపథ్‌పై యువతలో ప్రేరణ కలిగించడంతో పాటు..సాయుధ దళాల్లో నారీశక్తిని చాటి చెప్పేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నారు.

ఆర్‌జీఎం కింద రూ.73 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు: సీఎస్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐవీఎఫ్ సాంకేతిక (కృత్రిమ గర్భధారణ) విధానంలో మేలుజాతి ఆవుల సంతతిని, తద్వారా పాల ఉత్పత్తిని మరింత పెంపొందించే లక్ష్యంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం) పథకం కింద రూ.73 కోట్ల అంచనాతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి చెప్పారు. ఆయన గురువారం తన క్యాంపు కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ, శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులతో పాలవెల్లువ తదితర కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా రాష్ట్రంలో మేలు జాతి ఆవుల సంతతిని మరింత వృద్ధిచేసి తద్వారా పాల దిగుబడులను పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే సాహివాల్, ముర్రా, గిర్ తదితర మేలుజాతి ఆవుల పిండాలను సేకరించి ఐవీఎఫ్ సాంకేతికతతో కృత్రిమ విధానంలో మేలుజాతి ఆవుల సంతతిని మరింత పెంచనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు మంజూరైతే రాష్ట్రంలోని తిరుపతి, గుంటూరులోని లాంఫాం, నెల్లూరు జిల్లాలోని చింతలదీవి ఫాంలలో కృత్రిమ గర్భధారణ విధానంలో మేలుజాతి ఆవుల సంపద వృద్ధికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

మీటర్లకు కొరత లేదు

- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ



సాక్షి, అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) పరిధిలో విద్యుత్ మీటర్లకు, ముఖ్యంగా త్రీ ఫేజ్ మీటర్లకు కొరత లేదని ఆ సంస్థ సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి తెలిపారు. విద్యుత్ మీటర్లపై ఈనాడు రాసిన వార్తలపై ఆయన స్పందించారు. డిస్కం పరిధిలోని విజయవాడ స్టోర్స్‌లో 1,800 మీటర్లు, గుంటూరు స్టోర్స్‌లో 1,000 మీటర్లు, ఒంగోలు స్టోర్స్‌లో 600 మీటర్లు, సీఆర్‌డీఏ కోసం 600 మీటర్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్ తీసుకునే వారికే ఈ మీటర్లు కేటాయించాలని ఆదేశించామని స్పష్టం చేశారు. ప్రజలు విద్యుత్ కనెక్షన్లు పొందడంలో ఎటువంటి ఇబ్బంది కలిగినా 94910 66751 నంబర్‌లో ఆ అధికారిని సంప్రదించాలని సూచించారు.

తిరుపతిలోనే తెలుగు అకాడమీ: లక్ష్మీపార్వతి

తిరుపతి కల్చరల్: వికేంద్రీకరణలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతికి కేటాయించిన తెలుగు అకాడమీ కేంద్ర కార్యాలయం తిరుపతి నుంచే పనిచేస్తుందని, ఎలాంటి అనుమానం వద్దని తెలుగు–సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి స్పష్టం చేశారు. అకాడమీ కార్యాలయ నిర్మాణం కోసం రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త మాకిరెడ్డి పురుషోత్తంరెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజుతో కలిసి ఆమె తిరుపతి పరిసర ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలించారు.

నిరాధార ఆరోపణలపై కఠిన చర్యలు: వాసిరెడ్డి

సాక్షి, అమరావతి: మహిళా కమిషన్ చైర్‌పర్సన్ తమను బెదిరిస్తున్నారని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన వ్యక్తులు ఆరోపించడం పూర్తిగా అవాస్తవమని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేస్తామని గురువారం ఆమె ప్రకటన విడుదల చేశారు. దురుద్దేశపూర్వకంగా తన ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆరోపించిన వ్యక్తులు ఎవరో కూడా తనకు తెలియదని, దీని వెనుక ఎవరు ఉన్నారో విచారణలో తేలుతుందన్నారు.

విద్యుత్ బిల్లుల మొత్తం నెల ముందే

రైతుల ఖాతాల్లో జమ

స్మార్ట్ మీటర్లతో రైతులపై విద్యుత్ భారం పైసా పడదు

- ఎవరూ చేతి నుంచి ముందుగా చెల్లించాల్సిన పనిలేదు
- ఒక నెల అడ్వాన్సుగానే రైతుల ఖాతాల్లో జమ

సాక్షి, అమరావతి: అసత్య కథనాలతో సర్కారుపై బురద చల్లడమే ఈనాడు, పచ్చపత్రికల పనైపోయింది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఆ పత్రికలు ప్రచురించిన అవాస్తవాలతో కూడిన కథనాలను ఇంధన శాఖ ఖండించింది. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ కొనసాగుతుందని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని స్పష్టం చేసింది. స్మార్ట్ మీటర్ల కారణంగా రైతులపై ఒక్క పైసా భారం పడదని తేటతెల్లం చేసింది. విద్యుత్ బిల్లులు రైతులు ముందుగా చెల్లించాల్సిన అవసరం కూడా లేదని, బిల్లుల మొత్తం నెల ముందుగానే రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపింది. ఆ తర్వాత రైతు ఖాతా నుంచి డిస్కంలకు వెళ్తాయని వెల్లడించింది. ఇందులో రైతులు ముందస్తుగా చెల్లించడం లేదా సొంత డబ్బు చెల్లించడం వంటివి ఉండవని స్పష్టం చేసింది. మొత్తం ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. అలాగే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాత కూడా వివిధ వర్గాలకు ప్రభుత్వం ఇస్తున్న విద్యుత్ రాయితీలు యథాతథంగా అమలవుతాయని తెలిపింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వాస్తవాలను వెల్లడించారు. నిజాలను మరుగనపెట్టి పేదలు, రైతుల్లో అపోహలు కల్పించేలా కథనాలు ప్రచురించవద్దని ఆ పత్రికలను హెచ్చరించారు.

అంశాలవారీగా ఆయన వెల్లడించిన వాస్తవాలిలా ఉన్నాయి...

ఆరోపణ: ఇకపై నేరుగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందదు

వాస్తవం: వ్యవసాయ రంగానికి **ఉచిత** విద్యుత్ యథాతథంగా కొన**సాగుతుంది.** వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం వల్ల ఉచిత విద్యుత్ ఉండదని ఎవరూ అపోహ పడాల్సిన పనిలేదు. రానున్న 30 ఏళ్ల పాటు వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ కొనసాగిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలుమార్లు విస్పష్టంగా చెప్పారు.

ఆరోపణ: రైతులు ముందుగానే బిల్లులు చెల్లించాలి

వాస్తవం: రైతులు ముందస్తుగా బిల్లులు చెల్లించాల్సిన పనిలేదు. వ్యవసాయానికి విద్యుత్ వినియోగించుకున్నందుకు రైతులు చెల్లించాల్సిన బిల్లుల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. దాని నుంచే డిస్కంలకు వెళుతుంది. అంతేకాదు.. ఈ నగదును ప్రభుత్వం ముందుగానే రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. అందువల్ల రైతులు డిస్కంలకు ముందుగా బిల్లులు చెల్లించాల్సిన అగత్యం ఉండదు. రైతులకు అందించే విద్యుత్ అంతా ఉచితమే. రైతులు జేబు నుంచి ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఏ విధంగా ఉచిత విద్యుత్ పొందుతున్నారో, అదే విధంగా ఇక మీదట కూడా పొందుతారు. ఉచిత విద్యుత్తుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది.

ఆరోపణ: వ్యవసాయ రంగంతో పాటు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తున్న అన్ని వర్గాలకు సంబంధించిన బిల్లులకు ఇకపై ఇదే విధానం అవలంబించాలి

వాస్తవం: వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు అయ్యే మొత్తంతో పాటు వివిధ వర్గాలకు ఇస్తున్న రాయితీల మొత్తాన్ని కూడా ప్రభుత్వమే డిస్కంలకు చెల్లిస్తుంది. ఆయా వర్గాల సబ్సిడీలకు ఎలాంటి ఢోకా ఉండదు.

ఆరోపణ: కేంద్రం చెప్పిన వాటిని అంగీకరిస్తే రాష్ట్రానికి మరో రూ.7 వేల కోట్ల అదనపు అప్పు తీసుకోవడానికి ఆస్కారం లభిస్తుంది

వాస్తవం: విద్యుత్ రంగం బలోపేతానికి సంస్కరణలు అమలు చేయాలని రాష్ట్రంలో కొన్ని దశాబ్దాల క్రితమే నిర్ణయం జరిగింది. అప్పటి నుంచి వీటిని దశలవారీగా అమలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ లైన్ల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాల ద్వారా విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం రుణాలను సద్వినియోగం చేసుకుంటోంది.

ఆరోపణ: ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలి.

వాస్తవం: ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు ఎంత విద్యుత్ వినియోగించుకుంటాయో ఆ మేరకు బిల్లులను అవి చెల్లిస్తాయి. స్థానిక సంస్థలు వాటి నిధులతోనే బిల్లులు చెల్లిస్తాయి.

ఆరోపణ: పంపిణీ నష్టాలు తగ్గించుకోవాలి.

వాస్తవం: ఇందులో తప్పేముంది? విద్యుత్ వృథాను తగ్గించుకోవద్దా? వృథా చేయాలా? ఏయే రంగాలు ఎంతెంత విద్యుత్ వాడుకుంటున్నాయో కచ్చితమైన లెక్కలు తేలితేనే పంపిణీ నష్టాల లెక్కలు తేలతాయి. సంస్కరణల ద్వారా పంపిణీ నష్టాలను తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే చెబుతోంది. పంపిణీ నష్టాలను తగ్గించేందుకు డిస్కంలు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాయి. పంపిణీ నష్టాలు తగ్గించడమంటే విద్యుత్ వృథాను తగ్గించడమనే అర్థం.

ఆరోపణ: విద్యుత్ సరఫరాకు, వస్తున్న ఆదాయానికి మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాలి.

వాస్తవం: పంపిణీ నష్టాలను (విద్యుత్ వృథా/లైన్ లాసెస్) తగ్గించడం ద్వారా చాలా వరకు ఇది సాధ్యమవుతుంది. ఆదాయ, వ్యయాల మధ్య అంతరం లేకుండా చేయడమంటే నష్టాలు లేకుండా చేయడమే. డిస్కంల లక్ష్యం కూడా ఇదే.

ఆరోపణ: ఒకే లబ్ధిదారు విద్యుత్ రంగంలో రెండు రకాల సబ్సిడీలు పొందకుండా చూడాలి.

వాస్తవం: సబ్సిడీల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నందున దీనివల్ల డిస్కంలపై ఎలాంటి ప్రభావం ఉండదు. సబ్సిడీలు ఎలా ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఇష్టం.

ఆరోపణ: విద్యుత్ రంగంలో ఆర్థిక అంశాలన్నీ పారదర్శకంగా ఉండాలి. ప్రభుత్వాలు ఎంత సబ్సిడీ భరిస్తున్నాయి? డిస్కంలకు ఎంత బాకీ పడ్డాయనేది స్పష్టంగా వెల్లడించాలన్నవి కేంద్ర ప్రభుత్వ షరతులు

వాస్తవం: ఇవి మంచివే కదా. వీటిని అమలు చేయడంలో తప్పేముంది? పూర్తి పారదర్శకంగా ఉంచాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుత ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పక్కాగా సబ్సిడీ మొత్తాలను డిస్కంలకు విడుదల చేస్తోంది.

ఆరోపణ: వ్యవసాయ రంగంతోపాటు ఏయే రంగాలు ఎక్కడెక్కడ ఎంతెంత విద్యుత్ వినియోగిస్తున్నాయో మీటర్ల ద్వారా స్పష్టంగా లెక్కలు తేల్చాలి. మొత్తం విద్యుత్ వినియోగంలో ఎంత శాతానికి మీటర్ల వ్యవస్థ ఏర్పాటైందో కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుంది.

వాస్తవం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం కూడా అదే. ఏయే రంగాలు ఎంతెంత విద్యుత్ వినియోగిస్తున్నాయో స్పష్టమైన లెక్కలు తేల్చాలనే ఉద్దేశంతోనే అన్ని చోట్లా స్మార్ట్ మీటర్లు అమర్చాలని విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) నిర్ణయించాయి. ప్రతి విద్యుత్ కనెక్షన్‌కు మీటరు ఉంటుంది.

ఎన్నో ఉపయోగాలు

స్మార్ట్ మీటర్లతో అనేక లాభాలు ఉన్నాయని, అందువల్లే వీటి ఏర్పాటుకు అంగీకరించామని విజయానంద్ వివరించారు. 'ఈ మీటర్లతో ఏ సమయంలో ఎక్కడ ఎంత విద్యుత్ వినియోగం అవుతోందో తెలుస్తుంది. తద్వారా ఎంత లోడ్ అవసరమో కచ్చితమైన లెక్క ఉంటుంది. ఆ మేరకు విద్యుత్ సరఫరా చేయవచ్చు. లోడ్‌కి సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, సబ్‌స్టేషన్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయొచ్చు. ఎంత విద్యుత్ అవసరమో అంత సరఫరా కావడం వల్ల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవు. లోవోల్టేజి, హైవోల్టేజి, ఇతర అంతరాయాలు ఉండవు. మీటర్లు, స్విచ్, ఎర్త్ వైరు వంటి వస్తువులన్నీ నాణ్యమైన వాటినే విద్యుత్ కంపెనీనే అమరుస్తుంది. దీనివల్ల షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలూ ఉండవు. వీటన్నిటి ద్వారా నాణ్యమైన విద్యుత్ వినియోగదారులకు అందుతుంది. ఒకవేళ ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో లోపాలున్నా, నాణ్యత లోపించినా వెంటనే సంబంధిత శాఖలను నిలదీసే అవకాశం ఉంటుంది. తద్వారా విద్యుత్ సంస్థల్లో జవాబుదారీ తనం కూడా మెరుగవుతుంది' అని వివరించారు.

డేటా సెంటర్ల కేంద్రం.. విశాఖ!

▶ మొదటి పేజీ తరువాయి

ముంబై, చెన్నై, హైదరాబాద్‌లపై ఆధారపడాల్సిన అవసరం లేకుండానే విశాఖ డేటా కేంద్రాలు స్థానిక అవసరాలను తీర్చనున్నాయి.

సింగపూర్ నుంచి ఓఎఫ్‌సీ

డేటా సెంటర్లలో ఇంటర్నెట్ డేటాను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల (ఓఎఫ్‌సీ)ద్వారా సమాచారాన్ని సేకరించడం జరుగుతోంది. ఇందుకోసం కేవలం భూమి మీదనే కాకుండా.. సముద్రగర్భం నుంచి వేస్తున్న ఓఎఫ్‌సీనే కీలకం. ఒక అంచనా ప్రకారం సముద్రాల్లో ఏర్పాటు చేసిన 9 లక్షల మైళ్ల ఓఎఫ్‌సీ ద్వారా 95 శాతం డేటా నిత్యం ప్రసారమవుతోంది. విశాఖలో ఏర్పాటుకానున్న అదానీ డేటా సెంటర్‌కు కూడా సింగపూర్ నుంచి సముద్రగర్భం ద్వారా వేస్తున్న ఓఎఫ్‌సీ ద్వారానే డేటా ప్రసారం కానుంది. 200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అదానీ డేటా సెంటర్‌తో ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్స్‌కు కూడా ఇబ్బందులు తొలగిపోను న్నాయి. ఇంటర్నెట్ సేవల్లో వేగం పెంచడం, స్థానిక అవసరాలను తీర్చడం కోసం ఇప్పటికే డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తున్నట్టు నిక్సీ ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా చర్యలు ప్రారంభించింది.

అమెరికా వర్సెస్ చైనా...!

ప్రపంచవ్యాప్తంగా డేటా కేంద్రాల ఏర్పాటు విషయంలో చైనా ముందంజలో ఉంది. అయితే, సముద్రగర్భంలో ఏర్పాటు చేస్తున్న ఓఎఫ్‌సీ విషయంలో మాత్రం అమెరికా సంస్థల పెత్తనం ఉంటోంది. తాజాగా ఆసియా, పశ్చిమాసియా, ఐరోపా దేశాలను కలుపుతూ సింగపూర్ టు ఫ్రాన్స్ వరకూ ఏర్పాటవుతున్న ఓఎఫ్‌సీ పనులను కూడా అమెరికాకు చెందిన సబ్‌కామ్ కన్సార్టియం దక్కించుకుంది. ఈ సముద్రగర్భంలో ఏర్పాటు చేస్తున్న ఓఎఫ్‌సీలోనూ పైచేయి సాధించేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. తాజాగా చైనా చేసిన ప్రయత్నాలు అమెరికా ఎత్తులతో చిత్తయ్యాయి. ఇక రానున్న రోజుల్లో ఈ సముద్రగర్భ ఓఎఫ్‌సీ మార్కెట్‌లో భారత్ సంస్థలూ పోటీ పడనున్నాయి. ఈ మార్కెట్‌లోకి రిలయన్స్, అదానీ వంటి సంస్థలు అడుగుపెట్టాయి. అందులో భాగంగా సింగపూర్ నుంచి విశాఖకు ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లను అదానీ సంస్థనే వేసుకోనుండటం గమనార్హం.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



బక్రీద్ సందర్భంగా గురువారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

గంగా తరంగం.. కాదిక నిరంతరం

మరో 80 ఏళ్ల తరువాత హిమాలయ నదుల్లో వర్షాకాలంలోనే నీటి ప్రవాహం

- వాతావరణ మార్పుల కారణంగా భారీగా పెరుగుతున్న భూతాపం
- దీనివల్ల మంచు కురిసే ప్రాంతాల్లో అధిక వర్షపాతం
- హిమాలయాల నుంచి ఆల్ప్స్ పర్వతాల వరకూ ఇదే పరిస్థితి
- బర్క్‌లీ, మిచిగాన్ యూనివర్సిటీల సంయుక్త అధ్యయనంలో వెల్లడి



పావన గంగా తరంగం.. బ్రహ్మపుత్ర గాంభీర్యం.. సింధునదీ సోయగం ఇక గతమే అంటోంది ఓ అధ్యయనం. మరో ఎనభై ఏళ్ల తరువాత ఈ జీవనదుల్లో వర్షాకాలంలోనే నీటి ప్రవాహం ఉంటుందని చెబుతోంది. భారత ఉపఖండానికి హిమాలయాలే జీవగర్ర, ఇక్కడ పుట్టిన గంగ, సింధు, బ్రహ్మపుత్ర వంటి జీవనదులు ఉపఖండంలోని మెజారిటీ భాగాన్ని సస్యశ్యామలం చేస్తూ భారత దేశాన్ని ప్రపంచానికే అన్నపూర్ణగా మారుస్తున్నాయి. హిమాలయాల్లో జరిగే ప్రతి మార్పూ భారత ఉపఖండంపై పెను ప్రభావం చూపుతుంది. అటువంటి హిమాలయాలు భూతాపం కారణంగా ప్రస్తుతం సంకటస్థితిని ఎదుర్కొంటున్నాయి. ధ్రువప్రాంతాలు మినహాయిస్తే భూగోళంలో అత్యధిక హిమపాతం కనిపించే హిమాలయాల్లో మరికొన్నేళ్లలో మంచు మటుమాయమైపోతుందని తాజా అధ్యయనంలో తేలింది.

సాక్షి, అమరావతి: ఉత్తరార్ధగోళంలో 1950 నుంచి 2019 వరకు ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ, వర్షపాతం, హిమపాతం తదితర వాతావరణ సంబంధిత గణాంకాలపై బర్క్‌లీ–మిచిగాన్ యూనివర్సిటీలు సంయుక్తంగా అధ్యయనం చేశాయి. యూరోపియన్ సెంటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని ఈ రెండు యూనివర్సిటీల ప్రొఫెసర్లు లోతుగా విశ్లేషించారు. ఆ గణాంకాలను 2024 నుంచి 2100 వరకూ వర్తింపజేసి వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంలో ముఖ్యాంశాలు ఇవీ..

- పర్యావరణ కాలుష్యం కారణంగా వాతావరణంలో జరుగుతున్న మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఉష్ణోగ్రతలు ఒక డిగ్రీ పెరిగితే.. ఉత్తరార్ధగోళంలో హిమాలయపర్వతాల నుంచి యూరప్‌లో విస్తరించిన ఆల్ప్స్ పర్వతాల వరకూ వర్షపాతం 15 శాతం పెరుగుతోంది. ఆ మేరకు హిమపాతం తగ్గుతోంది.
- ఉత్తరార్ధగోళంలో మన దేశానికి ఉత్తర సరిహద్దుగా ఉన్న హిమాలయాల నుంచి యూరప్‌లోని ఆల్ప్స్ అమెరికాలోని రాకీ పర్వతాల వరకూ చూస్తే.. హిమాలయాల్లోనే అధిక వర్షపాతం నమోదవుతోంది. ఆ మేరకు హిమపాతం గణనీయంగా తగ్గుతోంది.
- హిమాలయాల్లో పుట్టిన గంగ, సింధు, బ్రహ్మపుత్ర నదులు, వాటి ఉప నదుల్లో ఆకస్మిక వరదలకు ప్రధాన కారణం.. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు వర్షపాతం పెరగడమే. ఈ వరదల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో పాటు సారవంతమైన నేల కోతకు గురవుతోంది. ఈ ప్రభావం వల్ల హిమాలయాలకు దిగువన నివసించే కోట్లాది ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతోంది.
- హిమాలయపర్వతాల్లో ప్రధానంగా హిందూకుష్ పర్వత శ్రేణుల్లో హిమనీనదాలు (గ్లేసియర్స్) కరుగుదల ఇటీవలి కాలంలో 65 శాతం పెరిగినట్లు ఐసీఐఎంవోడీ (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెయిన్ డెవలప్‌మెంట్) సంస్థ తేల్చింది. 2100 నాటికి హిందూకుష్ పర్వతాల్లోని హిమనీనదాలు ప్రస్తుతం ఉన్న పరిమాణంలో 80 శాతం మాయం కావడం ఖాయమని ఆ సంస్థ పేర్కొంది.
- హిమపాతం తగ్గడం, హిమనీనదాలు వేగంగా కరుగుతుండటాన్ని బట్టి చూస్తే జీవనదులైన గంగ, బ్రహ్మపుత్ర, సింధు వంటి నదులు, వాటి ఉప నదుల్లో 2100 తరువాత వర్షాకాలంలో మాత్రమే నీటి ప్రవాహం కనిపిస్తుంది. మిగతా సమయాల్లో ఆ జీవనదులు ఎండిపోవడం ఖాయం. దీనివల్ల భారతదేశ ప్రజల ఆహార అవసరాలు తీర్చడంలో అత్యంత కీలకమైన గంగా సింధు మైదానానికి నీటి లభ్యత కష్టమే.

తెలంగాణ

8న కాజీపేటకు ప్రధాని మోదీ

సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జూలై 8న తెలంగాణ పర్యటనకు రానున్నారు. వరంగల్ జిల్లా కాజీపేటలో వ్యాగన్ ఓవర్ హాలింగ్ సెంటర్ నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేస్తారు. ప్రధాని హెలికాప్టర్‌లో కాజీపేట మండలం మడికొండ–అయోధ్యపురం గ్రామాల మధ్య నిర్మాణ స్థలానికి చేరుకొని శంకుస్థాపన చేస్తారు. తర్వాత వరంగల్ భద్రకాళి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి వరంగల్ జిల్లా సంగెంకు వెళ్లి మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రారంభిస్తారు. కాజీపేట–కరీంనగర్ కొత్త రైలు మార్గానికి కూడా ఆయన శంకుస్థాపన చేస్తారని తెలుస్తోంది. కాగా సాయంత్రం హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించనున్నారు.

రైల్వే ఖాళీల భర్తీపై ప్రధానికి ఆర్. కృష్ణయ్య లేఖ

సాక్షి, హైదరాబాద్: రైల్వే శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 3.22 లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ప్రకటన జారీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య లేఖలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. రైల్వేలో తరుచుగా ప్రమాదాలకు గురికావడానికి కారణం సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలే కారణమన్నారు. వీటిని నివారించాలంటే మానవవనరుల సంఖ్య పెంచాల్సి ఉందని తెలిపారు.

ఈటలకు ముప్పుందన్న పోలీసులు!

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు పోలీసు అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. సుపారీ గ్యాంగ్‌లు తనను హతమార్చడానికి తిరుగుతున్నాయని ఈటల రాజేందర్‌తోపాటు, ఆయన భార్య జమున కూడా రెండురోజుల కిందట ఆరోపించడం తెలిసిందే. వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్ డీజీపీ అంజనీకుమార్‌తో మాట్లాడారు. మేడ్చల్ డీసీపీ సందీప్‌రావు ఈటల ఇంటికి వెళ్లి ఆయనతో చర్చించారు. హుజురాబాద్ జిల్లా పర్యటన సమయంలో అనుమానాస్పద కార్లు తిరగడంపై ఈటల రాజేందర్ డీసీపీకి వివరించినట్టు తెలిసింది. డీసీపీ గురువారం ఈటల భద్రతపై నివేదికను సీల్డ్ కవర్‌లో డీజీపీకి అందజేశారు. ఈటల ప్రాణాలకు ముప్పుందన్న వార్తలు రావడంతో కేంద్రం ఆయనకు వై కేటగిరి భద్రత కల్పించాలని యోచించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే ఆ భద్రతను కల్పించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి కేటీఆర్ సూచించిన నేపథ్యంలోనే పోలీసులు ఈ కసరత్తు చేయడం గమనార్హం. భద్రతను కల్పించడంపై ప్రభుత్వం నేడో రేపో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఉద్యమ గాయకుడు సాయిచంద్ కన్నుమూత

సాక్షి, రంగారెడ్డి జిల్లా/సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణ అమరులను స్మరిస్తూ, ఆటాపాటాతో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతలూగించిన ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ (39) కన్నుమూశారు. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన సాయిచంద్ బుధవారం రాత్రి కుటుంబంతో కలసి నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కారుకొండలోని తమ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. రాత్రి పదిన్నర గంటలకు ఆయనకు ఛాతీలో నొప్పిరావడంతో నాగర్‌కర్నూల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గచ్చిబౌలి కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. భౌతిక కాయాన్ని తెలంగాణ సీఎం కేసీఆర్ గురువారం ఉదయం సందర్శించి నివాళి ఘటించారు.

మూడేళ్ల బాలుని ఊపిరి తీసిన కొబ్బరి ముక్క

కుషాయిగూడ (హైదరాబాద్): కొబ్బరి ముక్క గొంతులో ఇరుక్కుపోయి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. కుషాయిగూడలో గురువారం జరిగిన ఈ విషాద సంఘటన వివరాలివి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆరుపల్లి శ్రీనివాస్ చాలాకాలం క్రితం నగరానికి వచ్చి ఆటో నడుపుకొంటూ ఇక్కడే స్థిరపడ్డాడు. శ్రీనివాస్‌కు భార్య త్రివేణి, యశ్వంత్ (5), జశ్వంత్ (3) ఇద్దరు సంతానం. గురువారం తొలి ఏకాదశి కావడంతో కుటుంబ సభ్యులంతా కలిసి కాలనీలోని సాయిబాబా ఆలయానికి వెళ్లి వచ్చారు. జశ్వంత్ గుడి నుంచి తెచ్చిన కొబ్బరిముక్క ప్రసాదం తింటుండగా గొంతులో ఇరుక్కుపోయి ఊపిరాడక చనిపోయాడు.

ఆర్బీకేల్లో పంటల బీమా జాబితాలు

- జూలై 3 వరకు అభ్యంతరాల స్వీకరణ
- జూలై 8న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా పరిహారం పంపిణీ



చిత్తూరు జిల్లా నంజంపేట ఆర్బీకేలో లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తున్న రైతులు


సాక్షి, అమరావతి: ఖరీఫ్–2022 సీజన్‌లో పంటల్ని నష్టపోయిన రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా జూలై 8వ తేదీన నిర్వహించే రైతు దినోత్సవం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి నష్టపరిహారాలను జమ చేయనున్నారు. పంట నష్టపోయిన రైతుల జాబితాలను ఆర్బీకేల్లో గురువారం నుంచి ప్రదర్శిస్తున్నారు. జూలై 3వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అనంతరం తుది జాబితాలను ప్రకటిస్తారు.

10.20 లక్షల మంది రైతులకు పరిహారం

ఖరీఫ్–2022 సీజన్‌లో దిగుబడి ఆధారిత పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనతో కలిపి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తుండగా.. వాతావరణ ఆధారిత పంటలకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేస్తోంది. నోటిఫై చేసిన దిగుబడి ఆధారిత పంటలకు సంబంధించి రైతుల వాటాతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను బీమా కంపెనీలకు చెల్లించింది. ఖరీఫ్–2022 సీజన్‌లో పంటలు నష్టపోయిన వారిలో 10.20 లక్షల మంది అర్హత పొందగా.. వీరికి రూ.1,117.21 కోట్ల పరిహారం చెల్లించాలని లెక్క తేల్చారు. దిగుబడి ఆధారిత పంటలకు సంబంధించి రూ.572.59 కోట్లు, వాతావరణ ఆధారిత పంటలకు సంబంధించి రూ.544.62 కోట్లు చెల్లించాలని లెక్కతేల్చారు. అర్హుల జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. పంట విస్తీర్ణం తదితర అంశాలపై ఏదైనా అభ్యంతరాలుంటే సంబంధిత ఆర్బీకేలో జూలై 3వ తేదీ వరకు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

23 రైల్వేస్టేషన్ల మూసివేత

- 25 టికెట్లు అమ్ముడుకాని స్టేషన్ల మూసివేతకు ఆదేశాలు
- మే 1 నుంచి మూసివేసిన 16 స్టేషన్లు
- జూన్ 1 నుంచి 7 స్టేషన్ల మూసివేత



జూన్ 1 నుంచి మూసివేసిన 7 స్టేషన్ల లిస్ట్

ఏలూరు (టూటౌన్): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలోని 23 రైల్వేస్టేషన్లను మూసివేసేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కృష్ణా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 23 స్టేషన్లు మూతపడ్డాయి. ఇప్పటికే ఈ స్టేషన్ల పరిధిలోని సిబ్బందిని చాలా వరకు ఇతర రైల్వే స్టేషన్లకు సర్దుబాటు చేశారు. రవాణా సాధనాలు పెరగడం, రోడ్డు మార్గాలు అందుబాటులోకి రావడంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగే స్టేషన్లు మినహా ప్యాసింజర్ రైళ్లు ఆగే వివిధ రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణికుల రాకపోకలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి.

మూసివేతకు కారణాలివీ..

కనీసం రోజుకు 25 మంది ప్రయాణికులు కూడా రాకపోకలు సాగించని రైల్వే స్టేషన్లను మూసివేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. రోజుకు ఒకటి, రెండు టికెట్లు మాత్రమే అమ్ముడవుతున్న చోట్ల బుకింగ్స్ నిలిపివేయాలనే నిర్ణయానికి వచ్చారు.

మూసివేసిన స్టేషన్లు ఇవే..

మే 1వ తేదీ విజయవాడ డివిజన్ పరిధిలోని ఎన్ఎస్‌జీ–6 కేటగిరీలో ఉన్న 16 స్టేషన్ల మూసివేతకు తొలుత డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేశారు. అభ్యంతరాలేవీ రాకపోవడంతో అల్లూరు రోడ్డు, బాదంపూడి, బయ్యవరం, చాగల్లు, దెందులూరు, హంసవరం, ముస్తాబాద, నవాబ్‌పాలెం, పెన్నాడ అగ్రహారం, పెద అవుటపల్లి, రావికంపాడు, తాడి, శ్రీ వెంకటేశ్వరపాలెం, తాలమంచి, తేలప్రోలు, వట్లూరు రైల్వే స్టేషన్లను మూసివేశారు. జూన్ 1 నుంచి 7 రైల్వేస్టేషన్లను మూసివేయగా.. ఆ జాబితాలో కొలనుకొండ, వీరవల్లి, ఉంగుటూరు, బ్రాహ్మణగూడెం, బలభద్రపురం, తిమ్మాపురం, చింతపర్రు స్టేషన్లు ఉన్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.